ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4 అణాలు

17-6-'53.



కూటికోసం...

ఫోటో—శ్రీ పి. శివరామరాజు (మద్రాసు.)



డిస్ట్రిబ్యూటర్సు:

ఆంధ్రా - వినోదా పిక్చర్సు సర్క్యూటు, విజయవాడ. ★ సీడెడ్ - నవయుగ ఫిలిమ్సు, గుంతకల్లు. ★ నైజాము - ప్రీమియర్ పిక్చర్సు, సికింద్రాబాదు. ★ మైసూరు - తల్లం పిక్చర్సు సర్క్యూటు, బెంగుళూరు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక, 4 అ.

సంపుటము 45
సంచిక 42
17.6-53


సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO


విజయ జ్యేష్ఠ శుద్ధ షష్ఠి; బుధవారం

ముఖచిత్రం:— ఇటీవల విడుదలయిన చంద్రకళాపిక్చర్సువారి, "శుకరంభ"లో నిరూపరాయ్.


కర్నూలు, దాని పరిసరాలు.

చరితను స్ఫురణకు తెచ్చేశిథిలం—నవాబులకోట—(ఫోటోలు—శ్రీ వి. తంగి)






కాబోయే
రాజ్ భవన్ ?



హంద్రీ నదిగట్టున గుమ్మటం.
(బోర్డు ఆఫ్ రివెన్యూ ఆఫీసు?)



ఉస్మానియా కాలేజి



రాజవీధి

[illegible]




[illegible]




అంగాడి కడియాల సుబ్బారావుగారి
భవనము




జిల్లా జడ్జికోర్టు ఆవరణలో
ప్రకృతిశోభ



టౌన్‌హాలు
(శాఖోతకు అసెంబ్లీ?)




పారడైజ్ పార్కు
భూలోకనందన వనం!



వేసవికాలంలో కూడా తుంగ
భద్రలో నీళ్లు వుంటాయి!

నగర రజకుల చాకిరేవు—
తుంగభద్రానది.





ఎటువేపు చూసినా
చిట్టడవి.

[illegible]క్షేపం

తమ కార్యంబు పరిత్యజించియు
బరార్థ ప్రాపకుల్ సజ్జనుల్;
తమకార్యంబు ఘటించుచుఁ బర
హితార్థ వ్యాపృతుల్ మధ్యముల్;
దమకై యన్యహితార్థ ఘాతుకజనుల్
దైత్యుల్;-వృధాన్యార్థ భం
గము గావించెడువార లెవ్వరో
యెఱుంగన్ శక్యమే యేరికిన్?

తా॥ తమ పనులను వదలుకొని ఇతరుల యొక్క పనులను చేసిపెట్టేవారు సజ్జనులు. తమ పనులను తాము నెరవేర్చుకొనుచూ యితరుల పనులకు తోడ్పడేవారు మధ్యములు. తమ ప్రయోజనంకొరకై యితరుల శ్రేయస్సుకు విఘాతము కలుగజేసేటటువంటివారు రాక్షసులు. తమకు కలిగే ప్రయోజనం ఏమీ లేకపోయినప్పటికీ, వృధాగా యితరుల లాభప్రయోజనములను భంగపరచి నష్టపరచేటటువంటి వారిని ఏమని పిలువవలెనో ఎవరైనా చెప్పగలరా?

తన్ను మాలిన ధర్మంగాని మొదలు చెడిన బేరంగాని ఎవ్వడూ చెయ్యడు. ఇది సామాన్య వ్యాపార వ్యవహారం. రూపాయికి కొన్న వస్తువును ఎవడైనా 14 అణాలకు అమ్ముతాడా? వ్యాపారం చేసేవాడు లాభానికి అమ్ముతాడుగాని నష్టానికి అమ్మడు. కాని, ఒక్కొక్కప్పుడు వస్తువుల ధరలు అకస్మికంగా పడిపోతూ ఉంటాయి. ఇదివరలో 1932 సం॥లో దేశమంతటనూ ఆర్థికమాంద్యం వచ్చింది. అప్పుడు ఉత్తర సర్కారులలో ధాన్యం ధర పడిపోయింది. అదివరకు యకరము 1 కి వెయ్యిరూపాయలు లేదా రూ 1500 చొప్పున అమ్మిన పల్లపు శేరీ డెల్టాభూమి యొక్క ధర రూ 500 లకు తగ్గిపోయింది. కాని, అంతకుపూర్వపు సంవత్సరములలో ధాన్యపుధర చాలా హెచ్చుస్థాయిలోకి వెళ్లింది. ధాన్యంధర ముమ్ముందు ఇంకా పెరుగుతుంది అనే ఆశతో యిరుగుపొరుగు వ్యవసాయ భూములను ఆసాములు ఆశపడి పోటీలుపడి ఎంత ధరఅయినా యిచ్చి విలను వెర్రిగా కొన్నారు. చేతిలో పైకము హాజరుగా లేకపోయినప్పటికీ, హెచ్చు వడ్డీలకు ఋణములను తెచ్చి భూములను కొన్నారు. ధరలు అకస్మాత్తుగా తగ్గినప్పుడు ఋణదాతలు తమ బాకీలను తీర్చివేయవలసినదిగా ఒత్తిడిచేయడం సాగించారు. అట్టిసందర్భంలో యకరము 1 కి రూ 1500 చొప్పున కొన్నటువంటి భూములను యకరము 1 కి రూ 500 చొప్పున తమ ఋణదాతలకు అమ్మివేయవలసివచ్చినది. అందుమూలంగా వారి ఋణములు పరిష్కారం కానందున తాతలనాటి పాతభూములను కూడా కొన్నింటిని అమ్మివేయవలసివచ్చింది. ఈవిధంగా వ్యవసాయదారులైన భూస్వాములు లాభమును పొందవలెననే అభిలాషతో హెచ్చు కిమ్మతులకు కొన్న భూములను చాల తక్కువ కిమ్మతులకు అమ్మివేయవలసిన అగత్యం, అకస్మాత్తుగా సంభవించింది. కనుక, మొదలు చెడిన బేరం అనేది ఉంటుందా? అని అనుమానించనక్కరలేదు. అదేవిధంగా తన్ను మాలిన ధర్మం కూడా ఒక్కొక్కప్పుడు విధిగా చేయవలసివస్తుంది.

ఒక పర్యాయము ట్రంకు రోడ్డుమీద పోతూఉన్న మోటారు బస్సు రెండు గ్రామాలమధ్య అర్ధాంతరంగా ఆగిపోయింది. దానిని కొంత దూరం ఏవిధంగానైనా కొందరు మనుష్యులు త్రోసితేనే తప్ప, ప్రక్కగ్రామానికి అది చేరడం అసంభవం. ఆ ప్రక్క ఊరిలో దానికి కావలసిన పెట్రోలు లభిస్తుంది. అక్కడ దానికి కావలసిన కాయకల్ప చికిత్స (కారుకల్పచికిత్స) చేసి నూత్న యౌవనం, కొత్త జవసత్తువలు కలిగేటట్లు చేయుటకు అవకాశాలు ఉన్నాయి. కనుక చీకటి పడుతూఉన్న సమయంలో, అరమైలుదూరమున ఆ ఊరు ఉన్నటువంటి సందర్భంలో బస్సునందున్నటువంటి బలాఢ్యులందరూ బస్సులో నుండి దిగి బస్సును కొంతదూరం త్రోయవలసివచ్చింది. చిన్న పిల్లలు, ఆడవాళ్ళు, ముసలివాళ్ళు మాత్రము సామానులతో సహా బస్సులోనే ఉన్నారు. బస్సు చార్జీలను చెల్లించి హాయిగా ముందుసీట్లు ఆక్రమించి కాలుమీద కాలు వేసికొని కూర్చున్నటువంటి నలుగురైదుగురు పెద్ద ఉద్యోగస్థులు కూడా బస్సుదిగి త్రోయవలసి వచ్చింది. బస్సులో కూర్చున్న ఆడవాళ్ళందరినీ పెళ్ళికూతుళ్ళవలె అందులోనే కూర్చుండనిచ్చి, యీషడుచు మొగవాళ్ళందరూ ఆ బస్సును చాలా దూరం త్రోసి నడిపించారు. ఆ ఉద్యోగస్థులలో ఒక పెద్దమనిషి భార్యాసమేతుంగా ఆబస్సులో ప్రయాణం చేస్తున్నాడు. ఆమెను బస్సులోనే కూర్చుండనిచ్చి తాను బస్సు దిగి మిగిలినవారితో కలిసి చాలా శ్రమపడి బస్సును త్రోయడం చూచి, ఆయన భార్యకు మనస్సు చివుక్కుమన్నది. ఇంటికి చేరిన తర్వాత ఆయన పడిన కష్టానికి ఆవిడ మనస్సు చాలాకష్టపడింది. "ఏమి కర్మమిది నాథా!" అనే ఫణితిలో ఆ యిల్లాలు చాలా జాలిగొల్పు లీల ఆలాపన చేసి, ఆయనకు మార్గాయాసఖేదం బడంగు బెడంగున షోడశోపచారము లొనర్చ, సోఫాపై సుఖంబుగా విశ్రమించి తన అర్ధాంగికి అభిముఖుండై "పరోపకారార్థ మిదం శరీరం" అనే మాట మరచిపోవద్దన్నాడు.

"తమ కార్యంబు పరిత్యజించియు పరార్థ ప్రాపకుల్ సజ్జనుల్" అనే విషయం యీ బస్సును త్రోసిన బస్సు ప్రయాణీకులకందరికిన్నీ వర్తించవచ్చు. ఒక్కొక్క ప్రయాణీకుడు కనీసము ఎనిమిది అణాలు చార్జి చెల్లించాడు. ఇంత బస్సు చార్జీని బస్సు కంపెనీవాళ్ళకు చెల్లించినటువంటి పెద్ద మనుష్యులు, ఆఖరుకు తామే ఆ బస్సును కూలిడబ్బులు లేకుండా త్రోయవలసివచ్చింది. బస్సులో కూర్చున్న ఆడవాళ్ళకు యీ మొగవాళ్ళందరూ వెట్టిచాకిరీ చేసినట్లుగా ఆ బస్సును నెట్టుకొని పోవలసివచ్చింది. వీరందరూ తమ ద్రవ్యమును బస్సుకంపెనీకి యిచ్చి బస్సుకంపెనీ వారికి సేవ చేయవలసివచ్చింది. "తల తాకట్టుగా సేవచేయడం" అంటే ఇదే.

ఇతరుల బస్సును మనము త్రోయవలసిన అగత్యం ఏమిటి? అని ఆపనిని విరమించుకొన్నారా? లేదు. కాని అది పరోపకార సేవ అనే భావంతో చేశారా? లేదు. స్వలాభం విడనాడుకొని చేశారా? లేదు. స్వలాభానికి పరలాభానికి, స్వార్థానికీ పరార్థానికీ లంకె ఉన్నదని గ్రహించారు. రెండింటికీ చాలా దగ్గరి సంబంధం ఉన్నదని ఊహించారు. స్వార్థం, పరార్థం

★ కాలక్షేపం ★

అనేవి రెండూ వేర్వేరుగా లేవనిన్నీ, రెండూ ఒక్కటే అనిన్నీ అన్వయం చేసి కొన్నారు. స్వార్థపరార్థ అద్వైత సిద్ధాంతం శిరసావహించారు. అర్ధాంతరంగా ఆగిపోయిన బస్సునడక సాగేటట్లు చేయడంలో బస్సు ప్రయాణీకులు తమ సమష్టి బాధ్యతను గ్రహించారు. చెడిపోయిన బస్సును విడనాడిపోవుటకు వీలులేదని గ్రహించారు. తన్ను మాలిన ధర్మం అనేది ధరణిలో లేదు.


"ధర్మం" అనేది స్వార్థమూ కాదు. పరార్థమూ కాదు. అది రెండింటికీ అతీతమైనది. అందుకనే మన భారతదేశంలోని బిచ్చగాడు సహితం యీ మాటనే మాటి మాటికీ మనకు చెవి నిల్లు కట్టుకొని చెప్పుతూ ఉంటాడు. "కాళ్లులేనివాడను బాబూ! కళ్ళులేని కబోది నమ్మా! ధర్మం చెయ్యండమ్మా!" అంటాడు.

ఆ బిచ్చగాడు అనే మాటలలో అర్థం ఉంది. "నా దుర్దశను తొలగించగలవాడు భగవంతుడే - కాని, మీరు యిచ్చేటటువంటి బిచ్చముతో గాని, పైకంతో గాని నా దురవస్థ నాకు తొలగదు. నా కర్మం నేను అనుభవించక తప్పదు. కాని మీకు ధర్మం అని తోచిన దేదో అదే చెయ్యండమ్మా!" అని హెచ్చరిస్తున్నాడు. మనము కుంటివానిమీదను, గుడ్డివానిమీదను జాలి చూపవలసిన అగత్యం ఏమిటి? ఆ దౌర్భాగ్యుని దుర్దశను తొలగించే నిమిత్తమా? ఆ విధంగా భావించడం కేవలం అహంకారం. "రాతిలోని కప్ప రక్షించునెవ్వాడు?" లోకాన్ని ఉద్ధరించగలవాళ్ళం మనం కాదు. అది మనపని కాదు. లోకానికి యజమాని ఎవ్వడో, లోకంలో యీ అవకతవకలను యీ అక్రమాలను ఆ లోకాధిపతి ఎందుకు కల్పించాడో, యుద్ధాలు విద్వేషాలు కల్పించి జనసంహారం ఎందుకు చేయిస్తూన్నాడో ఎవరికి తెలుసు? కాని, మన ఆత్మ పరిపక్వంకోసం మనం చేయవలసిన ఆత్మసాధకం మనం చేస్తూఉండాలి. మన జీర్ణశక్తి బాగా ఉండడానికి మనం జీర్ణకరములైన వస్తువులను సేవించాలి. మన శరీరానికి బాగా బలం పట్టి కండలు, నరాలు పుష్టిగా ఉండాలంటే కసరత్తు గాని, శరీర వ్యాయామంతో కూడిన కాయకష్టం గాని చెయ్యాలి. ఎండ కన్నెరుగని అంతఃపుర కాంతలవలె ఉంటే, సుకుమార శరీగులమై సుఖం లేని రోగాలతో గాని, సుఖరోగాలతో గాని బాధపడవలసివస్తుంది. బుద్ధి బాగా వికసించవలెనంటే, తెలివితేటలు వృద్ధి అయ్యేటందుకు కావలసినటువంటి విద్యాభ్యాసం చెయ్యాలి. ఆత్మ వికాసం పొందవలెనంటే, దయ, సత్యము అనే రెండు గుణాలను ముఖ్యంగా సాధకం చెయ్యాలి. అటువంటి ఆత్మసాధకం మూలంగా, ఆత్మవికాసం, ఆత్మానందం, ఆత్మశాంతి లభిస్తాయి.

అటువంటి బ్రహ్మానందస్థితిని పొందడమే ముక్తి అన్నారు. కనుక, "దయారసం" అనే గుణం ఎందుకయ్యా మనలో ఉండాలి? అంటే, మన ఆత్మపరిపక్వం కొరకే. దేహారోగ్యం, చిత్తస్వాస్థ్యం, ఎటువంటివో ఆత్మానందంకూడా అటువంటిదే. ఒక పరోపకారంగాని పుణ్యకార్యంగాని చేసినవారికి ఆత్మానందం ఉంటుంది. తాను ధర్మం అని నమ్మినటువంటిదానిని పదిమందికీ బోధించి, యితరులకుగల మూఢాభిప్రాయాలను అజ్ఞానమును తొలగించడానికి కృషిచేసినటువంటి సంఘ సేవకునకు ఆత్మానందం కలుగుతుంది. కాబట్టి బిచ్చగాని మీద జాలిపడడం మంచిదే. అందువల్ల మనలో దయారసం వృద్ధిఅవుతుంది. దయవల్ల హృదయం వికసిస్తుంది. ఆత్మానందం కలుగుతుంది. బుద్ధభగవానుడు దయారసం సాధకంచేసి తరించాడు. దయారసం అనేది ఆత్మవికాసం కావలసినవారు విధిగా సేవించవలసిన రసం. కేవలం రక్తానికి పుష్టినిచ్చేటటువంటి కాంతవల్లభరసం కంటె ఎంతో ఎక్కువైనది దయారసం. దానిని బాగా సేవించినవాడు రససిద్ధుడవుతాడు.

కనుక యింతకూ చెప్పవచ్చిం దేమిటంటే, మన ఆత్మ పరిపక్వంకోసం, మనలో దయారసం వృద్ధికావడంకోసం, గుడ్డివానికీ కుంటివానికి మన శక్తికొలదీ బిచ్చంపెట్టడం మన విధ్యుక్త ధర్మం. బిచ్చగానికి ముష్టి పెట్టడం అంటే, మనం చేయవలసిన ధర్మసాధన, మన కోసం మనం చేస్తున్నామని గ్రహించాలి. అది కేవలం మనస్వార్థంతో కూడిన సాధకం. ఆవిధంగా మనం కృషి చేయడం, మన ఆత్మసాధకం చేయడం మన విధి - మన ధర్మం. అందుకనే వీధిలోని బిచ్చగాడు మనలను చూచి "ధర్మం చేయండమ్మా!" అని హెచ్చరిస్తాడు. "మీ *Duty*, మీ విధి, మీ విధ్యుక్త ధర్మం మీరు చేయండమ్మా!" అని ప్రబోధిస్తున్నాడు. అంతేగాని తన దుర్గతి నుండి ఉద్ధరించవలసినదని మనకు మనవి చేసుకొనడం లేదు.

పరోపకారం అంటే ఏమిటి? మన సేవాసహాయం ఎవనికి కావలెనో వానికి చేయడం. అయితే, మన సహాయం కావాలని అడిగినవానికేనా మనం సహాయం చేయవలసినది? జట్కాబండీ అతి వేగంగా రోడ్డు మీద పోతోంది. వెనుకనుంచి బండీ వచ్చుచున్న సంగతి తెలియకుండా పిల్లవాడొకడు రోడ్డుకు అడ్డంగా పరుగెత్తి ఒక మేకపిల్లను పట్టుకోవలెనని ప్రయత్నిస్తున్నాడు. ఆ పిల్లవానిని మనము చూచిన వెంటనే, ఆ జట్కాబండీక్రింద వాడు పడిపోతాడనే ఆవేదనతో చెయ్యిపట్టి వెనుకకు లాగుకొనివస్తాం. ఆ పిల్లవాడెవరో మనకు తెలియదు. అది ఒక ప్రాణి. మనదికూడా అటువంటిదే మరొక ప్రాణి. ఆ పిల్లవానికీ మనకూ ఉన్న బాదరాయణ సంబంధం ఇంతే. ఒక వినమైన కరుణారసం యీ సంబంధంవల్ల కలిగింది. ఆ బండిక్రింద మనం పడితే, ఎంతబాధ మనకు కలుగుతుందో అటువంటి బాధనే ఆ ప్రాణికూడ పొందుతుంది అనే అంతర్భావం ఆ కరుణారసంలో ఉంది. ఆ ప్రాణి పొందేటటువంటి బాధను మనము పరకాయ ప్రవేశం చేసి క్షణంలో క్షణమాత్రంగా అప్రయత్నంగా అజ్ఞాతంగా అనుభవించాము. ఎదుటనున్నవాడు పచ్చి చింతకాయ తింటే మనకు నోటిలో నీరు ఊరుతుంది. ఎదుటివాని నోటికి పుల్లనిరుచి తగులుతోంది. అటువంటి రసానుభవం మనకు కూడా కలిగింది. సమానమైన అనుభూతి కలిగింది. ఈ సానుభూతివల్లనే కరుణారసం కలుగుతోంది. కష్టవానిని చూస్తే ఏవగింపు కలుగుతోంది. వాడు పడుతున్న బాధను



మనము ఊహానుభవంగా పొందుటవల్లనే మనం కూడా మనస్సులో బాధపడతాము. కల్లకాటిసీనులో చంద్రమతి పడుతున్న హృదయావేదనను చూచి మనం కూడా హృదయావేదన పడుతున్నాము. ఇదే మనలో సహజంగా ఉన్న సానుభూతి గుణం - (సమానమైన అనుభూతి.) అందువల్లనే చంద్రమతిని చూచి జాలిపడుతున్నాము. ఈ సానుభూతివల్లనే కరుణారసం మనకు కలుగుతోంది. స్టేజిమీద నటుడు నవ్వితే మనం నవ్వుతాము. వాడు హాస్యరసం చూపిస్తే సానుభూతివల్ల మనకుకూడా హాస్యరసం కలుగుతోంది. అన్నిటికీ మూలకారణం ఏమిటంటే, సానుభూతి. ఇతర భూతములందు ప్రతిఫలించేటటువంటి రసానుభవం పరకాయప్రవేశం చేసినట్లుగా మనముకూడా పొందడం మన ఆత్మయొక్క మన హృదయముయొక్క సహజలక్షణం. "తనయందు నిఖిలభూతములందు నొకభంగి సమహితత్వంబున జరిగెడువాడు" అనేమాట పూర్తిగా ప్రహ్లాదుని విషయంలో వర్తించింది. కాని ఆవిధంగా ప్రవర్తించగల లక్షణం మన అందరిలోనూ ఉంది. అది మన ఆత్మయొక్క సహజలక్షణం; సహజధర్మం. అన్నపానసారములను గ్రహించడం జీర్ణకోశానికి ఏవిధంగా సహజలక్షణమో, మన ఆత్మకు యితర భూతములతో అద్వైతసిద్ధి పొందేటటువంటి సహజ ఆకర్షణలక్షణం ఉంది. విశ్వవ్యాప్తములైన నిఖిల భూతములతో సానురాగం సానుభూతి బాగా వృద్ధిపొంది వికసించడమే ఆత్మ వికాసం. ఆత్మ పరిపక్వం. అదే ముక్తి. అదే బ్రహ్మానందపదం. అదే కైవల్యం. అదే ఆఖరుమెట్టు. అదే జీవితానికి స్కూలు ఫైనలు పరీక్ష (పాతకాలాంత్య పరీక్ష).

మన ధర్మం మనం చేస్తూఉంటే, మన ఆత్మానందంకోసం మనము దయా సత్య శౌచములనే సద్గుణములను సాధకం చేస్తూ ఉంటే, మన ముక్తికోసం మనము పరోపకారం చేస్తూ, సంఘసేవ, దేశసేవ, మానవసేవ, లోకసేవ చేస్తూవుంటే, ఇదంతా ఆత్మసేవ అని బుజువవుతోంది. ఇదంతా స్వప్రయోజనం. ఇదంతా స్వార్థం అని అర్థమవుతోంది. ఇక పరార్థమనేది ఎక్కడ ఉంది? అదే ఆత్మజ్ఞానికి కలిగే ఆత్మసంశయం. రామాయణం అంతా చదివినతర్వాత రామునకు సీత ఏమి అవుతుందో చెప్పలేని స్థితి ఏర్పడుతుంది. ఆధ్యాత్మికంగా అన్వయిస్తే రాముడు ఎవరు? రాముడంటే పరమాత్మ-సీత అంటే ఎవరు? సీతఅంటేజీవాత్మ. ఈజీవాత్మ లంక అనే లంకలో బంధింపబడింది. లంక అనే అజ్ఞానాన్ని జయించి, భేదించడంవల్ల పరమాత్మనుండి దూరంగా అపహరింపబడి అన్యాకర్షితమైన జీవాత్మ తిరిగి పరమాత్మతో అయిక్యానుసంధానం పొందుతుంది. ఇదే రామాయణ పరమార్థం. రాముడంటే ఆత్మారాముడే.

అయినా రాముడు చేసిన మహాఘనకార్యం ఏమిటి? తన భార్యను ఒకడు ఎత్తుకొనిపోతే, వానిని చావగొట్టి, తన భార్యను తన యింటికి తిరిగి తెచ్చుకొని హాయిగా తన భార్యతో తాను సంసారం చేశాడు. తన భార్యను తాను తిరిగి తెచ్చుకుంటే ఎవరిని ఉద్ధరించినట్లు? లోకాన్ని ఉద్ధరించాడని శ్లోకాలు ఎందుకు వ్రాయాలి?

అదే సిసలైన సందేహం. సత్యవాక్యపరిపాలన చేశాడు. సత్యం అనేది సాధకం చేశాడు. సత్యం అనేది ఒక ఉత్తమ ధర్మం. ఆ ధర్మం సాధకం చేశాడు. లోకంలో సత్యం అనే ధర్మాన్ని బాగా ప్రకటన చేసి, దానిని సాధకం చేయడంవల్లనే ఆత్మకు అఖండమైన ఆనందం కలుగుతుంది అని చూపించాడు. దానిని సాధకంచేయడంలో గొప్పవుస్తాదు. కోడిరామమూర్తికంటె గొప్ప వుస్తాదు శ్రీరామమూర్తి.

శ్రీకృష్ణమూర్తి కూడా ధర్మప్రతిష్ఠాపన చేస్తానన్నాడేగాని లోకాన్ని మరమ్మతు చేస్తానని గాని లోకాన్ని ఉద్ధరిస్తానని గాని చెప్పలేదు. ధర్మం అంటే ఏమిటో ప్రచారంచేసి ప్రబోధం చేయాలంటే ఆ ధర్మాన్ని తాను అనుష్ఠించడమే కర్తవ్యం. గాంధిమహాత్ముడు సత్యం, అహింస యీ రెండూ సాధకంచేసి ఆ సాధకంలో ఎటువంటి మహత్తు ఉన్నదో మనకు చూపించాడు. దానిని సాధకం చేయడంవల్ల తాను ఆత్మపరిపక్వం పొందినాడు. ఆపరమ ధర్మముల రెండింటియొక్క మహత్తును తన సాధకంవల్ల లోకానికి చూపించాడు. "*He showed us the way*" (ఆయన మనకు మార్గం చూపించాడు) అని గోడనోటీసులు అచ్చువేసి అందుకనే అన్ని ఊళ్ళలోనూ అంటించాం. ఆయన తరించాడు. లోకాన్ని తరింపచేసే మార్గం చూపించాడు. స్వార్థంలోనే పరార్థం ఉంది అనే పరమార్థం గ్రహిస్తేచాలు. దానిని గ్రహించినవారే సజ్జనుల్.

రాయలసీమ బాగుపడి వృద్ధిలోకి రావాలంటే, అది ఆంధ్రరాష్ట్రంలో అద్వైతసిద్ధి పొందాలి. "ఆంధ్రరాష్ట్రంలో చేరము" అనే ధోరణిలో ఉన్నంత

(56-వ పేజీ చూడండి)

అద్దేహాలి

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

తెల్లవారగానే హెడ్‌సిస్టర్ మార్గరెట్ మెడికల్‌వార్డు కొచ్చేసింది. సిస్టర్ మార్గరెట్ చాలా సీనియరు. ఆసుపత్రి అంతకీ ఆమె వొక్కతే తెల్లదొరసాని. ఆమె అంటే ఆసుపత్రి సిబ్బంది అందరికీ హడలు. తెల్లని విగ్రహమూ, వొంటి రంగుతో కలిసిపోయే తెల్లని యూనిఫారమూ, పక్క జేబూలలో పై జేబూలో మొత్తం మూడు ఫౌన్‌టెన్ పెన్నులూ, చేతిలో గాజుబొమ్మ పిడిగల వొక పిట్ట గొడుగూ, వయస్సు ముదిరినా యవ్వన మింకా దిగజారని జిగీ...ఆమె మదగజ యానంతో నడిచివస్తుంటే ఫర్లాంగు దూరంలో ఫలానా ఆమె వస్తోందని అందరికీ గుర్తే. రాగానే చిమచిమలాడడం ఆమెకి అలవాటు. వార్డు పరిశుభ్రత విషయంలో మటుకు ఆమె అతి కరకుగా వుంటుంది. మూలమూలలవున్న సాలీడు బూజులూ, భూతఅద్దాలకైనా అందని ధూళి పొరలూ ఆమె కంటికి అవలీలగా దొరుకుతాయి. మళ్ళీ రోగులకి మందూ మాకూ సక్రమంగా అందుతూవున్నదా లేదా నర్సులు వాళ్ళని జాగర్తగా కనిపెడుతున్నారా లేదా అన్న ఆరాలుమాత్రం పట్టించుకోదు. వొచ్చీరాగానే ఎవళ్ళ మీదనో వొకళ్ళమీద విరుచుకునిపడి ఇంగ్లీషులో వొచ్చీరాని తెలుగు మిళాయించి, మాట్లాడుతున్నది ఏ భాషో తెలియని గడబిడలో ఆసుపత్రి అంతనీ ముంచెత్తి పారేస్తుందంతే. ఆ కోలాహలంతో సర్జికల్ వార్డులో, మెడికల్‌వార్డులో, టి. పి.

షెడ్డులో అందరికీ సిస్టరమ్మ వొచ్చిందంటే వొచ్చిందని అవగాహనయిపోతుంది.

వార్డంతా అపరిశుభ్రంగా వుంది. తోవలోనూ రోగుల మంచాలదగ్గరా వొలిచిన నారింజతొక్కలూ, నబలి పూసిన తొనలు, పారేసిన గింజలూ, లోషన్‌లో ముంచి గిరాటేసిన దూదిపింజెలూ చెల్లాచెదురుగా పడి వున్నాయి. చెత్తకుండీలు వార్డుకి దూరంగా వుంచబడివున్నాయి. అవి దగ్గరసా అమర్చి వుంచాలనీ, వూడ్చిన చెత్త కుండీలలో కెత్తి ఆరుగంటలకల్లా ఆసుపత్రి కళాయి చేసినట్టు శుభ్రంగా వుంచాలనీ నూరిపోసి మరీనడుతో వుంటుంది ప్రతిరోజూ. నూపరెంటు రౌండ్సుకి వచ్చేటయిమయింది. అంతా గలీజుగా వుంది. నర్సింగ్ ఆర్డర్లీలు ఈ హడావుడికి అప్పుడే లేచారు గావును కళ్ళు నులుపుకొంటూ ఈ ప్రపంచంలోకి పడలేదింకా. వట్టి నల్లమందు భాయీలు. మగనర్సులు ఆడనర్సులతో ఛలోక్తులు పోవడం మినహా రోగుల మంచీ సెబ్బరా, ఆసుపత్రి శుచీ శుభ్రతా ఏమీ పట్టించుకోరు. గావు కేకలు పెట్టింది. గొంతు చించుకుంది. “ఏడీ తోటీ రాము లెక్కడా?” అని గర్జించింది పేలవలసిన బాంబు ఎవడిమీద విసరాలో తోచక. తోటీ రాములు బంగాళావేపు నించీ గబగబా వొచ్చాడు. “ఏమిరా యెదవా - ఏమి సేస్తున్నవు - ఇప్పుడు తెల్లవారెనా నీకు?” అని ముదలకించింది. తోటీ రాములు బిక్కుబిక్కుమంటో నీళ్ళు నమిలాడు. “హొద్దు పొడిచేశిందండమ్మగారు. ఆలిచ్చిమయిపోయిందండి” అని నంగి నంగిగా గొణిగేడు.

ఛెళ్లున లెంపకాయకొట్టింది సిస్టర్ మార్గరెట్. ఆలిచిమయిందట. వెధవ! వెధవన్నర వెధవ! ఆలస్యమయిందని తనే గోలపెడుతున్నదాయెను. వాడు వొప్పుకునేదేమిటి? ఎందుకాలిస్యమయిందో అహోరించక! కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి రాములికి. అంతటితో పోకవాడు” అమ్మగారికి గేపకం లేదు గామోసు పొద్దున్నే మీ బంగాళాలో మొక్కలికి నీళ్లు పోసి రమ్మన్నారండి” అని తప్పెవరిదో అమ్మగారి మొహాన్నే బయిటపెట్టి గుర్రుముతో తీక్షణంగా చూచాడు. గతుక్కుమన్నది మార్గరెట్. బాంబు వాడి మీద విసురుదామనుకున్నది తన చేతిలోనే పేలింది. కోపం రూపాయికి పన్నెండణాలు దిగజారిపోయి ఏదో ఇరుకున పడ్డట్టయిందామెకి. కాని వోటమి అంత సులభంగా అంగీకరించే ఘటం కాదాయెను. చుట్టూవున్న స్టాఫ్ నర్సులూ, ట్రెయినింగుకివచ్చిన ఆయాలూ అంతా అదోరకంగా చూచారు వాడి వంక జాలిగా - నేరమెవరిదో అర్థమైపోయినట్టు. వెధవ! కూకలేస్తున్నంతసేపూ గమ్మున వూరుకున్నాడు - తీరా లెంపకాయి కొట్టింతరవాత నోరు పెగిలింది వాడికి. పొగరు! తన సొంతపనులు వాడిచేత చేయించుకుంటున్న వయినం నలుగురికీ తెలియాలనీ, నలుగురిలోనూ తనని చిన్న బుచ్చాలనీ!

ఎవరిదారినవారు చక్కాబోయారు. ఒకడు జాలిపడ్డాడు. వొకడు ముక్కుమీద వేలేసుకున్నాడు. సొంతయింటి చాకిరీకని వాణ్ణి పురమాయించిందీ - పురమాయించి ఆసుపత్రిపనులు ఆలస్యమయినాయని సివాలూ చిందులూ చాలక ఎదురుచెయి జేసుకుంటుందీ!

తరవాత ఎవళ్ళపనిలో వాళ్ళు మునిగిపోయారు. కాని పొద్దున్నతిన్న లెంపకాయ రోజంతా పనిచేస్తోనేవుంది రాములు మెదట్లో. ఇంటిదగ్గర ఏదో దిగాలుపడి కూచున్నాడు. ఎవరితోనూ ఏమీ చెప్పలేదు. దెబ్బతగలగానే గప్పున కలబడదామనుకున్నాడు. కాని కళ్ళెం చనక్కులాగి క్షణంలో తమాయించుకున్నాడు. తన వోరిమికి తోడివాళ్ళంతా ఎంతో అవహేళన చేశారు. కాని పద్దవాడు చెడ్డవాడు కాదులే అని నచ్చజెప్పుకున్నాడు. మర్నాడు సిస్టరమ్మ తప్పకండా తనని పిలిచి “వొరేయ్ రాముడూ తొందరసేసినానులే - ఏమి అనుకోకుమా” అని సమాధానం చెప్పవస్తుంది. చెప్పితీరుతుంది అనుకుని తృప్తిగా వూరుకున్నాడు. కాని

మర్నాడు గడిచింది. ఆ మర్నాడూ నడిచింది. ఏమీ అసందర్భం జరగనట్టే సంచరిస్తోంది సిస్టరమ్మ. ఆమెకి చీమకుట్టినట్టయినా లేదు. ఆశ్చర్యమయింది. తడిమి చూచుకున్నాడు. దవడమీద అయిదు వేళ్ళూ అంటుకుపోయి సోకుతున్నాయి. "దీనికి ప్రతీకారమాలోచించాలి" అనుకున్నాడు.

వార్డులదగ్గర వూడుస్తున్నా, రోగుల మంచాలదగ్గర ఫ్లిట్ పంపు కొడుతున్నా, పినాయిలు కలుపుతున్నా కోళాయిదగ్గర స్పిట్టూన్లు కడుగుతున్నా వొకటే ధ్యాస - ఏమి చెయ్యాలీ అని!

రాత్తిరి హెడ్డుగుమాస్తా రాజారావుగారింటికి వెళ్ళాడు; వెళ్ళి సంప్రదించాడు. ఆయన చాణక్యుడు. హెడ్ సిస్టరంటే ఆయనకి వో హుందుకు గుర్రుగా వున్నది. పిటీషన్ పెట్టమన్నాడు; బావుందనుకొన్నాడు రాములు. ఇట్లాంటి వో ఘాయిత్యం కోయితాని కెక్కిందంటే కొంత కదలిక పుట్టకండా మానుతుందీ అనుకొన్నాడు. హెడ్ గుమాస్తాగారి చాతనే పిటీషను వ్రాయించి వో అర్ధ రూపాయిచ్చి టైపు చేయించి రెసిడెంట్ మెడికల్ ఆఫీసరుగారి కిచ్చాడు. రోగం కుదిరింది భేషైన పని జరిగిం దనుకున్నాడు తోటీ రాములు. పిటీషన్ పెట్టినట్టు గూడా ఎవళ్ళతోనూ చెప్పలేదు. ఎందుకూ ఆర్భాటం, చేసేపని చల్లగా చెయ్యాలిగ్గాని? అనుకున్నాడు. మూడు రోజులయింది. ఏమీ జరిగినట్టు అవుపించదు. తనకి తెలీకండా సిస్టరమ్మని రహస్యంగా మందలించారేమో—హెడ్ గుమాస్తాగారికి మళ్ళా అవుపించాడు. కోయిత్మమీద చర్య ఏమయినా తీసుకుని వున్నట్టయితే తన రిజిష్టరులో నమోదు కావాల్నే-మరి అట్లాంటి వాసనే సోకలేదు. బుట్టదాఖలా అయిందన్నమాట అని చప్పరించేశాడు చివరికి.

ఈసారి సూపరెంటుకి అంటే డిస్ట్రిక్టు మెడికల్ ఆఫీసరుగారికి పిటీషను పెట్టమని రెచ్చగొట్టాడు. అందులో ఆర్. ఎమ్. వో. గారికి ఫలానా తారీఖున వొక అర్జీ ఇచ్చినట్టు కచ్చితంగా వుదహరించమన్నాడు కూడా. మళ్ళా పిటీషన్ వ్రాసి డి. యం. వో. గారి కిచ్చాడు. అర్జీ అందుకుని చదువుకున్నాడు డి. యం. వో. చదువుకుని ముసిముసిగా నవ్వి "సరే-పో" అన్నాడు. తోటీ రాములు రెండు రోజులు నిదానించాడు. ఏమీ చర్య తీసుకున్నట్టుగాని తీసుకోదలిచినట్టుగాని సూచాయగానైనా అవుపళ్లేదు రాములికి. పైపెచ్చు సిస్టరమ్మా డి. యం. వో అతి యిష్టాగోష్ఠిగా మాట్లాడుకోగా రెండు మూడు సార్లు చూచాడు కూడా. వొకనాడు డి. యం. వో సర్జికల్ వార్డుకి రౌండ్సుకి వచ్చాడు. ఎనీమా కాన్ తీసుకువస్తూ అప్రసక్తి తేబోయాడు, రాములు. కాని డి. యం వో. చాలా సీరియస్ గావున్నాడు. ఒక రోగిపరిస్తితిని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు మొహం పెట్టాడు కావాలని. సమయంకాదని వెనక్కి తగ్గాడు రాములు.



ఛెళ్లున చెంపకాయ కొట్టింది సిస్టర్ మార్గరేట్.

మర్నాడు క్యాంపుకి వెళ్లిపోతున్నాడు డి. యం వో. కారుదగ్గరనిలబడి "ఎన్ డార్సు దయచేయించలేదు బాబయ్యా" అని అర్థించాడు ముక్తసరిగా. ఓరి వెధవ! వీడికి ఎన్‌డార్సు మెంటు కావాలిట అంటే తానిచ్చిన పిటీషన్‌మీద "ఫలానా చర్యతీసుకోవడమయినది" అని ఈతోటీ దొరగారికి వ్రాతమూలకంగా తెలియబరచాలన్నమాట! "ఎన్ డార్సు కావాలీ?" అన్నాడు వెటకారంగా డియం వో, అంతవరకూ వచ్చిందీ అన్నట్టు.

ఎన్‌డార్సుమెంటు రానే వచ్చింది. "తగినచర్య తీసుకోవడమయినది" అని వివరించి వున్నదందులో అంతే.

ఫోంచేసి తమలపాకులు నములుతూ వడవలో పచారుచేస్తున్నాడు, హెడ్డుగుమాస్తా రాజారావుగారు.

రాములు వొచ్చాడు. వ్యవహారం మళ్లీ మొదటి కొచ్చిందే. కోయితమ్మీద జరిగిన భాగోతమంతా చూశాడాయన. విచారణ చెయ్యగా రాములు తాగివొచ్చినట్టూ సిస్టరమ్మ గొడుగుకామతో కొట్టినట్టూ ఆచూకీ తెలియవచ్చిందని రికార్డయి వున్నదట.

(౯౯-వ పేజీ చూడండి)

ఒక రోజు పంతులు

శ్రీ వంగల వేణుగోపాలాచార్య

(ఉదయం : 11 గంటలు)

క్లాసు రూము. కుర్రాళ్లు గోలగా ఉంటారు. రాజారావు మేష్టారు వస్తారు.

ఒక కుర్రాడు : అరేయ్. మేష్టారు వస్తున్నార్రోయ్.

రెండవ : ఎవర్రా...రాజారావు మేష్టారేనా...

ఒకటవ : అవునురా...గప్......చిప్. (క్లాసంతా నిశ్శబ్దం అవుతుంది.)

రాజారావు మేష్టారు : అబ్బాయిలూ... కూర్చోండి......అప్పుడే అయిదు నిమిషాలయిపోయాయి. పాఠం మొదలెట్టాలి. నిన్న ఎంతవరకు వచ్చాము. మానిటర్.

మానిటరు : నిన్నటి పాఠం అయిపోయిందండి. యివాళ కొత్త పాఠం చెబుతామన్నారు.

రాజా : ఆ! సారీ...సరే...ఏదో పాఠం తియ్యండి...చూశారూ...యీ పద్యాల అర్థమూ, భావమూ చాల గొప్పగా ఉంటాయి. మానవులు, ముఖ్యంగా విద్యార్థులు నేర్చుకోనవలసినవి యిందులో చాల ఉన్నాయి. యీ పద్యాలని షేక్స్పియరు అనే మహాకవి రాశాడు

యితడు ఆంగ్లేయుడు. ఎన్నో గొప్ప నాటకాలు, పద్యాలు రచించాడు. సరే. అసలు పాఠంలోకి వద్దాం. మానిటర్... చదువు.

(ప్యూన్ నోటీసుతో ప్రవేశిస్తాడు.) సమయానికి వచ్చాడు.- హుం...అదిగో నే హంసపాదు ..పిల్లలూ వినండి. *please grant me leave,...*

(క్లాసంతా గొల్లుమంటారు. బల్లలు గుద్దుతారు.)

(చికాకుగా) ఏమిటిరా యిది. సెలవు చీటీ తెచ్చావు.

ప్యూన్ : అయ్యో...నోటీసు కాగితం యిది బాబయ్యా. ఆ కాగితం యిల్లా యియ్యండి. రాంబాబుగారు యిచ్చారు.

రాజా : ఏడిసినట్టే ఉంది. ఏదీ...... వినండి......ప్రసిద్ధ పురుషులయిన మహాపురుషులుగారు విచ్చేసిన సందర్భంలో, బడికి మధ్యాహ్నంపూట, వారి గౌరవ సూచనగా, సెలవు యిచ్చారు. (ప్యూన్ వెళ్లిపోగా క్లాసంతా చప్పట్లు కొడతారు.) సైలెన్స్—...అప్పుడే యిరవై నిమిషాలు అయిపోయాయి. యిక పావుగంటలో ఏం చెప్పను...నా మొహం. అందరూ బెల్లు కోసం చెవులు నిక్కపొడుచుకున్నారు. నా పాఠం ఎవరు వింటారూ. అయినా ...మానిటర్...మొదలుపెట్టు.

మాని : (బిగ్గరగా)

Every one that flatters thee,
Is no friend in th y misery.

రాజా : ఆ...ఈపాఠంలో స్నేహధర్మం గురించి చెప్పబడింది. ముఖ్యంగా మీలాంటివాళ్లు ఈపాఠం గ్రహించి, అల్లాగే నడుచుకోవాలి. ఏదైనా మనిషిశీలం అతని మిత్రులనిబట్టి ఉంటుందని...

వేరే క్లాసుకుర్రాడువచ్చి : మేష్టారండీ.. వెంకటప్పయ్య పంతులుగారు కొంచెం నశ్యం వేయించుకొని రమ్మన్నారండీ.

రాజా : ఛా...వెధవా...రసపట్టులో కనిలా వచ్చావు...ఊఁ...యింద...వెళ్లు.. ఎంతవరకు చెప్పాను.

మానిటరు : అంతేనండి.

రాజారావు : ఏమిటిరా...అంతే.

మాని : తెలియదండీ.

రాజా : హోరి వెధవల్లారా...మీదృష్టి యిక్కడుంటేగా ..యీ ఆఖరిపీరియడు వేసి నాపీకకి తెస్తార్రా వీళ్ళు. మొదటి పీరియడు వెయ్యండర్రా అంటే వెయ్యరు. ఆఖరున మీకు వినాలని ఉండదు. నాకు చెప్పాలనీ ఉండదు. యీ పాఠం ఎంతో బాగా చెప్పాలని ఎంతో ఉత్సాహపడ్డాను.

1. కుర్రాడు : (లేచి) మేష్టారండి (అని చిటికెన వేలు చూపుతాడు)

రాజా : నా వాగుడేకాని, మీ కార్యక్రమాలు సాగుతూనే ఉంటాయిరా-వెళ్లు ఊ...స్నేహాన్ని గురించి కదూ చెప్తుంట- వినండి...(యీసారి యింకో అయిదుగురు లేచి బొటికిన వేలు మాపుతారు)..హోరి. మీ దుంపతెగా...అన్నీ వరసాగ్గా వస్తున్నాయిలా ఉందిరా. ఈపాఠంలో ఎంత అర్థముంది! ఎంత భావముంది! పశువులు.. వెళ్లండి... మిగిలినవాళ్లు వినండి. రేపటి పరీక్షలలో యిది చాల ముఖ్యం. స్నేహధర్మాలని గురించి యీ కవి, ఏ వరిస్తూ ఏమన్నాడండీ.

(యింతలో హెడ్‌మాష్టారువస్తే క్లాసంతా లేచి నిలబడతారు)

హె-మా : రాజారావుగారూ...మాట... మీరు సాయంత్రం యింటికి వెళ్లేటప్పుడు, ఒకసారి అల్లా మా యింటికి వస్తారుకదూ.. మర్చిపోకండీ...తప్పకుండా రండి...రిటర్న్లు కంపేర్ చెయ్యాలి.

(హె-మా...వెళ్ళిపోతారు)

రాజా : చిత్తమండి...అల్లాగే...... (నిట్టూర్పు వదుల్తూ)......ఒట్టుపెట్టినట్టు పాఠం మాత్రం సాగనివ్వటంలేదు. ఉన్నవి నలభయి నిమిషాలు. అందులో నోటీసులూ, సద్దుకోవడాలూ...సమాధానాలూ... వీటితోనే సాగిపోతోంటే...యిక చదువేం చెప్పనూ, నా మొఖం. ఎంత ఉత్సాహంగా పాఠం చెప్తామని వచ్చానో అంత డిగజారిపోయాను...కనీసం పాఠం చెప్పే అరగంటయినా స్వేచ్ఛగా ఉండనివ్వరు...సరే.. పిల్లలూ...యీ పద్యభాగంలో స్నేహంలో రకాలని గురించి...

మానిటర్ : సార్......అటెండెన్స్ వెయ్య లేదండి.

రాజా : హోరి శిష్యుడా, బాగా జ్ఞాపకం చేశావు...ఏదీ...నెంబర్లు పలకండి.(పిల్లలు చకచకా నెంబర్లు పలుకుతుంటే బెల్లు కొడతారు.) అయింది...అనుకున్నంతా అయింది. పుణ్యకాలం కాస్తా తీరిపోయిది. అయినా చివరిఘడియలలో ఏ పని అయినా యిల్లాగే ఉంటుంది......త్వరగా నెంబర్లు పలికి...వెళ్లండి.

*   *   *


[సాయంత్రం 6 గంటలు. రాజారావు యిల్లు.]

రాజా : ఒసేవ్...యిదిగో...ఊహు చస్తే పలకదండీ...ఏమేయ్......ఎక్కడ తగులడ్డావేవ్.

భార్య : దొడ్లో తగలడ్డాను. దొడ్లోనించి యింట్లోకి నడవాలా, ఎగిరి రావాలా? ఏమిటా రాజకార్యం.

రాజా : చూడూ...ఏమైనా ప్రయత్నించేశావా.

భార్య : రెండుశేర్ల బియ్యం తెచ్చేటప్పటికి తలప్రాణం, కాళ్ళకి దిగింది.



లక్ష్మమ్మగారికి కొబదలు నాలుగు రూపాయిలూ, నాగరత్తానికి రెండు కుంచాల య్యం, పాలదానిదగ్గర అయిదు రూపాయిలూ, కాంతంగారికీ, నూనె...ఎల్లాగో కాంతంగారినే అడిగి తెచ్చా ఈ అర్ధడు బియ్యమూ.

రాజా : మంచిపని చేశావు.. రేపేగా ఒకటవ తారీకు. సాయంత్రం అందరికీ యిచ్చేద్దాములే.

భార్య: మహా యిచ్చేవారిలా చెబుతారు. పాలదానికి మూడు నెలలబాకీ యివ్వాలి. కోమటికి సరేకదా... పులిబుర్ర కాగితం... యికపోతే యింటాయన పొరుగూరు కనుక తరచు అడగడు కదా.

రాజా : అందరికంటె పెద్ద అప్పుల దానివి నువ్వున్నావుగా... నామాట వినకుండా, అల్లుళ్ళను రప్పించి, పండగలు చేశావు... పండగలు...డబ్బేమయినా ఊరు తోందనుకున్నా వేమిటి... యివన్నీ సద్దుకోవడానికీ.

భార్య : అయ్యోరామా ! కూతుళ్ళనీ, కొడుకులనీ, అల్లుళ్ళనీ పండగలకి రప్పించుకోవడంకూడా ఖర్చుటండీ. మనయింటిపన్లు మనం చేసికుంటాంగాని లోకానికి ఉద్ధరించేమిటి... అదయినా మీ గొప్ప ఏముందీ.. ఏదో కాంతంగారి దయవల్ల...

రాజా : ఆ... రేపు ఆ బాకీ తీర్చేటప్పుడు తెలుస్తుంది. ఎవరిదయో.

భార్య : అయినా......మీరు కూడ కాంతంగారి మొగుడిలా ఏమైనా రాయకూడదుటండీ...కంపెనీలవాళ్ళు డబ్బు యిస్తారుట.

రాజా : అదొక్కటే తక్కువ, అయినా అవేం కథలూ...యిల్లుట...పిల్లలుట, వంటిదేసుస్తే ఆముదంపట్టారు

భార్య : నాకుమాత్రం ఆ కథలు బాగుంటాయండీ...అచ్చు మనింట్లో గొడవల్లా ఉంటాయి. కాని ఒకటే తేడా— కాంతం మొగుడు భార్య మాట వింటాడు, మీరు వినరు, అంతే.

రాజా : తీర్చవలసిన బాకీలు...వచ్చే జీతమూ, చెయ్యవలసిన బాకీలూ లెక్క చూడకుండా, కాంతంగారి కథల్లో పడ్డా వేమిటి, వాళ్ళలెక్క తేల్చకపోతే, ముందు మనకథ పడతారు. యిది నెలాఖరు అనే సంగతి జ్ఞాపకముందా.

భార్య : ఆ...ఏం చెప్పినా నెలాఖరులో చెల్లుతుంది. ఇచ్చేవాళ్ళలా అందరికీ 'ఒకటో తారీక' నేగా సమాధానం! తీరా ఒకటో తారీకువస్తే, అందరినీ సద్దిచెప్పలేక నాకు ప్రాణం కడబడుతుంది.

రాజా : ఏం చెయ్యమంటావు. అన్నట్టు ట్యూషన్ కుర్రాడు ఫీజు తెచ్చి యిచ్చాడా.

భార్య : మీదగ్గర కుర్రాళ్ళకి ఆ అలవాటుంటేగా, పయిగా వాగుడు నష్టం కూడాను. ఏదో కల్సివస్తుందని, మమ్మల్ని చంపుకుతింటారు, యిరుకు గదుల్లో వాళ్లను పెట్టుకొని.

రాజా : నీ దెప్పులకేంగాని, ఆకుర్రాడు సాయంత్రం తెస్తానన్నాడే... నేనావైపు వెళ్ళివస్తానుండు...అన్నట్టు వాళ్ళనాన్నకీ ఒకటవ తారీకునేగా జీతం రావడం. నా సమాధానం నాకే వస్తుంది. నెలకి కనీసం నాలుగైదు, ఒకటో తారీకులువస్తే బాగుండును. నెలాఖరులో అన్ని చిన్ని సంసారాలు యింతే గాబోలు ఖర్మం...

* * *

(ఆరాత్రి 10 గంటల సమయం—రాజారావు తండ్రి 60 ఏళ్ళవృద్ధు, నులక మంచంమీద కూర్చొని ఉంటాడు. బుడ్డి

ఒకరోజు పంతులు

...పం ముందు పిల్లలు బిగ్గరగా చదువుతూ ...ంటారు)

తండ్రి: అబ్బాయీ! రెడ్డిగారు నీకోసం వచ్చి వెళ్ళారురా.

రాజా: ఏం...ఎందుకూ.

తండ్రి: ఆయనకొడుకు నీక్లాసేటగా, ట్యూషన్ చెప్తావేమో కనుక్కుందామని వచ్చారు.

రాజా: ఉన్న వాళ్ళు ఉద్ధరిస్తున్నది చాలు. నేను ధర్మబుద్ధిగా నలుగురు కుర్రాళ్లని చేర దియ్యడమూ ... చూశేవాళ్లకి యిదో గొప్పఆదాయంలా కనపడటమూ.

తండ్రి: పోనీ లేరా...వీలయితే చెప్పు...నీకు యీ మాత్రం చదువు చెప్పించడానికి మేమెంత కష్టపడ్డామో గుర్తుందా. మనం కష్టపడి అయినా పిల్లలకి విద్యాభిరుచి కల్పించాలి. అప్పుడే వాళ్ళ జీవితాలు సక్రమంగా నడుస్తాయి. విద్యాదానం లాంటిది యింకోటిలేదు.

రాజా: అసలు నాకు తీరిక ఎక్కడిదీ, పయిగా వీళ్ళకి పరీక్షలముందు కానీ ట్యూషన్లు గుర్తుకు రావు-ఏడాది చివరలో వాళ్లకి నేను చెప్పేదేమిటి...వాళ్ళకి అర్థమయ్యేదేమిటి..నా మొఖం.

తండ్రి: అయితే లోటిమాష్టర్లందరూ అన్ని ట్యూషన్లు చెప్తున్నారు ?

రాజా: ఏముందీ...డబ్బు...చేతిలో పనిగీకితే,నాలుగురాళ్ళు పడతాయి చేతిలో.. ఒక్క నీతిని చంపుకుంటే.

తండ్రి: ఛీ...ఛీ...మనం లోకాన్ని ఉద్ధరించకపోయినా, మన జీవితాలనయినా, స్వచ్ఛంగా, గడపడం మనచేతిలో పని. అబ్బాయీ...భగవద్గీత చదివే వేళ అయిందా...

రాజా: ఒకే బాధిగా...తాతయ్యకి గీత పుస్తకం తెచ్చివ్వు. నేను ఒకసారి అలా వెళ్లి వస్తాను నాన్నా...మీరు చదువుకొని పడుకోండి.

భార్య (ప్రవేశించి): యింత రాత్రిలో ఎక్కడికండి, ఉదయమే వెళ్ళరాదూ:

రాజా: అయ్యో....అలాగే....యిడేం కాకీ అనుకున్నావేమిటి వాయిదా వేయడానికి. ఇల్లాంటప్పుడే నలుగురం చేరి పిచ్చాపాటి చెప్పుకోవడానికి వీలు... విశ్రాంతిగా...తలుపు దగ్గరగా వేసివుంచు.

* * *

(అర్ధరాత్రి 12 గం॥ అరు బయట రాజా రావు, ముగ్గురు మేష్టర్లు గుండ్రటిబల్లచుట్టు కూర్చుంటారు. మధ్య కిరసనాయిలు దీపం వెలుగుతోంది. సిగరెట్టు పెట్టెలు, చిందర

చిందరగా పడిఉంటాయి.)

రాజా : అయితే శర్మా ! యీ ఉద్యోగాలు నాకేమీ నచ్చలేదురా. దీనికంటే ఏ పల్లెకోపోయి, నలుగురు రెడ్లనాశ్రయించుకుంటే జీవితం నిశ్చింతగా వెళ్ళిపోతుంది.

శర్మ : అదేమిటి...మాలోకల్లా నీవి యరువి. నీకే అంత విసుగా!

రాజా : కాకపోతే ... నీకూ నల్గురు పిల్లలు పుట్టేసరికి తెలుస్తుంది యిలా ఎందుకన్నానో. గంటల తరబడి, బడిలో వాగి వాగి, కొంప చేరేసరికి, యింత శుభ్రమయిన కాఫీ, వేళకి భోజనంవచ్చే అవకాశం లేకపోయాక ఎందుకురా...యీ చదువులూ.. ఉద్యోగాలూ...

శర్మ : కనుకనే ఓర్పు, శాంతి, సహనము, పట్టుదలా మూర్తీభవించినవారికే ఈ మాష్టరు వృత్తి.

పాపయ్య: కాస్త పౌరుషం దించుకొని, కూలికిపోతే రోజుకి కనీసం, మూడున్నరో, నాలుగో సంపాదించవచ్చు.

రాజా : ఒక్కొక్కసారి పాఠం చెప్పకుండా ఎగవేద్దామనుకుంటాను. కాని తీరా వాళ్ళ చిన్నమొఖాలు చూసేవరకు, వాళ్ళ జీవితాలన్నీ మనం చెప్పే నాలుగు ముక్కలమీదే ఆధారపడి ఉంటాయి కదా, అని మళ్ళీ సద్దుకుంటాను. కాని యీ మంచితనం ఎవరికీ తెలియదు.

శర్మ : మీనాన్న రోజూ గీత చదువుతాడు గదా. నీకు యీమాత్రం తెలియదురా. 'మనం మంచిపని చెయ్యడంవరకే గాని, దాని ఫలితాన్ని గురించి ఆలోచింపకూడదని. ముఖ్యంగా మేష్టర్లం దీన్ని ఆచరణలో పెట్టాలి.

రాజా : ఆమాటకి వస్తే గీతలో యింకా చాల చెప్పాడు, 'వినాశాయచ దుష్కృతాం, ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని. తోటి మేష్టర్లకి తలవంపులు తెచ్చే అవినీతి పనులు చేసే టీచర్లనూ, మేనేజిమెంటు కమిటీలకు తొత్తులను, బహిరంగపరచి, కలికావతారం ఎత్తుతాను.

పాపారావు : రాజీనామా కాగితం చేత్తో పట్టుకొని మరీ ఎత్తు కలికావతారం, ఎందుకయినా మంచిది.

రాజా : అంతేరా ... నిజము చెప్తే యింతేరా...యింత చదువుకున్నందుకు, ఎంతో ఆదర్శంగా, ఉన్నతంగా జీవించాలనుకుంటే, చివరకి పూటగడవటం కష్టమయిపోతే...ఖర్మ...

శర్మ : ఋషుల్లా, కందమూలములూ, గాలి సేవించి జీవించగలశక్తి ఉంటే, ముఖ్యంగా మేష్టర్ల జీవనం సుఖంగా ఉంటుంది. ఏ పేచీ ఉండదు. లేదా అవినీతికి దిగి, ట్యూషన్ల సాకుతో డబ్బులాగాలి. రెండూ చేతగాని మనం...యిల్లా గొర్రెతోకల్లా జీవితం గడపవలసిందే.

రాజా : ఇది రోజూ ఉన్నగొడవే... తెల్లారితే మళ్ళీ, యంత్రాల్లా దినచర్యలో సాగిపోవాలి...ఏదైనా కాస్సేపు ఖులాసాగా కబుర్లు చెప్పండి...నిద్రకూడ వస్తోంది. ★

సీరియల్ నవల

దత్తత

22

యౌవనదశలో మానవుడు కల్పించుకునే ఊహాపూరిత ఆశయసౌధాలు చాలా విచిత్రంగానూ, కంటకరహితంగానూ కనిపిస్తాయి. ఆశయానికి విరుద్ధమయ్యే, ఆటంకాలతో కూడిన కోణాన్నుంచి ఏనాడూ చూడ్డానికి ఉత్సహించడు. ఉత్సహించక పోయినా సూచనాప్రాయంగా కనుపించే ఆ నీడలు దేదీప్యమానంగా వెలిగే తన ఆశయజ్యోతిముందు నిలబడలేక పారిపోతాయి.

ఎంతో కాలం కష్టపడి శ్రేయింబవళ్లు యోచనాపూర్వకకృషితో సృష్టించిన ఆ గాలిమేడలు, ఆచరణలో కష్టసాధ్యమై అతిస్వల్పకాలంలో కావలసినవాళ్లు లేపిన గాలిదుమారంలో భిన్నాభిన్నమై కొట్టుకపోతుంటే; ఆ ధూళిలో ఉక్కిరిబిక్కిరైన నిరాశత, క్షోభతోనూ వ్యధతోనూ కర్తవ్యశూన్యుడై ఖిన్నుడుగా నిలబడిపోతాడు. శారీరకంగానూ, మానసికంగానూ చాలా దెబ్బ తింటాడు. మళ్ళీ తేరుకోడానికి కొన్నిరోజులుపట్టినా మామూలుమనిషిగా మాత్రం లేవడు. ఈ కొద్దిరోజుల్లో ఎంతో వయస్సు గడచిపోయినట్లుగానూ - ఆవయస్సు యిచ్చిన నూతనానుభవంతో ఇక ఈలాంటి గాలిమేడగాక, పునాదిబలమైన పెద్దభవంతినే ఆచరణపూర్వకంగా కట్టాలనేపట్టుదలతో నిలబడతాడు. అయితే ఈ నూతనంగా తలపెట్టిన కృషికీ లోగడ జరిగిపోయిన పనులకూ చాలా వ్యత్యాసముంటుందనుకుంటాడు. ఇంతకూ విచిత్రమేమంటే; ప్రేక్షకులకు ఇదికూడా మరో రంగుతో కల్పించే గాలిమేడగా గోచరించినా - ఆ అనుభవజ్ఞుడు మాత్రం ఒప్పుకోడు.

పైనుదహరించిన యథాతథ విషయమే రాము జీవితంలో జరిగింది. అయితే పగిలిన అద్దంలోకూడా ప్రతిబింబం కనిపిస్తుంది. పగలకముందు ఒక్క ఆకారం ... ఇప్పుడు నాలుగైదుముఖాలు వికారరూపంలో కనిపించడంకూడా సహజం.

తాను అనారోగ్యంగా ఉన్నానని తెలిసిన లక్ష్మి, ఎంతమంది అటకాయించినా ఆగదనీ, తన్నొకసారి తనివితీరాచూసి, కళ్లనీళ్లతో కాలు కదుపుతుందని ఊహించాడు. కాని ఈవిషయం ఆమెకు ఎంత కాలానికి తెలుస్తుందో అతను అంచనా వేయలేకపోయాడు.

చాలారోజులకు ఈనాడే అయిదు గంటలకు ఆహారం తీసుకొని రాము తన గదిలో కూర్చొని ఉన్నాడు. ఏదన్నా ఆలోచిద్దామన్నా - ఆలోచించ గల ఓపిక కూడా లేదన్నట్లు నిస్త్రాణగా వాలు కుర్చీలో కూర్చొని పిచ్చిగా పైన తిరిగే పంకాకేసి చూస్తున్నాడు.

శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి

ధర్మయ్యను తీసుక వచ్చిన మల్లయ్య గుమ్మంవెలుపలనుండే "బాబుగారూ" అని పిలిచాడు.

రాము తలప్రక్కకు త్రిప్పి చూశాడు. "రండి"అని మెల్లగా క్లుప్తంగా ధర్మయ్యను ఆహ్వానించాడు.

ధర్మయ్య రాముని ఆశ్చర్యంగాచూస్తూ "ఏలా వుంది" అంటూ వచ్చి మరో కుర్చీ మీద కూర్చున్నాడు.

"బాగానే వుంది" అంటూ ఘుక్కవదనాన్ని ప్రక్కకు పెట్టుకున్నాడు. ధర్మయ్యలో మొదట కలిగిన ఆశ్చర్యం అతని మొగంమీద ఇంకా ముద్రపడిపోయి అలాగునేవుంది. ఈ కొద్దిరోజుల్లో రాము గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు.

"అసలూ జబ్బు ఏమిటి బాబూ!" అని ధర్మయ్య అడిగాడు. ఆ సంగతి ఎవరికి తెలుసు? డాక్టరే అంతుపట్టలేక పోయాడు. రాము సమాధానమివ్వలేదు. అతని పెదాల మీద చిన్న నవ్వు విరక్తిగా వెల్లడైంది.

"నిన్నను నాన్నగారిదగ్గరకొచ్చేవరకూ నాకీసంగతి తెలీనే తెలీదు"అన్నాడు మళ్ళీ ధర్మయ్య. ఈమాటకు రాము ఆశ్చర్యంగా ధర్మయ్యకేసిచూశాడు. జమిందార్లయింట్లో జంతువుకి అనారోగ్యంగా ఉన్నా అరక్షణంలో ఊరంతా పాకిపోవడం సహజమని తెలుసున్న రాము వారం రోజులు మంచంమీదఉన్నా అభిమానులకు కూడా తెలీలేదనడంలో ఆశ్చర్యపడకమానలేదు. అయితే రోగం ఉనికి తెలిసిన జమిందారు ప్రమాదం లేనిదానికి ప్రచారం అనవసరమని ఊరుకొని ఉంటాడని రాముకేం తెలుసు?

"లక్ష్మికి మంచి సంబంధమే కుదిరింది"

"ఊఁ"

"నిన్నటిరోజునే ముహూర్తం కూడా నిశ్చయించాం"

"........"

"అల్లుడు స్కూల్ ఫైనల్‌వరకూ చదివాడు"

ఈసారి ధర్మయ్య తీక్షణంగా రాముకేసి చూశాడు. రాము ఆమాటలు వినడంలేదని తెలుసుకున్నాడు. ఈలాంటి పరధ్యానం రోగలక్షణమేమోఅని కూడాగ్రహించాడు. ధర్మయ్య కుర్చీమీదనుంచి లేచి "వెళతా బాబూ" అన్నాడు.

ఈసారి రాము లేచిన ధర్మయ్యను చూసి "వెళ్లిరండి" అన్నాడు. ఈ నిర్లక్ష్యమైన వీడ్కోలు ధర్మయ్యకు చాలా అసహజంగా వుంది. రాము ఆకారంతోపాటు మనస్సు కూడా కుష్కించిందేమో అనుకుంటూ గుమ్మం దాటాడు ధర్మయ్య.

"మాష్టారూ?" అని మళ్ళీ రాము పిలిచాడు.

ధర్మయ్య వెనక్కి తిరిగి వచ్చాడు. ఈసారి రాముకూడా అంతగా ఓపికలేకపోయినా కుర్చీమీదనుంచిలేచాడు. "పెళ్ళి ఎప్పుడన్నారూ?" అని అడిగాడు.

పెళ్లి ఫలానాఅప్పుడని రాము పరధ్యానంగా ఉన్నాడనే ఉద్దేశంతో ధర్మయ్య చెప్పలేదు. చెప్పిఉంటాడని రాము ఊహిం

చాడు.

"పదిహేనురోజులుంది"

"మంచిది. పెళ్లి బాగా చేయండి" అన్నాడు. ఈమాటలో తీరని వ్యథ ధ్వనించింది. ధర్మయ్య రాముకేసి అలాగే చూస్తున్నాడు. రాముకళ్లల్లో నీళ్లు తిరగడంకూడా ధర్మయ్య చూశాడు. రాము మళ్లీ ఈలా అన్నాడు. "లక్ష్మి అదృష్టాన్ని కళ్లారా చూడగల యోగ్యతుంటే; తప్పకుండా పెళ్లికి నేనుకూడా వస్తాను" మెల్లగా కళ్లు తుడుచుకుని ధర్మయ్య అక్కడుండగానే రాము గది విడిచాడు.

వచ్చినదగ్గర్నుంచి రాము ప్రవర్తనలో విశేషాన్ని ధర్మయ్య చూడగలిగాడు. కాని రోగంద్వారా కళ్లనీరు కార్చే దౌర్బల్యం కూడా రాములో కలిగిందంటే ధర్మయ్య చాలా విచారించాడు. మెల్లగా అతనుకూడా గది విడిచి వెళ్లిపోయాడు.

చాలామంది తమ పిరికితనమునేలోపాన్ని మభ్యపెట్టుకోడానికి, ఇతర్లు ఉన్నమాట చెప్పలేనివారుగా ధైర్యవిహీనులుగా చిత్రించటం పరిపాటి! ఇప్పుడు రాము దృష్టిలో లక్ష్మి చాలా నేరస్థురాలుగా నిర్ణయించబడింది. అయితే సమాజం స్త్రీల కిచ్చిన వరాల్లో సిగ్గు చాలా పెద్దవరం! ఈవరాన్ని వరునిగురించి చర్చ వచ్చినప్పుడే రహస్యంగా గుర్తు పర్చుకోనకపోతే; సాటివాళ్లల్లో "సిగ్గుమాలినది" అనే అయాచితమైన బిరుదు పెళ్లికాని ఆడదానికి సంప్రాప్తిస్తుందని రాముకు తెలీదు.

ఇక లక్ష్మిపెళ్లి వారంరోజులే ఉంది.

ఈరోజు రవితోపాటు ధర్మయ్య జమిందారు అందజేయబోయే ఆర్థికసహాకారం గురించివచ్చి హాలులో కూర్చున్నాడు.

మేడపైన కాఫీ తీసుకుంటున్న జమిందారుకి ఈ కబురు అందడంతోనే ముహం చిట్లించి "ఇంకా వారం రోజులుందిగా అప్పుడే ఏంతొందరొచ్చింది" అని మెల్లగా గొణుక్కున్నాడు.

అరగంటదాటినతర్వాత మేడదిగి వచ్చిన జమిందారుని చూసి ధర్మయ్య లేచాడు. కాని ఈ నియమానికి రవి పెద్ద విలువ యివ్వలేదు.

జమిందారు సోఫాలోకూర్చుంటూ "ఇతనెవరూ?" అని ప్రశ్నించాడు.

ధర్మయ్య కూడా కూర్చున్నాడు. "మా చెల్లెలిగారబ్బాయి" అని అన్నాడు.

"పేరు రవికదూ?" అని మళ్లీ జమిందారు అడిగాడు.

"అవును" అని రవే సమాధానమిచ్చాడు.

"మిలునులో మేస్త్రీగా పని చేస్తున్నది నువ్వేనా?"

"అవును" రెండోసారికూడా అదే సమాధానమిచ్చాడు రవి. వచ్చినపని విడిచి అనవసరప్రసంగం చేయడం రవికంతగా యిష్టం లేదు. అయితే ఉద్రేకపూరితంగా ఉన్న సత్యాన్ని వెళ్లడిచేసే, వ్యక్తులు జమిందారు దృష్టిలో నిలబడి ఉంటారనేరహస్యం రవికి గుర్తులేదు.

"సరే! మీరువచ్చినపని?"

జమిందారువేసిన ఈ ప్రశ్నకు ఆశ్చర్య

★ దత్తత ★

వృద్ధ ధర్మయ్య వెంటనే సమాధాన మివ్వలేక పోయాడు.

"లక్ష్మి పెళ్లివిషయంలో మీరు నేస్తానన్న సాయంకోసం వచ్చారు" అని ప్రక్కనున్న రవి సమాధానం చెప్పాడు.

రవినితీసుకవచ్చేముందు ధర్మయ్య చాలా సంకోచించాడు. పిల్లిని చంకపెట్టుక పెళ్ళి నట్లుగా ఉండకుండా చేయాలని భగవంతుణ్ణి కూడా ప్రార్థించాడు. అయితే రవి ఇచ్చిన ఈసమాధానానికి ధర్మయ్య రవిని పేచీ కోరుగా ముందు ఊహించడం మంచిది కాదేమో అనికూడా అనుకున్నాడు.

"అలాగే! అన్నమాటప్రకారం తప్పకుండా యిస్తాను..." అంటూ రవితో చెప్పి, ధర్మయ్యకేసి దృష్టి మరల్చి "పెళ్లి యింకా ఎన్నిరోజులుంది" అని అడిగాడు జమిందారు.

"వారంరోజులు"

"నేనివ్వవలసిన డబ్బుకి ఇప్పుడేం కంగారొచ్చింది" ఈ మాటకు ధర్మయ్య అగమ్యంగా చూశాడు. రవికి బాధ కలిగింది. "కంగారుకదండీ! డబ్బు లేనిదే ఏపనీ జరగదు.....వెయ్యి రూపాయలు ఖర్చు కనిపిస్తోంది" అన్నాడు రవి.

"వెయ్యిరూపాయలు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

ఈప్రశ్నకు వెంటనే ఎవర్నుండీ సమాధానం రాలేదు. జమిందారు నవ్వాడు. రవి, ధర్మయ్య, ఆశ్చర్యంగా చూస్తూనే వున్నారు.

"ధర్మయ్యగారూ! లక్ష్మిపట్ల లక్ష్యం లేకపోతే; లక్ష్యంగా డబ్బుకూడా మన దగ్గర ఉండదు. పేదవాళ్ళు ఎక్కువమంది కావడం ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టకపోవడం వల్లనే అనే సంగతి అనుభవమున్న మీరుకూడా గుర్తించకపోవడం నాకు చాలా ఆశ్చర్యంగానే వుంది... మాలాంటివాళ్ళే ఈ పెళ్ళివిషయాల్లో ఎంతో క్లుప్తంగా ఖర్చు పెట్టడానికి చూస్తారు...ఒక్క ఆడపిల్ల పెళ్ళికి ఒక్క వెయ్యిరూపాయలు" జమిందారు అరచేతులు నలుపుకుంటూ మళ్ళీ నవ్వి పెదవి ఒక్కసారి విరచాడు.

ఈ మాటల సందర్భమూ, ఈ అభినయ విశేషమూ, రవికి చాలా ఖేదభావాన్ని కలిగించాయి "ఈ రోజుల్లో వెయ్యి రూపాయలంటే; చాలా తక్కువనుకుంటాను" అన్నాడు మెల్లగా రవి.

"ఏమిటి" అని తలెత్తి ఎర్రగా చూశాడు జమిందారు.

ఇది కలహం గాకుండా ఉండగలందులకు ధర్మయ్య బిక్కుబిక్కుమంటూ, యిష్టదేవుణ్ని మనస్సులో ప్రార్థిస్తున్నాడు.

"జమిందార్ల పెళ్ళిళ్ళు నేను చూడకపోయినా, చెప్పుకోవడం విన్నాను. ఈ వెయ్యిరూపాయలూ గాలికి ఎగిరిపోయే సెంట్లకుకూడా సరిపోవనే సంగతి మీకు కూడా తెలుసు" అన్నాడు. ఈ మాటకు జమిందారు కోపం చూపలేదు. జమిందార్ల గొప్పతనాన్ని వెళ్ళడిచేసే ఆ వాక్యం ద్వారా ఒక సంతోషాన్నికూడా పొందగలిగాడు. అందుకే మళ్ళీ ఒక్కసారి నవ్వి "ఊఁ తరువాత" అని రవిని హెచ్చరించాడు.

ధర్మయ్య ఒకసారి ఆందోళన రహితంగా నిట్టూర్చాడు.

"మీ రన్నట్లుగా ఆడపిల్లకు ఏదోవిధంగా పెళ్ళి చేయాలంటే; ఒకోసారి డబ్బు కూడా అక్కర్లేదు"

"ఏమిటదీ" జమిందారు సంశయంగా అడిగాడు.

"ముసలివాళ్ళకూ, అంగవిహీనులకూ, అందమైన ఆడపిల్లను అర్పిస్తే; వాళ్లే డబ్బు సాయం చేయొచ్చు. కాని మేష్టారు అమ్మాయికి అనుకూలదాంపత్యం కావాలని చూశారు. అందుకే వెయ్యిరూపాయలు చాలా తక్కువే అంటున్నాను"

"అబ్బా! చాలా తెలివైనవాడవే!" అనే భావం వెల్లడయ్యేటట్లుగా తల క్రిందకు వంచి కోరగా రవికేసి చూశాడు జమిందారు. "కట్నం ఎంత?" అని అడిగాడు.

ఈసారి ధర్మయ్య సమాధాన మిచ్చాడు "మంగళ సూత్రధారణ సమయంలో అయిదు వందలు లాంఛనంగా యివ్వాలని చెప్పారు"

"దాని పేరు?" జమిందారు అడిగాడు.

"ఎక్కువ కట్నాలు తీసుకోకూడదని ప్రభుత్వం శాసనం పెట్టింది కదండీ! నల్ల బజారుకి మారుపేరు ధర ఎక్కువని కదూ? ఇదీ అంతే!" అని రవి నిర్లక్ష్యంగా - తేలికగా సమాధాన మిచ్చాడు.

"సరే! సంతోషించా" అంటూ కుర్చీ మీదనుంచి లేచాడు. రవి సులభంగా అన్న మాట జమిందారు కింత ఆగ్రహం కలిగిస్తుందని రవి అనుకోలేదు. కాని ధర్మయ్యకు మాత్రం ఆ మాట ఉపయోగించడంలో చాలా కంగారే పుట్టింది. జమిందారు కేవలం భూములమీదనే ఆధారపడలేదనీ, రహస్యంగా ఒకటి రెండు పెద్ద వర్తకాలు చేస్తున్నట్లుగా ధర్మయ్యకు తెలుసు.

"నే నెంత సహాయం చేస్తానని మీ రనుకున్నారు?" ధర్మయ్యను చూస్తూ తీవ్రంగా అడిగాడు.

ధర్మయ్య లేచి నిలబడ్డాడు. రవి అలాగే కూర్చొని "అంతాను" అని సమాధాన మిచ్చాడు.

"పట్టిది. నేను యింత యిస్తానని మీతో ఏమీ అంకె చెప్పలేదు. అంకె చెప్పలేదని అబద్ధం ఆడ్డంకూడా నా ఉద్దేశం కాదు. ఒక వంద రూపాయలకు మించి నేను సాయం చేయలేను ..ఉండండి" అంటూ జమిందారు తొందరగా పైకి వెళ్ళిపోయాడు.

ధర్మయ్య కళ్ళల్లో నీళ్ళు తిరగడం ప్రక్కనున్న రవి గమనించాడు. కుర్చీ మీదనుంచి లేచాడు.

"మాష్టారూ" అని ఆతురతగా ప్రశ్నించాడు.

"నాయందు దయయుంచి నువ్వు మాట్లాడకు బాబూ!" ఈ మాట గద్గదికంగానూ; ఉద్రేకపూరితంగానూ ధ్వనించింది. రవి నిర్విణ్ణుడైపోయాడు.

"మాట్లాడక కూర్చుంటావా? కూర్చో! లేదా యింటికి వెళ్ళిపో!" అని కూడా ధర్మయ్య అన్నాడు.

రవి మాట్లాడకుండా నిలబడిపోయాడు. జమిందారు చేతిలో వందరూపాయల నోటుతో మెట్లు దిగడం ధర్మయ్య చూసుకొని కళ్ళు తుడుచుకొన్నాడు.

"తీసుకోండి" వచ్చిన జమిందారు ధర్మయ్యకు యివ్వబోయాడు. ధర్మయ్య మనస్సు వ్యథాపూరితమైంది. లక్ష్మికి జరగబోయే పెళ్ళి గుర్తుకువచ్చింది. జమిందారుతో ధర్మమీమాంసతో విరోధపడ్డం ఎంత అపాయకరమో ఆ స్వల్పకాలంలోనే తెలుసుకున్నాడు.

"తమ దగ్గరే ఉంచండి"

"ఏం?"

"ఒక్క విషయం తమరు ఆలోచించాలి ...నా అనేవాళ్లు ఈ గ్రామంలో మీరు తప్ప నాకు అన్యులెవరూ లేరని తెలుసు... తమ ప్రోత్సాహంతోనే ఈ పెళ్ళికి ప్రయత్నించాననే సంగతికూడా మీకు తెలుసు..."

"మీ అమ్మాయికి పెళ్ళిచేయడం నాకు ఉపకారంగా భావిస్తున్నారా?"

దీనిలో ఎంత సత్యముందో ధర్మయ్యకు ఏం తెలుసు? కాని ఆ మాటకు కూడా ధర్మయ్య బాధపడలేదు. మెల్లగా ఈలా అన్నాడు "ఎంతమాట... కాని ఈ స్వల్పకాలంలో ఎవర్ని అర్థిస్తే ఫలితముంటుందో చెప్పండి! చేతిలో ఒక కానీకూడా లేదు ...మీ మీదనే ఆశపెట్టుకొని..."

"బావుంది... నే నన్న మాటకు నాకు

వెయ్యిరూపాయలు జరమానా వేస్తున్నా రన్నమాట"

"మీ రాలా అంటే"

"ఏలా అనాలి? మీకు వెయ్యిరూపాయ లిస్తే; నాకు తిరిగి వచ్చేదారి?"

ఈమాటకు ధర్మయ్య యిప్పుడే ఆలోచించాడు. జమిందారు ఎందుకు డబ్బు యివ్వడం గురించి వెనుకాడుతున్నాడో తెలుసుకున్నాడు "నా యిల్లు తనఖా పెడతాను" అని బాధగా అన్నాడు.

"ఆ యింటిమీద అయిదువందల కంటే ఎక్కువ యివ్వలేను"

రవి కోరగా కోపంగా జమిందారుకేసి చూస్తున్నాడు.

"మీ కిష్టమేనా?"

ధర్మయ్య ఏమీ సమాధానమివ్వలేదు. తల మాత్రం పంకించి ఊరుకున్నాడు.

జమిందారు గుమాస్తాను పిలచి, విషయాన్ని చెప్పి, తెచ్చిన వందరూపాయలూ ధర్మయ్యకు యివ్వబోయాడు.

"తనఖా వ్రాసుకున్న తర్వాత మొత్తం యిద్దురు గాని" అన్నాడు ధర్మయ్య.

"ఇది ఉచితంగా ఇద్దామనుకుంటున్నాను"

అసలే మండిపోతున్న రవికి ఈమాట మరీ కష్టంగా తోచింది.

"ఆ వంద ఏ పూరికొంపమీదన్నా తనఖాకి యివ్వండి"

"వయస్సుకుమించి మాట్లాడుతున్నావ్ రవీ!" కోపంగా అన్న జమిందారుమాటకు రవి ఏదో సమాధానం యివ్వబోతుంటే; ధర్మయ్య రవిని చూస్తూ "రవీ! నువ్విక్కడ్నించి వెళ్ళిపోవడం చాలామంచిది" అని బిగ్గరగా అన్నాడు.

"ఔను. నేనూ అదే అనుకుంటున్నాను" అని చెప్పి రవి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

జమిందారు వందరూపాయల నోటు తీసుకొని, మేడపైకి వెళ్ళిపోయాడు.

ధర్మయ్య కొన్నేపు నిలబడి గుమస్తా గదిలోకి వెళ్ళడానికి రెండడుగులు వేసేసరికి, రాము తన గదిలోనుంచి బైటకు రావడం చూశాడు. రాము తిన్నగా ధర్మయ్య దగ్గరకు వచ్చాడు.

"ఆ అయిదువందలూ నేనిస్తాను మీరు నిశ్చింతగా లక్ష్మి పెళ్ళిచేయండి" అని మెల్లగా చెప్పి తనగదిలోకి వెళ్లిపోయాడు.

అప్పట్లో ధర్మయ్యస్థితి ఆ మొగం ప్రత్యక్షంగా మాసినవాళ్ళకుగాని అర్థంకాదు. ఆనందబాష్పాలు కండువాతో తుడుచుకుంటూ, సంతోషంగా నిట్టూర్చి, రామును మనస్సులో దీర్ఘాయుష్మంతుడవు కమ్మని దీవించి గుమస్తాగదిలోకి వెళ్ళాడు.

23

ఈ వారంరోజులూ జమిందారు తనఖామీద యిచ్చిన అయిదువందల రూపాయలతో వివాహకార్యక్రమాలు శాంతమ్మ సలహాలతో సక్రమంగానే జరిపించగలిగాడు ధర్మయ్య.

పెళ్లి యీరోజు రాత్రికే; ఎరుగున్నవాళ్ళకు భోజన ఏర్పాట్లుకూడా చేశాడు. రెండువందల విస్తళ్లు సంతుష్టిగా లేచాయి. ధర్మయ్య అంటే ధర్మమూర్తిగా భావించే పాటకజనం కూడా లక్ష్మిపెళ్ళికి పప్పన్నం తినడానికి ఆనందంగా వచ్చారు. వాళ్ళకుకూడా ఉన్నదాంట్లో ఏ లోటూ జరగనివ్వలేదు ధర్మయ్య. ధర్మయ్య యిల్లు పెళ్ళిశోభతో కళకళ్ళాడుతూంది. వచ్చే జనం పోయేజనం తెరిపేలేదు. శాంతమ్మకు ఈ వారంరోజులనుంచీ ఎక్కడా తీరిక అనేది లేనేలేదు. ఉదయంనించి రవి ఎక్కిన సైకిలు దిగనేలేదు. తల్లి కోర్కెతో రాముని ఆహ్వానించడానికి, రవికి యిష్టం లేకపోయినా, రెండుసార్లు జమిందారు యింటికి వెళ్ళాడు. ఉదయం వెళ్లినప్పుడు రాము లేవలేదని తెలిసింది. రెండోసారి వెళ్ళినప్పుడు రాము కనిపించాడు.

"అమ్మ భోజనానికి రమ్మనమని చెప్పమంది" అని రవి చెప్పాడు. ఆలా చెప్పమనే శాంతమ్మ చెప్పింది.

"ఇప్పుడు రాలేను. రాత్రి పెళ్ళికి వస్తాను" అని రాము సమాధానం చెప్పాడు.

"సరే" రవి తిరిగి వెళ్లిపోయాడు. ఇప్పుడు రాలేనివాడు రాత్రి పెళ్ళికి రావడం ఎంత నిజమో; రవి ముందే అంచనా వేసుకున్నాడు.

రవి రావడం చూసిన శాంతమ్మ "రాము వస్తున్నాడా?" అని ఆతురతగా అడిగింది. పెళ్ళికూతురు దుస్తుల్లో ఉన్న లక్ష్మికూడా గుమ్మం ప్రక్కనుండి రవి సమాధానంకోసం చూస్తోంది.

"నీకు పిచ్చిగాని ఎందుకొస్తాడమ్మా" అని సమాధాన మిచ్చాడు రవి.

"మరొక్కసారి వెళితే" ఆశగా చూస్తూ అడిగింది.

"అవసరముంటే నువ్వెళ్లు" అని కోపంగా గుమ్మందిగి, ఇతరవాళ్ళను పిలవడానికి సైకిలెక్కి వెళ్ళిపోయాడు రవి.

రవి వెళ్ళినతర్వాత శాంతమ్మ గుమ్మంలో నిలబడ్డ లక్ష్మికేసి చూసింది. లక్ష్మి తల వంచుకొని ఏదో ఆలోచిస్తూ గదిలోకి వెళ్లిపోయింది.

రాము ఉదయంనించీ కార్యసాఫల్య విధానంకోసం చాలా ఆందోళనగా పరిపరి విధాల ఆలోచిస్తూ, హాలులోకి రావడం గదిలోకివెళ్లి కూర్చోడం చేస్తున్నాడు. కాని విధానంమటుకు ఏమీ స్ఫురించలేదు. ప్రతినెలా ఏభైరూపాయలు జేబు డబ్బులుగా తండ్రినించి తీసుకుంటున్న రాముకు అయిదువందల రూపాయలు ఒకేసారి సంపాదించడం చాలా కష్టంగానే కనిపించింది. పెట్టె తిరగవేస్తే పాతిక రూపాయలు కనిపించాయి.

ధర్మయ్య బాధలో, జమిందారు మాటలు చాటునించి విన్న రాము, వచ్చే విధానం గురించి ఆలోచించకుండా ఆయన దుస్థితికి వగచి, అయిదువందలు యిస్తానని వాగ్దానం చేశాడు.

సులభంగా యిచ్చిన వాగ్దానం ఆచరణలోకి వచ్చేటప్పటికి ఎంత కష్టసాధ్యమో ఊహించాడు. అప్పుడే కనుచీకటి పడుతోంది.

ఒకటి మూడు గంటల్లో లక్ష్మి మరొకళ్ల సొత్తు అయి కూర్చుంటుంది. రెండోది ఇష్టంలేని బాధాకరమైన ఈ పెళ్లికి తనే అయిదువందల రూపాయలు సంపాదించి తీసుకవెళ్లాలి.

తీసుకవెళ్ళకుండా ఉంటే పెళ్ళి ఆగిపోతుంది. ఆగిపోవడమే మంచిదేమో; స్వార్థపూరితమైన రాము మనస్సు ఈలాంటి దుష్టయోచనకూడా చేయకుండా ఉండలేకపోయింది. తనమనస్సు తలపెట్టిన ద్రోహానికి రాము చకితుడైపోయాడు. "ఎంత ద్రోహం" అని మెల్లగా గొణుక్కున్నాడు. ఏదో ఆలోచన కలిగింది. తిన్నగా మేడమెట్లు ఎక్కి తల్లి గదిలోకి వెళ్ళాడు రాము.

వక్కాకు వేసుకుంటున్న పార్వతమ్మకు ఆ సమయంలో రాము రాక ఆశ్చర్యం కలిగించింది. "ఏం బాబు" అని అడిగింది.

"అయిదువందలు కావాలి" అలా నిలబడే ఆత్రంగా అడిగాడు. ఈమాటకు ఆకు వేసుకుంటూ ఆవలించిన నోటిని ఆలాగే వుంచి మెల్లగా లేచి "ఏమిటంటున్నావ్" అని అడిగింది.

"అయిదువందలు కావాలి చాలా అవసరం" మళ్ళీ ఆలాగే నిలబడి అడిగాడు.

"ఎందుకూ?"

రాము ఏమీ సమాధానం చెప్పలేదు. తీవ్రమైన పట్టుదలతో సాధింపుకోసం ఆలాగే చూస్తున్నాడు. రాము వైఖరి చూసి మొదట్లో ఆశ్చర్యపడిందల్లా, తరువాత భయపడింది "నాన్నగార్ని పిలుస్తా" అంటూ పార్వతమ్మ వెలుపలకు వెళ్లబోయింది.

(24-వ పేజీ చూడండి)

ఎవరికి వారే

(తెర ఎత్తగానే వీధిలో మునిసిపాలిటీ కొళాయిదగ్గర తెల్లటి సైనుపంచ ముసుగు వేసుకుని శ్లోకాలు వల్లించుకుంటూ స్నానం చేస్తున్న సుబ్బమ్మ, చుట్టూ బిందెలతో సరస్వతమ్మ, పార్వతమ్మ, వరసమ్మ, రావమ్మ, లక్ష్మమ్మ, సుశీల కన్పిస్తారు.)

సరస్వతమ్మ: ఏం సుబ్బమ్మగారూ, వేగం కానీయండి స్నానం! - మీరొక్కరే ఇంతసేపు కొళాయి పట్టుకొని కూచుంటే మిగిలినవాళ్ళు ఎంతసేపు ఇలా నిల్చుంటా రనుకున్నారు?

సుబ్బమ్మ: ఏవం పతత యుక్తాయే... భక్తాస్త్వాం... పర్యుపాసతే ... ఎలాగమ్మ మరి! - చెయ్యనిస్తావా లేదా?

వరసమ్మ: చెయ్యనివ్వకపోవడం లేదు - కొళాయి తిరగగానే ఆరంభించారు స్నానం - గంట కావస్తోంది ఇంకా లేవక పోతే ఎలాగండీ?

సుబ్బ: గంటసేపెక్కడయిందే?... శ్రద్ధయా పరయోపేతా స్తేమే యుక్తతమా మతాః...

పార్వతమ్మ: గంటేమిటి? - గంటకిపైనే అయింది మీరు స్నానం ఆరంభించి - ఈసరి కేనా తెమలకపోతే ఎలాగ?

సుబ్బ: ఏతు సర్వాణి కర్మాణి... మైసన్యస్య మత్పరాః... ఏమిటమ్మా, పూర్తిగా స్నానం చేయనివ్వరేమిటి?

లక్ష్మమ్మ: లేవండి మరి వేగంగా! - రోజల్లా మీరిక్కడ కూచుంటే అవతల మాకేం పనుల్లేవా యేమిటండీ ఇక్కడ గంటలకొద్దీ నీళ్ళకోసం కూచోడానికి?

సుబ్బ: (కోపంతో) ఏమిటమ్మా మీ తొందర? - మునిసిపాలిటీవాళ్ళు కట్టించిన కొళాయిదగ్గర స్నానం చేస్తుంటే మీ అడ్డేమిటి మధ్యని?... తేషామహం సముద్ధర్తా...

సుశీల: మునిసిపాలిటీవాళ్ళు కట్టించింది కనకనే అందరికీ అధికారంవుంది అమ్మమ్మ గారూ! - ఇది అందరికోసం కట్టించారు.. ఈ సంగతి మరిచి కొళాయి తెరిచింది మొదలు మీరొక్కరే పట్టుక్కూర్చుంటే మాకు మరి నీళ్ళక్కర్లేదా చెప్పండి!

సుబ్బ: (కోపంతో) అయ్యో, అక్కర్లేదన్లేదే తల్లీ!... లేచిపోతానే మా అమ్మ!..

సుశీ: వేగంగా స్నానం చెయ్యమంటే అంతకోపం దేనికండీ?

సుబ్బ: కోపం పడలేదే అమ్మా!... మీతో మేం కాలగలంటే తల్లీ?.. ఓ రెండుచెంబులు నెత్తిమీద పోసుకుపోయే దానికే ఇంతలా దెబ్బలాడేవాళ్ళని నే నెక్కడా చూళ్ళేదే తల్లీ!

లక్ష్మ: ఇప్పుడు మీతో ఎవరు దెబ్బలాడేరు పిన్నిగారూ!-అవతల చాలా పనులున్నాయి; వేగం స్నానం చేయండమ్మ అంటే దెబ్బలాటా?

సుబ్బ: (కోపంతో) మరి స్నానంచేయకపోతే ఆడుతున్నానా యేమిట్రా?— అంత తొందరైతే ఎలాగ?-స్నానం పూర్తి కానిస్తారా లేదా?

సుశీ: (నవ్వుతూ) ఇది కూడా ఓ రకమైన ఆటేనండీ! - దీనినే జలక్రీడ అంటారు.

సుబ్బ: (పట్టరాని కోపంతో) ఏమిటే ఆ రాలుపాటు? - పెద్దా చిన్నా లేకుండా నోటి కెంతొస్తే అంతేనా? - నే నిక్కడ ఆడుకుంటూ కూచున్నానా?... క్లేశాధికతర స్తేషా...

శ్రీ పంతుల కృష్ణారావు

సుశీ: అయితే మరి వేగం కానీయండి స్నానం?

సుబ్బ: మరి చేస్తున్నానా లేదా?... మయ్యాసక్త చేతసాం...

సుశీ: ఎంతసేపు చేయడం? - మీపారాయణ పూర్తయేదాకా సహస్రఘటాభిషేకం చేసుకుందా మంటే వీధికొళాయి దగ్గర వీలుంటుందా?

సుబ్బ: అయ్యో, ఇదేం పాడు బుద్ధే? - నేను శ్లోకాలు వల్లించుకుంటే నీకేంబాధే మధ్యని?

సర: అయితే ఇంటికి పోయి వల్లించుకోండి!- ఇక్కడ కూచొని ఏనాటికీ లేవకపోతే మా పను లేం గావాలి?

సుబ్బ: అయ్యో, లేచిపోతానే నా అమ్మ!- ఈ కాలపు వాళ్ళతో మేం చాలగలంటే తల్లీ?- పాడుకాలం వచ్చింది. ఓ దేవుడంటే భక్తా? - పెద్దలంటే గౌరవమా? - మరీ భూమ్మీదా ఆకాశంమీదా వుండరు!

(ఇంతలో ముసుగు సవరించుకుంటూ వెంకమ్మ బిందె పట్టుకొని వస్తుంది.)

వెంకమ్మ: ఎవరమ్మ అక్కడ స్నానం చేస్తోంది? - సుబ్బమ్మగారా?...సుబ్బమ్మగారూ, మా అమ్మ మా అమ్మ! - వేగం లెద్దురూ! - అవతల మా నాడు ఇప్పుడు 'మేలు'లో రాజమండ్రీ వెళ్లాలి. వేగం వంట చేయమన్నాడు. త్వరగా వండి పెట్టాలి! - ఎసరు పెడదామంటే ఇంట్లో నీళ్లు లేవు...మా తల్లీ, ఓ రెండు చెంబులతో ఒళ్లు తడుపుకొని బిందెడు నీళ్లు పట్టుకుపోతాను.

పార్వ: ఏమండోయ్ వెంకమ్మగారూ! మీకంటే అర్జంటు నాకు! - ఇంట్లో ఆరేళ్ల చిన్నగుంటని వుంచి వచ్చాను గంట కిందట, నీళ్ళకోసం. ఈసరికేనా వెళ్లకపోతే ఇంట్లో కుక్క దూరుతుందో, పిల్లే దూరుతుందో?- సుబ్బమ్మగారి తర్వాత నేను పట్టుకోవాలి నీళ్ళు!

సర: మీకంటే అత్యవసరమండీ నాకు, పొయ్యిమీద బియ్యం పడేసివచ్చాను. అది మాడిపోతే మరి బియ్యం కూడా లేవు.

వర: నాకు మరీ అర్జంటు పనులున్నాయండీ! - అవతల చంటిపిల్ల ఏడుస్తుంది.

లక్ష్మ: ఆయనకి ఆఫీసు టైమైపోతోంది. వడ్డిద్దామంటే ఔపోసన కూడా నీళ్లు లేవింట్లో.

వెంక: మీ అందరిపనులూ తర్వాత చేసుకోవచ్చునమ్మ-సుబ్బమ్మగారి తర్వాత నన్ను తీసుకోనివ్వండి! - అవతలవాడికి మేలువేళకి వండిపెట్టాలి!

సర: మీరు కొంచెం ఆగాలి వెంకమ్మగారూ! - పొయ్యిమీద బియ్యం......

పార్వ: ముందు నేను తీసుకోవాలి సరస్వతమ్మగారూ!-ఇంట్లో చిన్నగుంటని...

వర: అవతల పిల్లేడుస్తోందండీ!

రావ: ఇప్పుడు నే నర్జంటుగా ఓ బిందెడు తీసుకెళ్ళకపోతే పిల్లేదమ్మా - కొళాయి కట్టేశారంటే చచ్చేనన్నమాటే! - ఇంట్లో పురిశెడు నీళ్ళు లేవు.

వెంక: మొదట నేనో రెండు చెంబులు పోసుకొని ఓ బిందెడు పట్టుకుపోతాను. తర్వాత మీరంతరూ తీసుకుందురు గాని!

సర: వీల్లేదండీ, సుబ్బమ్మగారి తర్వాత నేను తీసుకుంటాను.

పార్వ: నేను పట్టుకుంటాను సుబ్బమ్మగారి తర్వాత!

సుబ్బ: అబ్బ! ఏమిటే దెబ్బలాట? - దూరంగా వుండండి నే వెళ్ళిపోతాను! - తర్వాత మీరు దెబ్బలాడుకుందురుగాని!...



ంబరధరం విష్ణుం.-అయ్యో, దారివ్వరే
ా, ముట్టేసుగుంటారేవిటి?

ంక : ముట్టేసుగోలేదు ... ఇలా వెళ్లి
ండి సుబ్బమ్మగారూ!

సుబ్బ : దారివ్వండి మరి!...శశివర్ణం - చతుర్భుజం...ప్రసన్నవదనం... (వెళ్ళిపోతుంది. అందరూ ఒక్కసారిగా వెళ్ళి కొళాయిమీద పడతారు. అందరికంటే ముందు వెంకమ్మగారు వెళ్లి కొళాయి క్రింద బిందె పెడుతుంది. కాని నీటిని పడనివ్వకుండా మిగిలినవారంతా గట్టిగా కొళాయి మర పట్టుకుంటారు.)

వెంక : ఒదలండమ్మా మర! - అలా పట్టుకూర్చుంటే నీరెలా పడుతుంది?

సర : వీల్లేదు వెంకమ్మగారూ, మొదట నే నిన్ని నీళ్ళు పట్టుకుపోవాలి. మీ బిందె తీయండి!

లక్ష్మి : ఏమండోయ్, నేను మొదట.

పార్వ : నేను మొదట పట్టుకోవాలండీ.

వెంక : మీరంతా నేను వెళిపోయాక పట్టుకుందురు గాని! - అవతల వాడికి మేలు వేళకి వండిపెట్టాలి! - ఓ రెండు చెంబులు బుర్రమీద పోసుకొని ఓ బిందెడు నీళ్ళు పట్టుకుపోతాను.

సర : వీల్లేదండీ!

పార్వ : ఏవండోయ్, మా అమ్మ! - నన్ను తీసుకో నివ్వండి మొదట!

లక్ష్మ : ఏంవమ్మోయ్, మీరందరూ కొంచెంసేపు నిల్చోవాలి! - అవతల ఆయనకి ఆఫీసు....

నర : నన్ను మొదట తీసుకోనివ్వండమ్మా! - అవతల చంటిది...

రావ : ఇంట్లో ఓ చుక్కైనా నీళ్లు లేవు. ఏ పనీ కాలేదు.

సుశీల : బాగుందండీ, ఇంతమందికీ ఒక్కమాటే అర్జంటయితే ఎలాగ? - ఎవరో ఒకరు తీసుకోవాలి గాని!

వెంక : అదే చూశావా, వాడికి మేలు టైముకి...

సర : నాకూ అంతకంటే అర్జంటు పనులున్నాయ్.

పార్వ : నాకు మరీ అర్జంటు పనులున్నాయ్.

లక్ష్మి : నాకు ప్రాణావసరమైన పనులున్నాయి.

నర : నాకు పీకలమీద పనులున్నాయి.

సుశీ : అయితే, ఒకరికి కాకుండా ఒకరు దెబ్బలాడుకుంటూ కూచుంటే నీళ్లు తీసుకొని వెళ్లడం అవుతుందటండీ- ఇప్పటికే ఎవరూ నీరు తీసుకోకుండా అరగంట పైన గడచిపోయింది. మళ్ళీ తొమ్మిదిన్నరకి కొళాయి కట్టేస్తారు...అంచేత ఎవర్నో ఒకరిని మొదట పట్టుకొని పోనివ్వండి!... ఒకరి తర్వాత ఒకరు వరసగా తీసుకుంటే అందరం వేగంగా నీళ్లు పట్టుకొనిపోవచ్చు.

సర : చాలేవే మా చెప్పొచ్చావ్! - పొద్దల్లా నీలాగ కొళాయిదగ్గర ముస్తాబై నిలుచోడానికి మాకేం పనులు లేవనుకుంటున్నా వేంటి?

పార్వ : నీకయితే ఇంటిపూచీ ఏంలేదు అఖ్ఖర్లేదు.

నర : ఇంటి చాకిరీ అంతా ఆ ముసిలిది చేస్తోంది కనక టింగురంగా అని ముస్తాబై నిలబడింది.

సుశీ : నాకేం పనిలేక నిల్చోలేదండీ ఇక్కడ! - అర్జంటు పనులున్నాయని అందరం దెబ్బలాడుకుంటూంటే ఎవరి పనీ కాదని చెబుతున్నాను.

లక్ష్మి : నువ్వు మాకే మీ చెప్పక్కర్లేదులే! - నీపాటి మాకూ తెలుసు!...ఊఁ! బిందె తియ్యండి వెంకమ్మగారూ - వేగం

వెంక : వీల్లేదమ్మా!...

సర : ఏమైనా మొదట మీరు పట్టుకోడానికి వీల్లేదు వెంకమ్మగారూ! - మీరు లేవాలి!

వెంక : ఏవింటమ్మా నీ అధికారం? - మీ తాతగారు కట్టించినట్టు మాట్లాడుతున్నావ్

సర : మీ అధికారం ఏవింటి? - మీ బాబుగారు కట్టించినట్టు సాధిస్తున్నారు.

రావ : మునిసిపాలిటీవాళ్లు కట్టిం[illegible]

వెంక : అహాఁ - అయితే మ[illegible] నీళ్లు పట్టుకోవద్దనడానికి మీ అధికారం [illegible]?

నర : మా అందరికంటే మీరు వెనక వొచ్చారు...

(ఇంతలో వెంకమ్మగారి కొడుకు ప్రకాశం వస్తాడు.)

ప్రకా : ఏమే అమ్మా, ఇంకా కొళాయి దగ్గర కూచున్నావేం? - స్టేషనుకి బయల్దేరే వేళవుతోంది-వేగంగావచ్చి నాకు వడ్డించి! అర్జంటుగా పోవాలి!

వెంక : (ఆశ్చర్యంతోను, విచారంతోను) అప్పుడే వేళయిందిరా?

ప్రకా : అప్పుడే ఏవిటి? ఇప్పుడే తొమ్మిదిన్నరయింది!

వెంక : (విచారంతో) అయ్యో నా మొహంమండా! - ఈ దిక్కుమాలిన కొళాయి

★ ఎవరికి వారే ★

దగ్గర నీళ్ళకోసం వుండిపోయాన్నా నాయనా! - ఇంట్లో పురికెడు నీళ్ళు లేవని వచ్చాను కాని ఇలా ఔతుందనుకోలేదురా బాబూ! - (కోపంతో) అయినా పరమ ఛండాలపు ముండావూరు ఇదేతప్ప మరోటి లేదు! - ప్రాణావసరమైన పను లున్నాయమ్మా అని ప్రార్థించినా ఓ పిసరు మొహమాటం వుంచి ఆలోచించరు!

ప్రకా: పోనీ, మరేం ఫరవాలేదు స్టేషను దగ్గర హోటల్లో భోంచేస్తాన్లే! - నే వెళిపోతాను ఇంటికి రా!

వంక: అయ్యో, ఏం బాధొచ్చిందిరా! ఇల్లూ వాకిలి వుంటూండగా పాడు హోటేలు భోజనం చేయవలసొచ్చిందిరా తండ్రీ! - ఈ వల్లకాటి నీళ్ళకోసం పని మానుకు నిల్చున్నాన్రా (కోపంతో సరస్వతమ్మ మొదలగువారితో) అయిందమ్మా మీ దెబ్బలాట? - ఓ బిందెడు నీళ్ళు పట్టుకుంటానంటే వీల్లేదని బంకెక్కలాగేరు - ఇంక నా కక్కర్లేదు - మీరే నెత్తిమీద పెట్టుకోండి నే పోతున్నాను (వెళిపోతుంది).

సర: (వెంకమ్మ వెళిపోయినవంకనే చూస్తూ) ఎవరిమీదనో ఆ కోపం? - అందరికంటే ఆఖరునొచ్చి నేను ముందంటే ఎవరొప్పుకుంటారనుకుందో?

పార్వ: అదే; ఎవరిమీదనో అలక! -

లక్ష్మ: వల్లకాటి నీళ్ళట! - మరి ఆ నీళ్ళకోసమే...

సర: పోనీ, శని విరగడైంది! - హమ్మయ్య - పొద్దుటనగా ఒస్తే ఇప్పుడు చోటు దొరికింది - (కొళాయి క్రింద బిందె పడుతుంది)

పార్వ: ఏమండోయ్ సరస్వతమ్మగారూ! - మా తల్లీ! - మొదట నన్ను తీసుకోనివ్వండి - అవతల ఇంట్లో ఎవరూ (సరస్వతమ్మ పెట్టిన బిందెను తీయబోతుంది.)

సర: (పార్వతమ్మను అడ్డగిస్తూ) వీల్లేదమ్మా! - పొయ్యిమీద బియ్యం...

సర: మొదట నేనో బిందెడు పట్టుకోనిదీ మరెవ్వరినీ పట్టుకోనియ్యనమ్మా! (కొళాయి మర తిప్పుతుంది.)

పార్వ: (కోపంతో) పట్టుకోవద్దనడానికీ పట్టుకోనీయక పోవడానికి మీరెవరమ్మా? - (నీరు పడకుండా కొళాయి మర త్రిప్పి పట్టుకుంటుంది.)

సుశీ: ఎవరూ ముందుకొకుండా ఎలా అవుతుందండీ?...

పార్వ: అందరికంటే అవిశే ముందు కావాలంటే ఎలా వీలవుతుందే! - అందరికీ అంత అర్జంటే వుంటుంది!

సుశీ: (విసుపుగా) బావుందండీ! — అంతా అర్జంటని దెబ్బలాడుకుంటూంటే ఎప్పటికి తగువు తీరుతుంది? ఇప్పటికే గంటాయె దెబ్బలాటవుతోంది - ఎవరో కొందరు తగ్గి వెనక్కి వుంటే - ఒకరి తర్వాత ఒకరు తీసుకొని వేగం పోవచ్చు.

అందరూ ఒక్కసారిగా: వెనక్కుండడానికి మాకు తీరుబాటు లేదు.

(ఇంతలో గొల్ల గుంపమ్మ, ఆమె కోడలు చెరో నాలుగేసి బిందెలు పట్టుకొని వస్తారు.)

గుంప: తెగండమ్మ తేగి! - అవతల గేదెల కుడితిలోకి నీళ్ళు లేవు - పోవాల!

సర: ఇదిగో, పార్వతమ్మగారూ, వాళ్లు మనకోసం నిల్చుండిపోయారు. అంచేత మనం ఇలా దెబ్బలాడుకుంటూ కూచోడం బాగులేదు......అందుచేత నన్ను తీసుకోనివ్వండి!

పార్వ: అదే నేనూ అంటున్నానండీ! -

గుంప: అదేటమ్మా! - అంతా నేను ముందంటే నేను ముందని కయ్యాలాడుకుంటూ కూకుంటే ఎప్పటికి తెగుతాది!

సుశీ: గంటన్నరాయె ఈ దెబ్బలాట అవుతోంది గుంపమ్మా! - అందరు ముందుగా పోవాలని దెబ్బలాడుకుంటున్నారు. ఎప్పటికీ తెగకుండా వుంది. ఎవర్ని వెనక్కుండమంటే వాళ్ళే ఒప్పరు...

గుంప: ఏటి, గంటాయె కయ్యాలాడతన్నారా? ... అయితే తెగండమ్మ - తర్వాత కయ్యాలాడుకుందురుగాని నేను నీళ్ళుతీసుకుపోతాను మొదట. (వెళ్ళి బింద పట్టి మరవిప్పుతుంది)

సర: (కోపంతో) అయితే అదేవిటే తోసుకొని మీదకొచ్చేస్తావేవిటి? - ఉండు ముందు నన్ను పట్టుకుపోనీ!

గుంప: గంటాయె యేటి సేస్తున్నారమ్మా!

సుశీ: నేను ముందంటే నేను ముందని దెబ్బలాడుకుంటున్నారు.

గుంప: అందుకే నేను మొదట ఎల్లిపోతాను. తర్వాత ఏ. సేసుకుంటే సేసుకోనీయండి! ...ఒగ్గండమ్మ మర! - అలా పట్టుకుంటారేం?

పార్వ: అయితే నువ్వీ ఎనిమిది బిందెలు పట్టుకొనేదాకా మమ్మల్ని నిల్చోమంటావుటే?

గుంప: నిల్చోమనలేదమ్మా కయ్యాలాడుకుంటూవుండండి!...

లక్ష్మ: ఏం పొగరే? - అందరికంటే వెనకనొచ్చి? వేుం ఒదలం! - ఒదలకండీ ఏం చేస్తుందో చూదాం!

చాకలి పద్దులు రాస్తున్న భార్య:—

"ఏమండీ, యీవేళ తేదీ ఎంత అండీ?"

పేపరు చదువుకొంటున్న భర్త:-

"ఉండు; మనీపర్సు చూసి చెప్పుతాను!"

గుంప : వెనకనోస్తేమాత్రం మీరు కయ్యాలాడుకుంటూ కూకుంటే ఎంతసేపు నిలుసుంటావమ్మా ?...ఊఁ ! ... (కోపంగా) ఒగ్గండి మర ! (అందరినీ దూరంగాత్రోసి మర విప్పుతుంది.)

సర : మోటమనుషులతో మాటలేమిటి?– ఓ పిసరేనా మర్యాద తెలిసి ఏడిస్తేగా?– ఆ జాతే అంత !

పార్వ : వాళ్ళతో మరి మాటలేమిటి?– ఇంట్లోవున్న పశువులెంతో అంతే వీళ్లూను.

గుంప : ఏవండో! – ఆలోచించుకొని మాటాడండి!...పశువులు, గిశువులు అంటే ఒప్పేది లేదు.

పార్వ : ఏమిటే ఒప్పక పోవడం?–

రావ : పోనీ ఊరుకుందురూ పార్వతమ్మగారూ! (గుంపమ్మతో) శాంతించవే తల్లీ!

(రెండునిముషా లెవ్వరూ మాటాడరు. గుంపమ్మ మొదటి బిందె నీటితో నిండి పోగానే రెండో బిందె పట్టబోతుంది)

సుశీల : గుంపమ్మా!–ఇదిగో మాతల్లీ!– మొదట నేనీ బిందెపట్టుకుంటాను. గంటన్నరాయవచ్చి వీలులేక నిల్చుండి పోయాను.

గుంప : అయ్యో ! పట్టుకోండి తల్లీ ! (బిందె తీస్తుంది. సుశీల బిందెపట్టినీరుపట్టుకు పోతుంది)

(నిశ్శబ్దంగా పావుగంట గడుస్తుంది. గుంపమ్మ నీరుపట్టుకుంటూ వుంటుంది. ఇంతలో సరస్వతమ్మకొడుకు వస్తాడు)

సర-కొ : అమ్మా! – పొయ్యి మీద అన్నం అంతా మాడి బొగ్గయిపోయింది.

(పార్వతమ్మ కూతురు వస్తుంది.)

పార్వ. కూ : అమ్మ అమ్మా!–మనింతో నేమోనీ ర,పిల్లి దూరి పాలూ?...తాగేసిందే!

పార్వ : (కోపంతో) సరి అయిందీ?– నే ననుకుంటూనే వున్నాను.

ఒక గొంతుక:ఏమే నరసమ్మతల్లీ!–ఇంకా కాలేదా నీళ్లుపట్టుకోడం? చంటిది ఏత్ఛేడ్చి ఉయ్యాల్లోంచీ పడిపోయింది...ఈపాటి కేనా వేగం తెములు!

లక్ష్మమ్మ కొడుకు: అమ్మా. నాన్న గారికి ఆఫీసు వేళయిపోయిందట. తిడుతున్నారు.

లక్ష్మ : అప్పుడే వచ్చిందీ ప్రళయం?– పొద్దుట్నించీ శివజాగరం అవుతోంది కాని ...అయినా ఇక్కడ వున్నలాటి కుచ్చితపు బుద్ధిమనుషులు మరెక్కడా వుండరమ్మా!– (కోపంగా గుంపమ్మతో) ఏం గుంపమ్మా, అయిందా నీ నీళ్లు పట్టుకోడం?

గుంప : ఇదిగోనమ్మా! – అయిపోవస్తోంది. లేచిపోతాను.

నర : (కొళాయివంక చూస్తూ) అదేవిటే, నీటిధార అంత సన్నంగా పడుతోందేం?

గుంప : అవతల కొళాయికట్టేస్తుంటే మరేలా పడతారమ్మా ?

రావ : ఇన్ని నీళ్ళుపట్టుకుపోదామని పొద్దుటనగా వస్తే దిక్కుమాలిన పోరు ఒచ్చి పడింది...(కోపంగా) ఇదేం పూరో కాని ఇలాటి వాళ్ళనేం చేసినాపాపం లేదు. (ఖాళీ బిందె చంకన పెట్టుకొని అందరివంకా కోపంగా చూస్తూ వెళ్ళి పోతుంది వెంట మిగిలిన అమ్మలక్కలు కూడా ఖాళీ బిందెల్తో బయలుదేరుతారు.)

గుంప : (వ్యంగ్యంగా) ఏవమ్మోవ్, ఇంతసేపు నిల్చొని ఇప్పు డెలిపోతారేం?– నాను తీసుకోటం అయింది ! మీరు పట్టుకోండమ్మా !

లక్ష్మ : (కోపంగా) కొళాయి కట్టేస్తే మరేం పట్టుకోవడం – పిలకలు?

నర : పిలకలు పట్టుకోవడం మొదటయిందిగా ? – అంచేతే నీళ్ళుపట్టుకోవడం కాలేదు.

గుంప : (వెనకనుంచీవస్తూ) పోనీ ఏవో ఒకటి పట్టుకోటం అయిందిగాదటమ్మా?– మరెందుకు విచారం? – (నవ్వుకుంటూ వెళి పోతుంది. లక్ష్మమ్మ, నరసమ్మ వెళిపోతూండగా తెరపడుతుంది.) ★

★ దత్తత ★

(19-వ పేజీ తరువాయి)

తల్లి చేయిపట్టుకొని ఆపుచేశాడు. "ఈ సంగతి నాన్నగారికి తెలీకూడదమ్మా! నువ్వే యివ్వాలి" అని ప్రాధేయతగా చూస్తూ అడిగాడు.

పార్వతమ్మకు రాము పరిస్థితి ఏమీ అర్థం కాలేదు 'అవసర మేమిటో చెప్పకూడదా?'

"లక్ష్మి పెళ్ళికి సాయం చేస్తానని మాట యిచ్చాను."

ఈమాట పార్వతమ్మకు కొంత అర్థమైంది. అయితే భర్తద్వారా ఒకసారి "రాము పాడవడానికి లక్ష్మి కారణం కావచ్చు" అని విన్నమాట కూడా జ్ఞాపకానికి వచ్చింది.

"నాదగ్గ రెక్కడుంది" అని సమాధానం చెప్పింది.

"వీల్లేదమ్మా" ఉద్వేగంతో తల్లి కాళ్ళ దగ్గర చతికిలపడ్డాడు. "ఎలాగైనా చూడాలి. ఆ డబ్బు యివ్వకపోతే లక్ష్మి పెళ్లి ఆగిపోతుంది. లక్ష్మి పెళ్లి ఆగిపోతే ఆమె జీవితం నాశనమౌతుంది. ఆమె నాశనమైతే నేను బ్రతికుండి కూడా ఫలితం లేదు. అమ్మా!" కళ్ళనీళ్ళతో తల్లి మొగం చూశాడు.

పార్వతమ్మ రాము అన్న ఆఖరిమాటకు విస్తుపోయింది. మెల్లగా రాముని లేవదీసింది. తలవెంట్రుకలు సర్దుతూ "ఏమిటి ఇంత పిచ్చివాడవయ్యావు...సరే! నువ్వు నా గదిలోకి వెళ్లు. నాన్నగారితో మాట్లాడి నేను పట్టుకొస్తాను" అంది.

"నాన్నగారితో చెబితే యిస్తారా?"

"నేను ప్రయత్నిస్తాగా" అని కాస్త ధైర్యం చెప్పింది.

భర్త ఆమె ఆజ్ఞలు లేనిదే ఏపనీ చేయడానికి యిష్టపడని పార్వతమ్మ మాట విని, రాము మేడదిగి తండ్రిద్వారా వచ్చే డబ్బుకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

పచ్చని పందిట్లో బంధుసమూహంలో, మంగళవాయిద్యాల మధ్య లక్ష్మికి ప్రధానం జరిగింది. అల్లుడి కాళ్లు కడుగుతూన్న ధర్మయ్య దృష్టి అంతా రాముమీదనే ఉంది. ఒక గంటకల్లా అయిదువందల రూపాయలూ మగపెళ్ళివారికి అందజేయాలి.

స్తంభం ప్రక్కగా కూర్చొని, ఈ ఆడంబరాలకు విరక్తిగా చూస్తూన్న రవి దగ్గరకు ధర్మయ్యవచ్చి మెల్లగా 'ఈలారా' అని పిలిచాడు.

రవి పందిరిదాటి ధర్మయ్య వెనకనే కాస్త దూరం వెళ్ళాడు. "రాము వచ్చాడా?" మెల్లగా రహస్యంగా అడిగాడు.

"లేడే" అటు యిటూ చూస్తూ రవి సమాధానం చెప్పాడు.

"ఏలాగ" అయోమయంగా చూస్తూ ఆత్రంగా అన్నాడు ధర్మయ్య. రవికి ఇదేమీ అర్థం కాలేదు "ఏమిటి" అని అడిగాడు.

"అయిదు వందలు."

"ఎవరు యిస్తారని చెప్పారు."

రవి వేసిన ఈ ప్రశ్నతో ధర్మయ్య తెల్లబోయాడు. ఈ రహస్యాన్ని రవికి చెబితే; కార్యం పాడుకూలవచ్చునని కష్టమనే భావంతో రవికి చెప్పలేదు. ఆందోళనతో కాస్సేపు రాము వస్తున్నాడేమోనని ఆశగా చూసి, గుమ్మంలోనించి చూస్తున్న శాంతమ్మ వైపు గబగబా వెళ్ళాడు.

"ఇంకా రాలేదూ?" శాంతమ్మకూడా కంగారుగానే అడిగింది.

"లేదు."

"ఏం చేయడం?"

ధర్మయ్య మాట్లాడలేదు. మళ్ళీ శాంతమ్మ "రవిని పంపిద్దామా?" అని అడిగింది.

ధర్మయ్యకు యిష్టంలేదు. కాని తాను వెళ్ళడానికి వీల్లేదు. ఇంతలో ఎవరో "ధర్మయ్యగారూ!" అని పందిట్లోనించి పిలవడంవల్ల "సరే! తొందరగా పంపించు" అని చెప్పి వెళ్లిపోయాడు.

అరుగు ప్రక్కగా నిలబడ్డ రవిని శాంతమ్మ పిలిచింది. "నువ్వేం కంగారుపడకుండా మెల్లగా అడుగు. రాము రాకపోయినా ఫరవాలేదు. డబ్బు తీసుకరా" అని చెప్పింది.

రవి ఏమీ మాట్లాడలేదు. కటువుగా తల ఒకసారి పంకించి మెట్లు దిగాడు.

"ఇక ఎంతో వేళలేదు తొందరగా రావాలి" అని మళ్ళీ హెచ్చరించింది.

లైటులేదని శంకించకుండా, అరుగు ప్రక్కన జేరవేసిన సైకిలు ఆ జనంలో నుంచే కోపంగా ఎక్కి వెళుతున్న రవిని చూసి శాంతమ్మకు ఎందుకో భయంకలిగింది.

రాము అరగంటవరకూ తన గదిలోఉండి తల్లి రాకకోసం ఎదురుచూశాడు. కాలు కాలినపిల్లిలాగ ఆందోళనగా గదంతా కలయ తిరుగుతున్నాడు.

"రామూ" జమిందారు పిలుపువిని రాము వెనక్కు తిరిగిచూశాడు.

"అయిదు వందలూ ఎందుకూ?"

"అమ్మ చెప్పలేదూ?"

"చెప్పినా ధర్మయ్యకు నేను ముందే యిచ్చానుగా."

"నేను మిగతా అయిదువందలూ యిస్తానని మాట యిచ్చాను."

జమిందారు నవ్వాడు. ఈ సమయంలో రాము మనస్సు చురుగ్గా పనిచేస్తోంది. తండ్రిపట్ల ఉండే గౌరవంకూడా కొద్దిగా సడల నారంభించింది.

"ఇది నవ్వుకు వేళకాదు. నా గౌరవాన్ని కాపాడాలంటే యివ్వండి."

"నాకు అగౌరవం కల్పించడానికి నువ్వు యిస్తున్నావ్?"

"అదేమిటి"

"నేను కాదన్నది నువ్వు యివ్వడంలో ఉద్దేశం?" దగ్గరగా వెళ్లాడు "రామూ!" తీవ్రంగా మొగంలోకి చూశాడు. "కష్టించి సంపాదించేవాడికి రూపాయి యొక్క విలువ తెలుస్తుంది...అనుభవం లేనివాడివి హామీ యివ్వడానికి నీకు అధికారం ఎవరిచ్చారు?" కాస్సేపు కోపంగా చూసి "అయిదువందలు కాదుకదా! అయిదు కానులుకూడా ఈలాంటి అనధికార హామీలు యిచ్చి నానుండి పొందలేవ్..." అంటూ గుమ్మం దగ్గరకు వెళ్లి తిరిగిచూసి "నీలాంటి చేతిలో నా ఆస్తిపాస్తులుంటే; ఎంత శాశ్వతంగా నిలవగలవో ఈ నీ హామీని అంచనా వేయవచ్చు" అంటూ గుమ్మం దాటాడు.

"నాన్నగారూ" వెర్రెత్తినట్లు బిగ్గరగా రాము పిలిచాడు. ఈ పిలుపు విని మరీ కోపంగా జమిందారు వెనక్కి తిరిగాడు.

"అయిదు వందలూ యివ్వాలి" అదే ధ్వనిలో అరచాడు.

"యివ్వను" బిగ్గరగా నిక్కచ్చిగా చెప్పాడు.

"నేను తీసుకుంటాను" ఒక తెగింపునకు వచ్చిన రాము గది గుమ్మం దాటబోయేడు. బలమైన జమిందారు రాము చేయిపట్టుకొని, గదిలోకి విసిరాడు. రాము గదిలోకి వెళ్లి కుర్చీతగిలి కింద పడిపోయాడు. జమిందారు బడాలున తలుపు వేశాడు.

సైకిలుమీద చమట్లు క్రక్కుకుంటూ వచ్చిన రవి గేటుదగ్గర కాపలాదారు ఆపుచేస్తున్నా వినక, కాంపౌండులోకి వచ్చి సైకిలు క్రిందపడవేసి హాలులోకి వచ్చాడు.

జమిందారు అప్పుడే మేడమెట్లు ఎక్కుతున్నాడు.

"రామూ" అని రవి బిగ్గరగా పిలిచాడు.

ఆ పిలుపువిన్న జమిందారు వెనక్కి తిరిగి చూశాడు.

రాము తన గదిలోనుంచి, తలుపు తట్టుతూ "రవీ" అని సమాధానమిచ్చాడు.

జమిందార్ని గమనించకుండా రవి వచ్చి తలుపు తీశాడు. గదిలోకి వెళ్ళాడు.

రవిని చూసి రాము స్తంభించిపోయాడు. రవి ఆయాసంగా వగురుస్తున్నాడు. చమట్లు గ్రక్కుతున్నాడు.

"అయిదువందలు ఏవి?" చేయి ఎదుటకు చాపి అడిగాడు.

రాము తలవంచాడు.

"అక్కడ పెళ్లి ఆగిపోతుంది" బిగ్గరగా అరిచాడు.

"నాన్నగారు యివ్వలేదు" క్లుప్తంగా సమాధానం చెప్పాడు.

"తీసుకోవడం చేతగాకపోతే యిస్తానని మాట ఎందుకిచ్చావ్."

"ఇద్దామనుకున్నాను."

"ఏదీ?"

"లేదు."

ఈ సమాధానానికి రవికి శరీరాన్ని మరి చేంత కోపం ముంచుకవచ్చింది. చాచి రాము దవడపై కొట్టాడు. అసలే బలహీనంగా ఉన్న రాము, దెబ్బకు తట్టుకోలేక, తూలి వాలి కుర్చీలో కూలబడిపోయాడు.

ఇక ధర్మయ్యగారి యింటిముందు పెళ్లి పందిట్లో సూత్రధారణచేసే ముందు తండ్రి ఆజ్ఞప్రకారం పెళ్ళికొడుకు లేచి నిలబడ్డాడు. చేతిలోఉన్న మంగళసూత్రాన్ని ఎదురుగా అవమానభారంతో నిలబడ్డ ధర్మయ్యపై విసరికొట్టాడు. పెళ్ళిపీటల మీదనుంచి లేచి పెళ్ళికొడుకూ, వారి పరివారం అంతా వెళ్ళిపోయారు.

లక్ష్మిని పేరంటాండ్రు తిరిగి యింట్లోకి తీసుక వెళ్ళిపోయారు. వంచినతల ఎత్తకుండా ధర్మయ్యవచ్చి గదిలో మంచం మీద కూర్చొని అరచేతిలో తలపెట్టుకొని కళ్ళనీళ్లు కారుస్తున్నాడు.

శాంతమ్మ ధర్మయ్య దగ్గరగా వచ్చి నిలబడింది. ఓదార్చగలశక్తి ఆమెలోకూడా లేదు. జరిగినదంతా ఒక పీడకలలాగ ఆమె భ్రమిస్తోంది.

"లక్ష్మి ఏం చేస్తోంది" కారుతున్న కళ్లనీళ్ళతో తల పైకెత్తి శాంతమ్మకేసి చూస్తూ పలకరించాడు ధర్మయ్య.

శాంతమ్మ సమాధానం యివ్వకుండానే చూస్తోంది.

"అమ్మాయి గొంతుక కోశాను" అంటూ ఈసారి బిగ్గరగా వాపోయాడు.

శాంతమ్మ ధర్మయ్య దగ్గరగా కూర్చుంది. "అన్నయ్యా! ఇక జరిగినదాని కేం చేస్తాం!" అంది. కాని ఊరుకో అని ఊరడించలేకపోయింది.

"ఏం చేస్తాను. ఏం చేయలేను...ఈ అవమానంతో బ్రతికేదానికన్నా - పిల్లా నేనూ ఏదన్నా విషం తిని చచ్చిపోతాం."

శాంతమ్మ భయపడింది. ఈలాంటి అపాయంలో ఏదన్నా ఉపాయంకోసం ఆమె ఆలోచిస్తోంది.

"శాంతమ్మా! ఎంతపని జరిగిందమ్మా! ఏంచేయను" ధర్మయ్య దుఃఖపూరితంగా మళ్ళీ శాంతమ్మకేసి చూసి పలకరించాడు.

"ఒకపనిచేస్తే" శాంతమ్మ మెల్లగా అంది.

"ఏమిటది"

"ఈశుభముహూర్తం దాటకుండా రవికిచ్చి పెళ్ళిచేస్తే"

"శాంతమ్మా" ఆదుఃఖావేశంలో హఠాత్తుగా కలిగిన ఆనందంతో శాంతమ్మ చేతులు పట్టుకొని "నాలక్ష్మిప్రాణాన్ని దక్కించి నన్ను అవమానంనుండి కాపాడు తల్లీ"అని ప్రాధేయపడ్డాడు.

శాంతమ్మ లక్ష్మి దగ్గరకు వెళ్లింది. ఆమె స్పృహతప్పి మంచంమీద పడిఉంది. శాంతమ్మ నీళ్ళు మొహంపై జల్లింది. కొన్నేపటికి లక్ష్మి కళ్ళు తెరచింది.

"లక్ష్మి...నువ్వు నాన్నకోసమైనా యిష్టపడాలి" అంది శాంతమ్మ ఆత్రంగా.

"ఏమిటి" లక్ష్మి హీనంగా అడిగింది.

"రవిని పెళ్లిచేసుకోవాలి"

"మీయిష్టం" అంటూ లక్ష్మి మళ్ళీ కళ్ళుమూసింది. శాంతమ్మ ధర్మయ్యదగ్గరకు వచ్చి, లక్ష్మి అమోదించినట్లుగా చెప్పింది. ధర్మయ్యకూడా పెద్ద అపాయాన్నుండి తట్టుకున్న వాడిలా పందిట్లోకి వచ్చాడు. చాలామందివెళ్లిపోయినా భాజావాళ్లు, మరికొంత పాటక జనం ఉన్నారు" మీరు ఎవ్వరూ ఎక్కడికీ వెళ్లొద్దు. నా లక్ష్మికి పెళ్ళిజరుగుతుంది" అని చెప్పాడు. అంతా ఆశ్చర్యంగా ధర్మయ్యకేసి చూశారు.

మల్లయ్య సైకిలు నడిపించుకొంటూ వచ్చాడు. ధర్మయ్య మల్లయ్య దగ్గరగా వచ్చి "రవి ఏడి" అని అడిగాడు.

"అయ్యగారు యీ సైకిలు మీకిమ్మన్నారు..."

"రవి ఏడీ?" మళ్ళీ ధర్మయ్య బిగ్గరగా అడిగాడు.

"పోలీసోరు జైలుకు తీసుకపోయారు" అని చెప్పాడు.

ధర్మయ్య స్పృహతప్పి అరుగు ప్రక్కగా పడిపోయాడు. శాంతమ్మ ఆత్రంగా వచ్చి "అన్నయ్యా" అని అరచింది.

ప్రక్కనున్నవాళ్ల సహాయంతో చేతుల మీద ధర్మయ్యను తీసుకొని యింట్లోకి చేర్చింది.

(ఇంకావుంది)



విజ్ఞానవీథులు

"డాక్టర్"



125. వారాలమంచి చెడ్డలు

ఈవారం ప్రయాణాలకి మంచిదనీ, ఆ వారమునాడు ఇండ్లకి సున్నము వెయ్యకూడదనీ, కొత్తకుండ తెప్పించకూడదనీ, మగవారు క్షౌరము చేయించుకోకూడదనీ, — ఇలాగ వారాల మంచిచెడ్డల్ని గురించిన నమ్మకాలు మనలో విరివిగా ఉన్నాయి. వీటికి ఆధారము ఏమేనా వున్నదా? లేక వట్టి మూఢనమ్మకాలేనా? అని ప్రశ్న.

వారాలమంచి చెడ్డలివీ అని తెలుసుకుందుకు వారాలు ఇలాగ ఏర్పడ్డాయి అని ముందు తెలుసుకోవాలి. ఆ ఏర్పడిన పద్ధతిలోనే మంచిచెడ్డల నేర్పాటు కనబడితే, ఆ మంచిచెడ్డలే వారాలకి వచ్చేశాయి అని నిశ్చయించుకోవచ్చు. వారాల పేరులు భారత దేశానివి కావు. రోమక దేశంనుంచి మన సంప్రదాయంలోనికి దిగుమతి అయినాయి. కనకనే క్రీ. శ. నాలుగో శతాబ్దమువరకూ ఏశాసనాల్లోనూ వారం పేరు కనపడదు

ప్రాచీనులు, సూర్యుడూ, చంద్రుడూ, బుధుడూ, శుక్రుడూ, కుజుడూ, గురుడూ, శనీ అన్న ఏడింటినీ గ్రహాలన్నారు. ఇవన్నీ నక్షత్రం నించి నక్షత్రానికి జరుగుతూ భూమిచుట్టూ తిరుగుతున్నట్టు కనిపిస్తాయి. ఇవి ఒక్కొక్కటీ అలా తిరిగే వేగాన్ని గుర్తించుకుని, మందగతి గలవాటినుంచి శీఘ్రగతి గలవాటికి వరసగా పట్టిక వేస్తే, శని, గురు, కుజ, రవి, శుక్ర, బుధ, చంద్రగ్రహాలు వరసగా వస్తాయి.

ఒకనాడు గడుసువాడొక సిద్ధాంతి 'ఇవాళ రవివారము, సూర్యోదయకాలం నుంచి గంటవరకూ రవీ, తరవాతి గంట శుక్రుడూ, తరవాతి గంట బుధుడూ — ఇలాగ గంటకొక గ్రహము పాలిస్తుంద'ని చెప్పేడు. పైన ఇచ్చిన వరసలో రవితో ప్రారంభించి చంద్రుడిదాకా వచ్చి మళ్ళీ శనీ, గురుడూ — ఇలా చంద్రుడిదాకా వచ్చి మళ్ళీ శనీ, —

ఇలాగ 24 గంటలూ తిప్పితే, 25వ గంటకి అనగా రవివారము మర్నాడు సూర్యోదయానంతర ఘంటకి చంద్రుడు అధినాథుడు. కనక ఆరోజు చంద్రవారము లేక సోమవారము. ఈ పద్ధతివల్ల వారాలన్నీ ఇప్పుడున్న వరసలో వస్తాయి.

మరి ఈ పద్ధతిలో మంచిచెడ్డ లేమున్నాయీ? గంటకొక గ్రహముకాక 'గడియకొక గ్రహము అధిపతి', అంటే, మనవారాలే తల్లకిందులుగా వస్తాయి. అప్పుడు గ్రహాల వరసని శీఘ్రగాములు మొదలుచేసి మందగామి (శని) వరకూ వేస్తే మళ్ళీ మన వరసలోనే తిరుగుతాయి వారాలు. ఆదిలో ఏదో ఒక పద్ధతి పెట్టుకున్నారు. అదేపద్ధతి ప్రపంచమంతా వ్యాపించింది.

వేదాలలోని 'నక్షత్ర ఇష్టి'లో గాబోలు, ఒకనాడు సూర్యోదయాత్పూర్వముగాని, సూర్యాస్తమయానంతరముగాని, తూర్పునా పడమటా కనబడే నక్షత్రానికి అధిదేవతని ఆరోజున అర్చించాలని వున్నదంటారు.

వినాయక చవితినాడు విఘ్నేశ్వరుని తొండపు ఆకారంలో పేర్చినట్లున్న నక్షత్ర సముదాయము సూర్యోదయాత్పూర్వము తూర్పున కనబడుతుందీ, మళ్ళీ ఆరునెలలనాడు అదే సూర్యాస్తమయానంతరము పశ్చిమాన్న కనబడుతుందీ, అందుకే ఆ రెండురోజుల్నీ పంచాంగంలో వినాయక చవితి, గణేశచతుర్థి అని వ్రాస్తారూ' అని 'భారతి'లో గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు వ్రాశారు. నక్షత్రాలకి సూర్యోదయాత్పూర్వము ప్రాముఖ్యతా, గ్రహాలకి సూర్యోదయానంతరము ప్రాముఖ్యతా! ఈ ప్రాముఖ్యతలకి అర్థమేమిటి?

చిరకాలంనించీ వస్తూన్న ఆచారాలు ఇవి. అంతకుమించి వీటిలో అర్థము కనబడదు. అంటే వారాల మంచిచెడ్డలకి అర్థము ఏమి టన్న మాటా?

126. గాలి ఎట్లా వీస్తుంది?

'సైకిల్ ట్యూబ్' లోనికి పంపుతో గాలిని కొట్టడం అందరు చూసే ఉంటారు. పంపుచేసేపని వాతావరణంలోని గాలిని ట్యూబులోనికి పంపించడమే. ఈ విధంగా ట్యూబ్‌లోనికి ఎక్కువగా గాలిని పంపించడం వలన వాతావరణంలో గాలి కంటె అక్కడిగాలి ఎక్కువ దట్టంగా ఉంటుంది. దీనినే శాస్త్రసంభాషలో అయితే "సైకిల్ ట్యూబుకు బయటనున్న గాలి ప్రేషం (*Pressure*) కంటె లోపలనున్న గాలి ప్రేషం యెక్కువ" అని చెపుతారు. ఇప్పుడు సైకిల్ ట్యూబ్‌కు చిన్న రంధ్రాన్ని పొడిస్తేగానీ, లేదా దాని 'వాల్వుట్యూబు'ను విప్పితే గానీ ఆ రంధ్రం గుండా గాలి చుయ్యిమని బయటకు వచ్చి, ట్యూబ్ తప్పటఅవుతుంది. ఈ విధంగా ట్యూబ్‌లో నుంచి రంధ్రంగుండా గాలి బయటకు రావడానికి కారణం సైకిల్‌ట్యూబ్‌లోపలకంటె వెలుపలగాలి ప్రేషంతక్కువగాఉండడమే. నీరు ఎత్తునుంచి పల్లానికి ప్రవహించినట్లుగ గాలి అధిక ప్రేష ప్రదేశాలనుంచి అల్ప ప్రేష ప్రదేశాలకు ప్రవహిస్తుంది. అది దాని ధర్మం. ఇక ఈ ధర్మాన్ని వాతావరణానికి వర్తింపజేస్తే గాలి యెందుకు వీస్తుందో సులభంగా వ్యక్తమౌతుంది.

గాలిని వేడిచేస్తే అది వ్యాకోచిస్తుందనీ, అందుచేత దాని ప్రేషం తగ్గుతుందనీ అందరకు తెలిసిందే. భూమిపై సూర్యుడు ఏ భాగంలో ప్రకాశిస్తుంటాడో ఆ భాగం వేడి యెక్కుతుందిగదా. అయితే సూర్య రశ్మివల్ల భూమిపై జలభాగంకంటె నేల భాగం వేగంగా వేడెక్కుతుంది. అల్లే వేగంగాకూడా చల్లారుతుంది. అందుచేత పగటిసమయంలో భూమిమీద నేల భాగంలో గాలి పల్చనై అక్కడ అల్ప ప్రేష ప్రదేశాలు(*Low pressure areas*) జలభాగంలో గాలి సాంద్రంగా ఉండి అక్కడ అధిక ప్రేష ప్రదేశాలు (*High pressure areas*) ఏర్పడడంవలన జల భాగమునుండి భూభాగంవైపుకి అప్పుడుగాలి వీస్తుంది. ఇక రాత్రి సమయంలో నేల భాగం చల్లారినంత వేగంగా జలభాగం చల్లారకపోవడంచేత నేలభాగంకంటె జల భాగంయొక్క తాపక్రమం సాపేక్షంగా ఎక్కువగా ఉండి, జలభాగం మీదిగా తక్కువ ప్రేషస్థితిలోను, నేలభాగం మీదిగాలి యెక్కువ ప్రేషస్థితిలోను ఉండడంవలన ఆ సమయంలో గాలి నేల భాగంనుండి జలభాగం వైపుకు వస్తుంది గాలులు నిత్యమూ వీస్తుండడానికి యిదే కారణం.

గాలులు భూమిపై ఒక ప్రదేశంలో నుంచి చేరువగానున్న మరో ప్రదేశం లోకి మాత్రమే గాకుండా భూగోళంలో ఒక అర్ధగోళంనుంచి మరో అర్ధ గోళానికీ, ఒక మండలంనుంచి మరో మండలానికీ కూడా వీస్తాయి. ఈవిధంగా గాలులు వీచడానికి కూడా ఆయామండలాల వాతావరణ ప్రేషాలందేర్పడే వ్యత్యాసాలే కారణం. ఉత్తరార్ధగోళమందు వేసవియైనపుడు భూమధ్యరేఖకు కర్కాటక రేఖకు మధ్యనున్న ప్రదేశంలో ఎండలు మిక్కుటంగా కాయడంవలన ఆప్రాంతంలో అల్పప్రేష ప్రదేశాలేర్పడి, అక్కడకు దక్షిణార్ధగోళంలో భూమధ్యరేఖకు మకర రేఖకు మధ్యనున్న అధికప్రేష ప్రదేశాల నుంచి గాలులు వీస్తాయి. ఇవే వ్యాపార పవనాలు. ఈ విధంగానే దక్షిణార్ధగోళంలో వేసవియైనపుడు ఉత్తరార్ధగోళంనుంచి దక్షిణార్ధ గోళంలోనికి గాలులు వీస్తాయి.

తుఫాను గాలులు వీచడానికి కారణం భూమిపై ఒక పరిమితమైన ప్రదేశంలో భూవాతావరణమందలి అడుగు పొరలలోని గాలి ప్రేషము వాటి పై పొరలలోని గాలి ప్రేషముకంటె తక్కువగ నుండడమే.

భూవాతావరణాన్ని కొన్ని పొరలుగానున్న ఆవరణగా మనం పరిగణింపవచ్చు. భూపటలంయొక్క అధిక తాపక్రమం వలనా, గాలియందలి నీటియావిరి వలనా భూవాతావరణ మందలి అడుగు పొరల సాంద్రత తమ పై పొరలలోని గాలుల సాంద్రతకంటె మిక్కిలి తక్కువయైనపుడు ఒక పరిమిత ప్రదేశమందున్న ఆ తక్కువ సాంద్రతగల వాయువులు తమ పై పొరల లోని గాలులను నెట్టుకొని ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేస్తాయి. ఆవెంటనే ఆవిధంగా ఏర్పడిన అల్పప్రేషప్రదేశంలోనికి ప్రక్కనున్న గాలులు చొరచుకొని వస్తాయి. ఉత్తరార్ధగోళమందైతే అల్పప్రేషప్రదేశ కేంద్రాన్ననుసరించి తూర్పుదిశగా వంగియీ గాలులు లోనికి నెట్టుకొని వస్తాయి. తత్ఫలితంగా అక్కడ అపసవ్య భ్రమణం గల గాలిసుడి యేర్పడుతుంది. ఈ సంఘటన దక్షిణార్ధగోళమందైతే ఆ సుడి భ్రమణము సవ్యంగా ఉంటుంది. ఇవే సుడిగాలులు.

—అనంత్.

రఘు:- ఒరయ్ మీ బావ ఎంతవరకు చదువుకున్నాడు!

రాము:- మా అక్క పెళ్లయ్యేంతవరకు.

—యం. వి. శాస్త్రి, (జగయ్యపేట)



నటరాజు



కర్షక కుటుంబం
(బాస్ రిలీఫ్)



సూర్యప్రకాశ నామదేవ్ గారి
చిత్రాలు. (మద్రాసు)

బౌద్ధ భిక్కులు

దుస్సహవాసము

★

రచన: శ్రీ బత్తుల సాంబశివరావు

అనగనగా ఒక ఊళ్లో
ఉన్నాదొక బండకాకి
ప్రజలను ఏడ్పించుటలో
సాటి లేరు ఆకాకికి

చిన్నవారి చేతిలోని
చిట్టి చిట్టి వస్తువులను
చీమకైన తెలియకుండ
చక్కగ చిక్కించుకొనును.

తరుణుల తలమీద నున్న
పెరుగు గంపలన్ని ద్రోసి,
తరలి పోవుచుండు నెపుడు
తలల పైన రెట్టవేసి.

అందరు వెరగొందురు మరి
దానిధాటి కాగలేరు.
అందురు - "రాకాసి కాకి"
కాని ఏమి చేయలేరు.

చెలిమి చేసె నాకాకి
చక్కని ఒక కీరముతో.
కలసి మెలసి, అవి రెండూ
నుండె మిగుల నెయ్యముతో.

పాపము శుకమెరుగదు గద
కాకి సంగతిసుమంతయు!
తన వంటిదె కాబోలని
తలచెను కాలమ్ముకొంత.

చిలుక మంచిగుణములన్ని
వ్యర్థమాయె కాకిపట్ల.
చిలుక దొక్క గుణమైనను
చెల్లదు ఆ కాకిపట్ల.

కూరుచుండె ఒకనాడవి
మఱ్ఱిచెట్టు కొమ్మ నీడ
చెట్టుక్రింద పవ్వళించె
వేటకాడొకండు కూడే.

కాకి చిలుక కెట్లయినా
కీడు చేయ నెంచింది.
వేటగాని ముఖము మీద
రెట్టవిడిచి పోయింది.

చెట్టు మీద చిలుకే తన
పైన రెట్ట వేసిందని,
కొట్టెను తన వింటితోడ
"దీని పొట్టమట్టా" యని.

వేటగాని దెబ్బతోనె
వెంటనె హతమారె చిలుక.
తనకోరిక తీరిందని
బండకాకి మిగుల కులికె

"చెడ్డవారి చెలిమి చేసి
బ్రతికిన వారున్నారా?"
అందురుమన పెద్దవారు
ఊరకనే అంటారా!!

అద్దెబోటులో—

ముచ్చటగా ముగ్గురు

(కుక్క సంగతి సరే సరి!)

మూలం :
జెరోమ్ కె. జెరోమ్

★

అనువాదం :
విశ్వాత్ముల నరసింహమూర్తి

4

తరువాత తిండి విషయమై చర్చలు ప్రారంభించాం.

"ముందుగా ప్రొద్దుటి ఫలహారాలను గురించి తేల్చుకొందాం. దానికి మనకొక అట్ల పెనం అవసరమ"ని జార్జి అన్నాడు. అట్ల పెనంమాట పరధ్యానగా విన్నాడేమో, మా హారిస్సు, తనకది అరగదన్నాడు. వెధవ వేషాలు వెయ్యక మాట్లాడకుండా వుండమని మేమిద్దమూ కలిసి వాడినోరు నొక్కేసి, మాపని కానిచ్చాం.

"ఊ! అట్ల పెనంతోపాటు ఒక టీపాట్, ఒక కెటిల్, స్పిరిట్ స్టౌవ్ పట్టుకెళ్దాం. అన్నట్లు—స్పిరిట్ స్టౌవ్వే పట్టుకెళ్దాం: కిరసనాయిల్ స్టౌవ్ మాత్రం వద్దు" అన్నాడు జార్జి. హారిస్సూ, నేను వెంటనే ఆ అభిప్రాయాన్ని బలపరిచాం.

అందుకు తగినంత కారణంవుంది. లోగడ ఒక సారి ప్రయాణంలో యిలాగే ఆయిల్ స్టౌవ్ తీసికెళ్లి, దాంతో పడరానిపాట్లు అన్నీపడి, యిక జన్మలో యీపాడు ఆయిల్ స్టౌవ్‌లను కూడా పట్టుకెళ్ల కూడదని శపథం పట్టాం. అప్పుడు మా ప్రయాణం పొడుగునా ఆదిక్కుమాలిన స్టౌవ్‌లోనుంచీ నూనె తెగ కారింది. పడవలో ఎక్కడో మూలగా పెట్టినా, స్టౌవ్‌లోనుంచి కారిననూనె పడప పడవ అంతా ప్రవహించిది. ఏవస్తువు చూసినా, అప్పుడే నూనెలో ముంచి పైకి తీసినట్లు ఒకటే వాసన! గాలి ఎటువైపు నుంచి వీచినా, అందులోనూ చమురుకంపే. చివరికి యీ చమురు ప్రభావం ఎంతదాకా పోయిందంటే, సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు, చంద్ర కిరణాలు అన్నీ కూడా కిరసనాలు కంపుతో నిండిపోయాయి. ఇందులోనుంచి ఎల్లాగైనా బయటపడితే అంతే చాలునని, 'మార్లో' పట్టణానికి చేరగానే, మా పడవని రేవులో కట్టేసి, మేము ముగ్గురమూ వూరిమీద పడ్డాం;—ఎక్కడైనా కాస్త శుభ్రమైనగాలి తగులుతుందేమో తనివితీరా పీల్చుకొందామని. కానీ అదేమి కర్మమో,—ఆబస్తీలో ఎక్కడికెళ్లినా ఆపాడు నూనెకంపు అంతకు రెండింతలు ఎక్కువ ఘాటుగా మా నాసికా పుటాలలో దూరి మమ్మల్ని వుక్కిరిబిక్కిరి చేసేసింది. మాకు మతిపోయింది. అర్ధరాత్రి అయ్యే సమయానికి ఎక్కడో వూరికి దూరంగావుండే ఒక పాడుపడిన పొలంలోకి పోయాం. అక్కడ తల విరబోసుకొన్న దయ్యంలా ఒక పెద్ద చింతచెట్టు వుంటే, దానిక్రింద చేరి, మరి జన్మలో యీదిక్కుమాలిన ఆయిల్ స్టౌవ్‌ని ప్రయాణాల్లో వెంట తెచ్చుకోరాదని తీవ్రమైన శపథం పట్టాం.

ఆవిషయం జ్ఞాపకం వుండబట్టే జార్జి యిప్పుడు 'ఆయిల్ స్టౌవ్ వద్దు; స్పిరిట్ స్టౌవ్ పట్టుకెళ్దా'మన్నాడు.

★ ముచ్చటగా ముగ్గురు ★

ఏమిటో— అనుకొంటాం కానీ — స్పిరిట్ స్టౌవ్ అయినా అంతే! దానిమీద వండిన ఏవంట అయినా స్పిరిట్ వాసనే వేస్తుంది. కాకపోతే ఒక్క సుగుణంమాత్రం వున్నది. ఈ స్పిరిట్ కడివెడు కడుపులోకి పోయినా, కిరసనాయిల్ అంత చెరుపు చెయ్యదు.

ప్రొద్దుటి ఫలహారాలకి కావలసిన పదార్థాలు యింకా ఏమేమిటివున్నాయా అని ఆలోచించి, టీపొడి, నాన్ రొట్టె, వెన్న, జామ్ పట్టుకెళ్దామన్నాడు జార్జి. మధ్యాహ్నం భోజనానికి బిస్కట్లు, బ్రెడ్, వెన్న చాలు అంటూ, జున్నుమాత్రం ససేమిరా వద్దన్నాడు. జున్ను తినటానికి బాగానే వుంటుందికానీ, దాంతో అనేకరకాలైన యాతనలు పడవలసి వస్తుంది. బోటు బోటుఅంతా దానికి చాలదన్నట్లు అందులో ప్రయాణం చేసే మనుష్యుల వొంటికి కూడా ఆవాసన పట్టేస్తుంది. ఆమీదట మీరు ఏది తింటున్నా అన్నీ జున్నువాసనే వేస్తాయి.

ఇదివరకు ఒకసారి నా మిత్రుడొకడు లివర్‌పూల్ పట్నంలో రెండు పెద్దజున్ను ముక్కలు చౌకగావస్తే కొన్నాడు. వాడు కొన్నప్పుడు అవి కమ్మని వాసనవేస్తూ, రెండుమైళ్ళ దూరంలో వున్న మనిషికి అయినాసరే, ఆవాసన తగిలి అతడు గిరుక్కున వెనక్కి తిరిగివచ్చి వీటిమీద వాలిపడేటంత పసందుగా వున్నాయి. నేనుకూడా ఆరోజున లివర్‌పూల్‌లో వున్నాను. ఆనాడే లండన్‌కి తిరిగి వద్దామనుకొంటూ వుండగా, యీ మిత్రుడు ఎదురై, తనకేదో యింకా ఒకటిరెండు రోజులు అక్కడే వుండవలసిన పనిపడిన కారణంచేత, ఆజున్ను ముక్కలని పట్టుకుపోయి, లండన్‌లో తనభార్యకి అందచేయమని బ్రతిమాలాడు. వాటిని కనుక వెంటనే యింటికి చేర్చకపోతే, అవి పాడైపోతాయని చాలా యిదిగా చెప్పాడు. సరే లెమ్మని, జున్ను ముక్కల పొట్లం తీసుకొని ఒకబండి ఎక్కి సేషన్‌కి బయలుదేరాను.

ఆబండికి కట్టిన జంతువుఏదో నాకైతే మొదట్లో ఎంత బుర్రబద్దలు కొట్టుకొన్నా గుర్తు తెలియలేదు కానీ, బండి తోలేవాడు మంచి హుషారుమీద వున్నప్పుడు, అదొక జాతిగుర్రమని చెప్పాడు. నాకప్పుడు బోధపడింది—గుర్రాలనేవి యిల్లాకూడా వుంటాయి కాబోలని! జున్నుముక్కల పొట్లం బండి టాప్ మీద పెట్టించి, నేను బండిలో కూర్చున్నాను. బండి అతి నింపాదిగా కదిలింది. అంతలో ఒక పిల్లగాలి విసిరింది. ఆగాలికి జున్నుముక్కల వాసన నాలుగువైపులా చెలరేగింది. ఆవాసన నాసికా రంధ్రాలకి సోకిన ఆ అశ్వరాజం వెర్రి ఆవేశం ఎత్తినట్లు, పరుగులెత్తటం ప్రారంభించింది. రైలుస్టేషన్ వచ్చినా కూడా ఆగకుండా గుర్రం పరుగుతీస్తూనే వుంది. బండివాడు పెడబొబ్బలు పెట్టగా పెట్టగా, స్టేషన్ దగ్గర కూలీలు నలుగురు పోగై దాన్ని వడేసి పట్టుకొన్నారు. అందులో ఒక బుద్ధిమంతుడు ఆగుర్రం ముట్టెకి తన తలగుడ్డ చుట్టేశాడు. అప్పటికి కానీ ఆగుర్రం నాలుగు కాళ్లూ నేలమీద ఆనించి నిలబడలేక పోయింది.

రైలు టిక్కెట్టు కొనుక్కొని, యీజున్ను ముక్కల పొట్లం చంకలో పెట్టుకొని ప్లాట్‌ఫారం మీదికి వచ్చాను. నేను నడుస్తున్నంత మేరా, జనం అదేమిటో నావంక విచిత్రంగా చూస్తూ, సగౌరవంగా తప్పుకొని, నాకు పోవటానికి దారియిచ్చారు. అంత మన్ననగా చూసిన ఆజనంకేసి చిరునవ్వుతో చూస్తూ చివరికి ఒక కంపార్ట్‌మెంటులో ఎక్కాను. అందులో అప్పటికే ఏడుగురు ప్రయాణీకులు వున్నారు. ఈజున్ను ముక్కల పొట్లం పైబల్లమీద ఒకమూలగా పెట్టి, నేను వాళ్లమధ్య కొంచెం చోటుచేసుకొని కూర్చున్నాను కొద్దినిమిషాలు గడిచాయి. నాకు ఎదురుగుండా సీటులో కూర్చున్న ఒక ముసలాయన ఏమిటో వున్నట్లుండి వుక్కిరి బిక్కిరి కావటం మొదలు పెట్టాడు.

"ఇంత వుతుకుష్టంగా వుందేమిటి యిక్కడ?" అన్నాడు ఆముసలాయన, గుటకలు మింగుతూ.

"ఏమిటో? వూపిరి తీసుకోవటమే చాలా కష్టంగా వుంద"న్నాడు, ఆయన ప్రక్కనే కూర్చొని వున్న యింకొకడు.

వాళ్ల గొంతులు పట్టుకొని ఎవరో పిసికేస్తున్నట్లు, వాళ్లిద్దరూ కలిసి మెలికలు తిరిగిపోవటం ప్రారంభించారు. అరనిమిషం గడిచేలోగా



యింకోకడూ యీ వికారపు చేష్టలు ఆరంభించాడు. ముగ్గురూ కలిసి ముక్కులు మూసుకొని, గుండెలు బాదుకొంటూ కాస్సేపు చిందులు తొక్కారు. మళ్లా ఏం తోచిందో ఏమో, అంతలోనే ముగ్గురూ ఆపెట్టెలో నుంచి దిగిపోయారు. వాళ్లు సొంతం పెట్టెలోనుంచి దిగారో లేదో—నడివయస్సు దాటిన ఆడకూతురు యింకోఆమె తనలాంటి యిల్లాలికి యిలాంటి అవమానం జరగటం తగదంటూ, పెట్టా బేడా (మొత్తం ముప్ఫై సామాన్లు!) సర్దుకొని ఆపెట్టెలోనుంచి దిగిపోయింది.

మిగిలిన ప్రయాణీకులు నలుగురూ ఒక మూలగాపోయి సర్దుకు కూర్చున్నారు. వాళ్లల్లో ఒకడు, వాడి దుస్తులనుబట్టి చూస్తే, శవవాహకుడిలా కనిపించాడు. వాడు, వూరుకొన్న వాడు వూరుకోక, ఈ పెట్టెలో ఏదో కుళ్లినశవం వాసన కొట్టుతున్నదని బిగ్గరగా అన్నాడు. వెంటనే మిగిలిన ముగ్గురు ప్రయాణీకులు ఒకరినొకరు తోసుకొంటూ పెట్టెలోంచి దిగబోయి, తలా ఒక గాయం తగిలించుకొన్నారు.

ఇంక ఆపెట్టెలో నేనూ, మరొక నల్లటాయన మిగిలాం. ఆయనకేసి చూసి, చిరునవ్వు నవ్వుతూ "ఈపెట్టె అంతా మనయిద్దరికే మిగిలిపోయిందే!" అన్నాను. ఆయనకూడా నవ్వాడు. బండి కదిలేటంత వరకు నవ్వుతూనే వున్నాము. బండి బయలుదేరి ఒకటి రెండు స్టేషన్లు దాటేసరికి పెద్దజబ్బు పడ్డ వాడిలా తయారయ్యాడు. మధ్యలో పెద్ద జంక్షన్ ఒకటివస్తే, అక్కడ దిగి 'కాస్త ఏదైనా తాగివద్దాం రమ్మ'ని నేనే ఆయన్ని పిలిచాను. అంత జబ్బుగావుండి కూడా, ఆయన నాఆహ్వానం అందగానే ముఖం చింపిచేట అంత చేసి, నావెనకాలే బండిదిగి బయటికి వచ్చాడు. అంగడిదగ్గరకి వెళ్లి యిద్దరికీ చెరొకగ్లాసుడు పానీయం ఆర్డరు చేశాను. గ్లాసు అందుకొని గుటగుటా తాగి, గ్లాసు అక్కడే పారేసి, ఆయన ప్లాట్‌ఫారం మీద పరుగెత్తిపోయి, యింకో పెట్టెలో దాక్కొన్నాడు. మనుష్యులు యింత నీచంగా ఎందుకు ప్రవర్తిస్తారో అర్థంకాక, నేను ఒంటరిగా తిరిగొచ్చి, నాచోట్లో కూర్చున్నాను.

ఆజంక్షన్ మొదలుకొని లండన్ చేరేలోగా మిగిలిన బండి బండి అంతా జనంతో కిటకిటలాడి పోతున్నా, నేను కూర్చున్న పెట్టెలో నేనుతప్ప మరెవ్వరూ లేరు. మధ్యస్టేషన్లలో రైలు ఆగినప్పుడల్లా, నేను కూర్చున్న పెట్టె ఖాళీగా వుండటంచూసి, "ఓరి, రారోయ్! ఈడ నచ్చినంత సోటుంది: రాండెహా!" అంటూ నా పెట్టెదగ్గిరకి జనం పరుగెత్తుకొచ్చేవారు. తలమీది బరువుతో క్రుంగిపోతూఎవడో ముందుగా నాకంపార్ట్‌మెంట్ తలుపు తెరచి, ఒకటి రెండు మెట్లుఎక్కి లోపలికి అడుగు పెట్టబోయేవాడు. అంతలో వాడికి ఏం వచ్చేదో ఏమో—నిల్చున్న మనిషి నిల్చున్నపళంగా కళ్లు మూసేసి వెనక్కి విరుచుకు పడేవాడు. వెనక నిలబడిన వాళ్లంతా కలసి వీణ్ణి కింద పడిపోకుండా పట్టుకొని చేతులమీద అవతలకి జేరవేయవలిసి వచ్చేది.

లండన్‌లో దిగాక సరాసరి మా మిత్రుడి యింటికి వెళ్లి తలుపుతట్టాను. వాడిభార్య వీధిలోకి వస్తునే గాలి ఎగబీలుస్తూ, అతి పరీక్షగా ఏదోవాసన చూస్తూ తలుపుతీసి "ఏమిటిది?" అని అడిగింది.

"జున్ను! మీఆయన దీన్ని లివర్‌పూల్‌లో కొన్నాడు. వాడికింకా అక్కడ ఒకటిరెండు రోజుల పాటు పనివుందట. నన్ను వీటిని పట్టుకెళ్లి మీకు అందిచమన్నాడు." అంటూ యిందులో నా తప్పేమీ

★ ముచ్చటగా ముగ్గురు ★

లేదని ఆవిడకి సవినయంగా చెప్పకొన్నాను. ఆ విషయంలో తనకేమీ అనుమానం లేదన్నది కానీ, అదేదో మామిత్రుడు తిరిగివచ్చాక, వాడినే అడిగి అంతు తేలుస్తానని ఆవిడ నా ఎదురుగుండానే భయంకరమైన సవాలు ఒకటి చేసింది.

మా మిత్రుడు అనుకొన్న రోజుకి లండన్‌కి తిరిగి రాలేకపోయాడు. మూడోనాడు ఆవిడే మా యింటికివచ్చి "ఆజున్ను ముక్కలని గురించి మా ఆయన యింకేమైనా చెప్పారా?" అని అడిగింది.

వాటిని కాస్త తేమగా వుండేచోట పెట్టమన్నాడనీ, ఎవరినీ ముట్టుకోవద్దన్నాడనీ చెప్పాను.

"ఆదిక్కుమాలిన జున్ను ముక్కల్ని ముట్టుకోమన్నా ఎవరూ ముట్టుకోరులెండి! వీటిని కొనేముందు వాసన ఏమైనా చూసేకొన్నారా?" అని అడిగింది.

వాసన చూసే వుంటాడనీ, అవి అంటే వాడికెంతో యిష్టంగా వున్నట్లుందనీ చెప్పాను.

"అంటే—ఎవడి చేతికైనా ఒక సవర్నయిచ్చి, వాటిని వూరికి దూరంగా పారేయిస్తే, ఆయన ఏమన్నా అనుకొంటూ రంటారా?" అని ఆవిడ ఏదో మథనపడుతూ అనుమానంగా అడిగింది.

"అల్లాంటి దేదైనా మీరు తొందరపడిచేస్తే, వాడు యీజన్మలో మీతో మాట్లాడక పోవచ్చు" నన్నాను.

ఆవిడకి ఏం ఆలోచన వచ్చిందో ఏమో, గబుక్కున నన్నే అడిగేసింది: "పోనీ; మీకు అభ్యంతరం లేకపోతే, ఆజున్ను ముక్కలను తెచ్చి మీయింట్లో అట్టే పెట్టుకొని, మాఆయన తిరిగొచ్చాక ఆయనకే అందచెయ్యగలరా?" అని.

నాకు గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లైంది. "చూడండి; అమ్మా! నామటుక్కు నాకు జున్ను వాసన అంటే చాలాయిష్టం. మొన్న లివర్ ఫూల్ నుంచీ వాటిని యిక్కడికి తీసుకొచ్చిన ఆ అనుభవాల్ని నేను యీజన్మలో మరచిపోను. కానీ, యీ ప్రపంచంలో మనం ఎంతసేపూ మన ఒక్కరిని గురించే కాకుండా, కాస్త యితరుల కష్ట నష్టాలని గురించి కూడా యోచించాలి. ఏమంటారూ?... ఇప్పుడు—యీ యింటి యజమానురాలు వున్నది చూశండి: ఆవిడ అసలే వింతంతువు. పైగా తల్లి తండ్రులు లేని అనాథ. అల్లాంటి నిస్సహాయస్థితిలో వుండే ఒక అనాథ స్త్రీ మనస్సుకి కష్టం కలిగించే పనులుచేయటం నాకు యిష్టం వుండదు. మీ ఆయన కొనియిచ్చిన జున్ను ముక్కలను తెచ్చి యిక్కడ పెట్టటం ఆవిడ మనస్సుకి ఎంత మాత్రం గిట్టకపోవచ్చు." అన్నాను.

"సరే అయితే! ఇక నేను చెయ్యగలిగిన పని ఒక్కటే వున్నది. ఆదిక్కుమాలిన జున్ను ముక్కలని మాయింట్లోనే అట్టేపెట్టి, ఆయన వచ్చేంతవరకు నేనూ నాపిల్లలూపోయి ఏదైనా హోటల్లో వుంటాము" అంటూ రుసరుస లాడుకొంటూ వెళ్లిపోయింది.

ఆవిడ అన్న ప్రకారమే చేసింది. ఇంటి నంతటినీ పనిమనిషిమీద వదిలేసి తాను పిల్లలని తీసుకొనిపోయి ఒక హోటల్లో బసపెట్టింది. ఇల్లు వదిలిపెట్టి పోబోయే ముందు ఆవిడ తమయింట్లో పాచిపని చేసేమనిషిని పిలిచి ఆజున్ను ముక్కలని దాని ముక్కుదగ్గరపెట్టి వాసన చూడమందట. ఆమనిషి అరగంటసేపు వాటిని వాసనచూసిన మీదట, తనకేమిటో పుచ్చకాయలు కోసిన వాసన వస్తున్నట్లు అనుమానంగా వుందని చెప్పిందట. అంత గట్టిముక్కుగల మనిషికి యీ జున్నువాసన ఎట్టి చెరుపూ చెయ్యబోదని ఆవిడ తీర్మానించుకొని, దాన్నే ఆ యింటికి కాపలాపెట్టి, తానుపోయి హోటల్లో మకాం చేసింది.

మా మిత్రుడు లండన్‌కి తిరిగి వచ్చేనాటికి ఆవిడగారి హోటల్ బిల్లు తడిసి మోపెడైంది. వెధవ జున్ను ముక్కలంటే తనకెంత యిష్టం వున్నప్పటికీ, వాటికోసం యింతఖర్చు పడవలసి వచ్చినందుకు మా మిత్రుడికి వొళ్లు మండుకొచ్చింది. ఆపొట్లం పట్టుకుపోయి ఒక కాలవలోకి విసిరేసి యింటికి చక్కా వచ్చాడు. వాడు సొంతం గుమ్మంలో కాలైనా పెట్టకముందే, ఆకాలవలో పడవలు నడిపేవాళ్లు కొందరు వీడి వెనకాలే పరిగెత్తుకొచ్చి, ఆజున్ను ముక్కలని వలలు వేయించి అయినా సరే నదిలోనుంచి తీసి పారేయించకపోతే, తాము బ్రతుకలేమని గోలపెట్టారు. వాటిని పైకి తీయించక తప్పిందికాదు. ఆమరునాటి

రాత్రి ఎవరికంటా బడకుండా వీడు ఆపొట్లాన్ని పట్టు కెళ్లి వల్లకాటిలో వదిలేసి వచ్చాడు. మరునాటి వుదయం అక్కడ కాపలాదారుగా పనిచేసే వాడొకడు దీన్ని గురించి పెద్ద హంగామా చేశాడు. గవులు కంపు కొట్టే యీపదార్థాన్ని యిక్కడ తెచ్చి పడేసి, ఏనాడో చచ్చి గోరీలలోపడి న్నిద్రపోతున్న వాళ్లందరినీ లేవ గొట్టి తన వుద్యోగం వూడగొట్టించటానికే ఎవడో యింత పెద్దఎత్తు వేశాడని వాడు గోలపెట్టాడు.

చివరికి యీపీడ పడలేక మా మిత్రుడు మళ్ళీ ఎవరికంటా పడకుండాపోయి ఆపొట్లాన్ని అక్కడనుంచీ తీసేసి, పొరుగూరికిపట్టుకెళ్లి, అక్కడ ఎవడినో బ్రతిమలాడి, వాడిచేతిలో యింత డబ్బుపెట్టి, ఆజున్ను ముక్కల్ని సముద్రపు టొడ్డున పదిగజాల లోతున పాతి పెట్టించాడు. భూమిలో ఏమేమి రసాయనిక మార్పులు జరిగాయో ఏమో కానీ, ఆస్థలంలో వీచే టంత మంచిరకం గాలి మరెక్కడా లేదనీ, ఆగాలి పీలిస్తే ఎంత ముదిరిపోయిన క్షయరోగమైనా యిట్టే నయమై పోతుందనీ దేశంమీద ఒక వదంతి బయలు దేరింది. దాంతో దేశం నలుమూలల నుంచి రోగార్తులు వందలకి వందలుగా అక్కడికివచ్చి చేరే వారు.

జున్ను అంటే నేనెంత నాలుక పీక్కున్నా కూడా, వాటినిగురించి యింతంత బాధ పడవలసి వస్తుంది కాబట్టి మా ప్రస్తుత ప్రయాణంలో దాని జోలికి పోకుండా వుండటమే మంచిదని నేనూ నిర్ణ యించుకొన్నాను.

"మనకీ టీవద్దులేరా!" అన్నాడు జార్జి. (ఈమాట వినపడగానే మా హారిస్సుగాడి మొఖం యీడిగిలబడిపోయింది. అది గమనించాడో ఏమో-) "ప్రొద్దున్నే టీఒక్కటే తాగి వూరుకోకుండా, ప్రతి రోజూ వుదయం ఏడయ్యేసరికి మూడు పూటలకీ సరి పోయేటంత సుష్టు పూర్తిగా భోంచేసేద్దాం" అన్నాడు జార్జి.

మా హారిస్సుగాడి మొఖం మొగలిచెండు విప్పారినట్లు వికసించింది. 'పరిస్థితులు ఎటుపోయి ఏటు వచ్చినా' సారా సీసా ఒకటి దగ్గిర పెట్టుకోవటం మంచిదని జార్జి సూచించాడు. జార్జికి ఎప్పుడూ అదే దిగులు—పరిస్థితులు ఎటుపోయి ఎటు వస్తాయోనని!



జింక

—శ్రీమతి నందిరాజు సరోజినీదేవి (తెనాలి)

మొత్తం మీద ఆసాయంకాలంలోగా మాతో కూడా పట్టుకెళ్లాల్సిన సామానుల జాబితా తయారు చేశాం. జాబితా చాలా పెద్దదే తయారైంది. మరు నటిరోజు శుక్రవారం అయింది. ఆరోజే బజారుకు పోయి జాబితాప్రకారం కావలసిన వన్నీ కొని, బట్టలు పెట్టుకోవటానికి ఒక పెద్దసంచీ, వంటసామాను పట్టుకెళ్లటానికి వీలుగా రెండు పెద్ద మేదరబుట్టలు పట్టుకొచ్చి, మాగదిలో నట్టనడాన అన్నీ గుమ్మ రించాం: అక్కడవున్న టేబులూ, కుర్చీలూ ఒక మూలకి నెట్టేశాం. కొత్తగా కొనితెచ్చిన సామా నంతా గదిలో పెద్ద గుట్టగా పడేసి, ముగ్గురమూ దాని చుట్టూ చతికల పడ్డాం.

వీటి నన్నిటినీ దేనికదిగా సర్ది మూటలు కట్టే పని నేను చేసేస్తా నన్నాను.

సామానులు సర్దటమంటే నాకు చాలా సరదా

(40-వ పేజీ చూడండి)



వెండి మరచెంబు

ఒకపేటలోనే కాపురం ఉండడంచేత అత్తయ్యా గారింటికి మేమూ మాయింటికి అత్తయ్యా గారూ తరుచు వెళ్ళి వచ్చేవాళ్ళం. అల్లాగే ఒకరోజు అత్తయ్యా, జయ, వాణి, రామం అంతా మాయింటికి వచ్చారు. సాయంకాలం ఆరు గంటలు దాటింది.

"రండి రండ"ని మా అమ్మ ఆహ్వానించింది. అందరూ కూర్చున్నారు.

"ఏమమ్మా వదినా, వంటచేసే వచ్చేవల్లే ఉంది. ఎల్లాగైనా మా వదిన మహా చురుకైంది!" అని అమ్మ హాస్యధోరణిలో అంది.

"ఆ అయింది; నీధర్మమా అని" అంది అత్తయ్య.

"మధ్య నా ధర్మమేమిటి?" అంది అమ్మ.

"అమ్మా! అత్తయ్యకి వాళ్ళకి కాఫీలు చేస్తాను" అని లేవబోయాను.

"ఈవేళ పాలు విరిగిపోయాయి కాదుటే" అంది అమ్మ.

"ఐతే సుబ్బన్నని హోటలుకి పంపిస్తా నన్నా"ను.

"సరే పంపించు" అంది అమ్మ. మూడు కప్పుల కాఫీ ఫ్లాస్కు పట్టదని, మరచెంబిచ్చి చిల్లర లేకపోతే పదిరూపాయిల నోటిచ్చి పంపాను. వాడు వెళ్ళాక అమ్మ అత్తయ్య కబుర్లు మొదలెట్టారు.

"ఎందుకే ఇప్పుడు కాఫీలూ? ఇంకాస్సేపటికి భోజనాలు చేస్తామైరి. మేమంతా తాగే వచ్చాము" అంది అత్తయ్య.

"ఫరవా లేదత్తయ్యా" అని ఊరుకొన్నాను. మా అమ్మందుకుంది.

'పద్మప్రియ'

"అమ్మో వాళ్ళత్తయ్యంటేనా, ఇంకేముందీ ఎక్కడా లేని ప్రేమా" అంది.

"ఔనులే నీగుణాలు రాలేదు మా కోడలికి" అంది అత్తయ్య.

"ఔనమ్మా మాగుణాలొస్తే ఊరుకునే వాళ్ళేనా? ఇంట్లోంచి ఎప్పుడో వెళ్ళగొట్టేవారు" అంటూ ఏవో హాస్యాలాడుకుంటున్నారు. వదినెలు, బావ, నేను పత్రికలు చదువుకొంటూ కూర్చున్నాము. ఇలా కొంతసేపయాక అమ్మకి కాఫీ కోసం వెళ్ళిన సుబ్బన్న జ్ఞాపకం వచ్చాడు.

"ఏమేలలితా; సుబ్బన్న ఇంకా రాలేదూ?" అరగంటవలేదుటే వెళ్ళి?" అంది.

"ఔనమ్మా ఎప్పుడూ ఇంతాలస్యం చెయ్యలేదూ ఈపాటికి వస్తా ఉంటాడు" అన్నాను.

మళ్ళీ అమ్మ, అత్తయ్య కబుర్లల్లో పడ్డారు.

"ఏం పాలో గాని వదినా ఈమధ్య రెండు మూడుసార్లు విరిగిపోయాయి, డబ్బు విరగ్గోస్తానంటే-'మీ గిన్నె సరిగా తోమలేదండి, నేను పాలుపోసే వారి కెవ్వరికీ విరగలేదు మీకొక్కరికే విరిగాయన్నారు,' అంటాడు. వాడు పాలుపోసే వాళ్ళందరిళ్ళకీ వెళ్ళి అడగమని వాడికి తెలుసుటే" అంది.

"మాపాలు ఒట్టి నీళ్ళే సీతా. మీపుణ్యం బాగుంది మీవాడు నీళ్ళు కలపడు ఎప్పుడేనా ఎందుకు విరుగుతాయో గాని" అంది అత్తయ్య.

"అంద రందరేలే! మావాడూ కలుపుతూంటాడు అప్పుడప్పుడు నీళ్ళు. వీళ్ళతో పడలేం బాబూ" అంది అమ్మ.

ఇంకా ఇంట్లో నౌకర్లని గురించి, వాటిని, వీటిని గురించీ సంభాషణ సాగిపోతోంది. అమ్మ కాఫీమాటే మరిచిపోయింది. నాకు మాత్రం సుబ్బన్న గంటైనా



రాకపోవడం ఖంగారుగా ఉంది. గడియారం చూశాను ఏడుంపావైంది.

"అమ్మా! సుబ్బన్న గంటైనా రాలేదేమే?" అన్నాను.

"ఔనే పది రూపాయీల నోటిచ్చినట్లున్నావే?" అంది అమ్మ.

"ఇంకేం. అలా ఉడాయించేశాడేమో" అంది అత్తయ్య.

"రెండు సంవత్సరాల నుంచీ ఉన్నాడు గాని ఎన్నడూ ఒక్క అణా పోవడంగాని, సరుకులు తెస్తే లెఖ్ఖ పొరబాటుగాని యెరగడమ్మా" అని అమ్మ కొంచెం ఆగి, "ఏమో ఏక్షణానికేం బుద్ధులు పుడతాయో ఎవరికి తెలుసూ!" అంది.

అత్తయ్య కొంచెం ఊతదొరికింది. "నమ్మిస్తే గానీ మోసం చెయ్యలేరెవరూనూ. మీరంతా వాణ్ణి బాగా నమ్మడం తెలుసుకొన్నాడూ. ఏపెట్టె బేడా ఎప్పుడూ అందలేదు కాబోలు. ఈవేళ ఆపది రూపాయిల నోటు, పాతిక రూపాయిల చెంబూ అరిటి పండొలిచి పెట్టినట్లు చేతచిక్కాయీ," అంది.

నా గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. నిజంగా వీడు మోసం చేశాడా? ఊహు— ఎప్పుడూ అలా చేయడు. సుబ్బన్న చాలా మంచివాడు. అమ్మ, అత్తయ్య ఇలా అనుకుంటారేమిటి?

"చిల్లర దొరకలేదేమో" అన్నాను వాల్లిగా.

"చిల్లర దొరక్కపోతే ఇంటికి రాకూడదూ" అంది అమ్మ.

"విచిత్రంగాని, ఇంతసేపు చిల్లర దొరక్కుండా ఉంటుందేమిటే" అంది అత్తయ్య. అమ్మకూడా వాడిమీద అనుమానం వచ్చింది కాబోలు "అంతే అంటావా వదినా?" అంది అత్తయ్యతో.

"ఏమోనమ్మా, ఈకాలాన్ని ఎవరు నమ్మారు." అని గడియారం వైపు చూసి "ఏడున్నరైంది ఇంక మేం వెడతామ్మ రా!" అంది. నా వేపు చూసి ఎందుకు పంపిందా[illegible] అమ్మా మా యు కాఫీకి, వద్దనే అన్నాను" అంది.

"ఎప్పుడు అత్తయ్యా వాళ్లూ మా ఇంటికి వచ్చినా, పెడతాముంటే

నేను, అమ్మాకూడా నాన్నగారు అన్నయ్య వచ్చేదాకా ఉండండని బలవంతం చేసేవాళ్లం; ఈరోజు వాళ్లు వెడతామంటే సరేనన్న మాట కూడా పైకి సరిగా రాలేదు. అత్తయ్య, అమ్మ సుబ్బన్నని దొంగవాడను కోడం నాకేదో కష్టం కలిగించింది. వాడు ఏకారు కిందైనా పడిపోలేదు కదా అని ఒకసారి, ఒకవేళ వీణ్ణి మోసంచేసి ఎవరైనా ఆ నోటు చెంబూ లాక్కున్నారేమో నని ఇంకోసారి, లేకపోతే తనే పరాకుపడి ఏబీడీలైనా కొనుక్కున్న కొట్టుమీద చెంబో నోటో మరిచిపోయి కోప్పడతామని ఇంటికి రాలేదేమో నని - ఇలా పరిపరి విధాల మనస్సులో అనుకుంటున్నాను.

అత్తయ్య వెళ్లాక అమ్మ మెల్లిగా దిగులుతో అంది "ఒక్క రూపాయి పోయినా ఆరోజుకు మనస్సు బాగుండదు. ఇరవైయైదు రూపాయల వెండి చెంబు, పది రూపాయిలు ఒక్కసారి," అని ఆగి, "మీ నాన్నగారు వచ్చి ఏమంటారో" అంటూంటే అన్నయ్య వచ్చాడు. మెల్లగా జరిగిన సంగతి చెప్పింది.

అన్నయ్య అన్నాడు "తొందర పడకండి వస్తాడేమో"

నానోట మాట రావడంలేదు. నాచేత్తో నేనే చెంబు, నోటు ఇచ్చాను.

"ఈవిషయం ఎల్లాగరా మీ నాన్నగారితో చెప్పడం?" అని ఇంకా ఏమో అనబోతోంది అమ్మ. రానే వచ్చారు నాన్నగారు. నిశ్శబ్దంగా ఉన్న ముగ్గురం లేచాము.

నాన్నగారు చొక్కా విప్పుకుంటూ "సుబ్బన్నా" అని పిలిచారు.

జంకుతూ అమ్మ లేడని చెప్పి, "ఏం కావాలి" అంది.

అమ్మ వాణ్ణి ఏపని మీదైనా పంపించిందనుకున్నారోయేమో. "అబ్బే ఏం లేదు" అని పడక్కుర్చీలో కూర్చున్నారు.

మాఇల్లు ఎప్పుడూ అంత నిశ్శబ్దంగా లేదని నాకనిపించింది. గొడవ లేకపోయినా ఎవరిమట్టుకు వారు నిర్భయంగా ఉండేవాళ్లం. ఎవరిపని వారు చూసుకునే వాళ్లం. ఆరోజు అలా కాకుండా, అందరికీ నోళ్లు కూడా కట్టబడిపోయాయి. అమ్మ, నేనూ, అన్నయ్య కూడా నాన్నగారివైపు చూడ్డం, మాలో మేము ముఖముఖాలు చూసుకోడం ఇలా పది నిమిషాలు గడిచిందేమో అమ్మ నాన్నగారితో చెపుతుందేమోనని నేను, అన్నయ్య చూస్తున్నాం. ఇంతట్లో నాన్నగారే నిశ్శబ్దాన్ని భేదించారు.

"ఇంత నిశ్శబ్దంగా ఉన్నారేమర్రా" అన్నారు. ఆయన మాట్లాడిన మాట సామాన్యంగానే ఉన్నా మా చెవులకు పిడుగులా తగిలింది. ఉలిక్కిపడి మళ్ళీ ముగ్గురం ఒకరిముఖా లొకరు చూసుకున్నాం. నాన్నగారికి కోప్పడే స్వభావం లేకపోయినా ఆయన్ను చూస్తే మాకందరికీ భయమే; భయమని చనువు లేకపోలేదు. ఇంట్లో ఏదైనా ఇల్లాంటి పొరపాటు జరిగితే నాన్నగారికి తెలుస్తుందేమో నని ఎందుకో భయపడతాం ఆయనయందుండే గౌరవంచేతేమో. తీరా జేస్తే అన్నీ ఆయనకు తెలియనూ తెలుస్తాయి. ఆయన మాత్రం ఎన్నడూ దేనికీ కోప్పడలేదు.

అమ్మే నాన్నగారితో ధైర్యం చేసి చెప్పడాని కుపక్రమించింది, నసుగుతూ, నసుగుతూ. "సాయింత్రం మీ చెల్లెలు వచ్చింది. సుబ్బన్నను కాఫీ తీసుకురావడానికని బజారుకు పంపాము. ఆరు గంటల కెళ్లినవాడు ఇంతవరకూ రాలేదు. సైకిలిచ్చి రామాన్ని అలా బజార్లోకి పంపుదామా చూసొస్తాడు?" అంది.

"భోజనాలయ్యాక వెడతాడులే" అని ఊరుకున్నారు. ఆదుర్దాగాని ఆశ్చర్యంగాని కొంచెం కూడా ఆయనలో కనపడలేదు. నాన్నగారు అన్నం వడ్డించమన్నారు. అమ్మ తొందరగా వెళ్లి వడ్డించింది. భోజనాలవుతున్నాయి. ఎవరూ ఏమీ మాట్లాడ్డం లేదు. నాన్నగారేదైనా ఆలోచిస్తున్నారేమో.

అమ్మ మెల్లిగా అంది "రెండేళ్లనించి వున్నాడు. మనిషి కొంచెం కూడా అనుమానించడానికి వీల్లేకుండా మసిలాడు" అంది.

"ఔను" అన్నారు నాన్నగారు.

"అప్రయత్నంగా ఏకారు క్రిందైనా పడ్డాడేమో నాన్నగారూ" అన్నాను.

"సరే ఏమైతే ఏం తెలుసుకుందాం" అన్నారు నాన్న.

ఇంతలో వీధి తలుపు కొట్టిన చప్పుడైంది.

"ఎవరు వారు" అంది అమ్మ.

"నే నండమ్మా" అన్నాడు సుబ్బన్న.

"ఆమాట వినగానే మా అందరి మొహాలు కటిక చీకట్లో విద్యుద్దీపాలేసినట్టు మెరిశాయి. అది సుబ్బన్నగొంతే.

అమ్మ తలుపు తియ్యడానికి వెడుతూ "ఏమిరా సుబ్బన్నా అల్లాగే వెళ్ళిపోయావ్రా, తొమ్మిది దాటిపోయిందే" అంటూ తలుపు తీసింది. వాణ్ణి వెనక నిలబెట్టి ముందు నిలబడ్డారు కాబోలు పోలీసువాళ్లు. వాళ్లని చూడగానే అమ్మమాట ఆగిపోయింది.

కొంచెం ఆగి "ఎవరి కోసం" అని మాత్రం అంది అమ్మ.

నమస్కారం చెప్పి "లక్ష్మీనారాణగారిల్లిదేనా" అన్నారు పోలీసులు.

"ఔను" అంది అమ్మ.

"మీకు సుబ్బన్న అనే నౌకరున్నాడాండి" అని ఒక పోలీసన్నాడు.

"ఆ ఉన్నాడు" అంది అమ్మ.

"అతన్ని ఎక్కడికైనా పంపించారాండి" అన్నాడు మరొక పోలీసు.

"ఔను" అంది అమ్మ.

"దేనికండి" అన్నాడు.

ఈ ప్రశ్నలు చూస్తే అమ్మకి భయం వేసింది. ఇంతలో నాన్నగారు వంటింట్లోంచి "ఎవరు వారు" అన్నారు.

"పోలీసు" లంది అమ్మ.

"మగవారున్నారాండి" అన్నాడు ఒకపోలీసు: "ఆ" అంటూ అమ్మ లోపలికి వచ్చేసింది.

"నాన్నగారు చెయ్యి కడుక్కొని వీధి గుమ్మం దగ్గర కొచ్చారు. నాన్నని చూసి "నమస్కారమండయ్యా" అన్నారు పోలీసులు.

"ఏం పనిమీద వచ్చారయ్యా" అన్నారు నాన్న.

ఈ సుబ్బన్న అనే అతడు తమ నౌకరని చెప్పాడండి, ఔనో కాదో కనుక్కొని ఇన్స్పెక్టరుగారు వప్పగించి రమ్మన్నారండి"

"ఏం ఏదైనాతప్పు చేశాడా" అన్నారు నాన్న.

"లేదండి ఇతనివద్ద ఒక వెండి మరచెంబు పదిరూపాయల నోటు ఉన్నాయండి" అన్నారు.

"ఔను ఇంట్లో వాళ్లు కాఫీ తెమ్మని ఇచ్చి పంపించారట"

"చిత్తం వెళ్లొస్తామండి" అన్నారు పోలీసులు.

"ఏం వీణ్ణి స్టేషనుకు పట్టుకుపోయారేమిటీ" అన్నారు నాన్న.

"చిత్తం చిత్తం" అంటూనే సిగ్గుపడి వాళ్లే ఏదో తప్పుచేసిన వాళ్లలా ఇంకేదైనా అడిగితే ఏం జవాబియ్యాలిసి వస్తుందో అన్నట్టు మళ్ళీ నమస్కారంచేసి క్షణం ఆగకుండా వెళ్లిపోయారు.

"ఏమిరా సుబ్బన్నా లోపలకిరా" అన్నారు నాన్నగారు.

సుబ్బన్న లోపలికొచ్చి మరచెంబక్కడ పెట్టాడు. ఇంతలో అమ్మ ఇవతలి కొచ్చింది. పది రూపాయల నోటు అమ్మ చేతి కందించాడు.

నాన్నగారు పడ కుర్చీలో కూర్చుని "ఏమిరా ఏమయిందేమిటి" అన్నారు.

"ఏమీ లేదండి బాబయ్యా!" అని పైబట్టతో కళ్లు తుడుచుకొన్నాడు. మరి నోట మాట రాలేదు.

"ఏమిటైందిరా" అంది అమ్మ.

కొంచెం తమాయించుకుని చెప్పడం మొదలు పెట్టాడు. నేను, అన్నయ్య అమ్మ, నాన్నగారు కూడా, శ్రద్ధగా వింటున్నాం.

"మనవీధి మలుపు తిరిగానండి. ఎవరో దొంగ దొంగన్నారండి. ఎటాని సూశానండి. ఎవరూ కనబళ్లేదండి. మళ్లీ అన్నిపక్కల నించీ 'దొంగ' 'దొంగ' అని కేకలు వినబడ్డాయండి. ఎనకాలోళ్లు ముందుకు సూపిత్తూ వస్తున్నారండి. సందచీకటి కదండీ, నాముందే పరుగెత్తాడు కాబోలని సూద్దామని ముందుకు పరుగెత్తానండి. నాయెనకాలొచ్చే పదిపాతికమందీ నా సుట్టూ మూగారండి, 'ఎక్కడికిపోతావు దొంగ...' అని ఒకడు గట్టిగా నన్నట్టుకొన్నాడండి. ఇంకోడు చెంబు లాగేశాడండి. ఇంకోడు జేబులు తడివి పదిరూయలు తీసుకొన్నాడండి. అక్కణ్ణుంచి బాదేశారండి. నేను చెప్పేది వినిపించుకున్నవాళ్లే లేరండి 'బాబో నేను దొంగనికాను; మాఅమ్మగారు కాఫీ తెమ్మంటే ఎల్తున్నా' నన్నానండి. దొంగవు

(54-వ పేజీ చూడండి)

★ ముచ్చటగా ముగ్గురు ★

(35-పేజీ తరువాయి)

సామాను సర్దటం నాకు తెలిసినంత బాగా బ్రతికివున్న వాడికెవ్వడికీ తెలియదని నాలోనాకే అదొకరకమైన అహంభావం. ఈవిషయమై హారిస్సుకీ, జార్జికీ చెప్పి, సామాను సర్దే భారమంతటినీ నా భుజస్కంధాల మీద వదిలెయ్యమన్నాను. దానికి వాళ్లు అంతచప్పున ఒప్పేసుకొన్నందుకు మాత్రం నాకు చాలా చిరాకు వేసింది. జార్జిగాడు వాలు కుర్చీలో కాళ్లు బారజాపి పడుకొని, దర్జాగా పైపు కాల్చటం మొదలుపెట్టాచు. హారిస్సుగాడు అంతకంటేను! పెద్ద విగ్రహంలా టేబుల్‌మీద ఎక్కికూర్చొని చుట్టకాల్చటం ఆరంభించాడు.

వాళ్లిద్దరూ యింత అసహ్యంగా ప్రవర్తిస్తారని నేను కలలోకూడా అనుకోలేదు. సామానులు సర్దే పనినేను చేస్తానన్నానంటే, ఆపని అంతా నేను ఒక్కణ్ణే చేస్తానని కాదు; వాళ్ళిద్దరిచేతా చెప్పి చేయిస్తానని! వాళ్లు అల్లా అర్థం చేసుకోకుండా, పని అంతా నా ఒక్కడిమీదే వదిలేసి హాయిగా కాళ్లు బారజాపుకు కూర్చున్నారు. నాకు వొళ్లుమండిందంటే-మండదూ మరి? అసలు నేను కష్టపడి పనిచేస్తూవుండగా, ఎవ్వళ్లైనా వూరికే కళ్లు అప్పగించి చూస్తూ కూర్చున్నారంటే, నాకు అరికాలిమంట నెత్తికెక్కుతుంది.

ఇంతకుముందు నేనొక పెద్దమనిషితో కలిసి ఒక కొంపలో వుండటం తటస్థించింది. ఆయన గంటల తరబడి అల్లా కూర్చొని అంతపనీ నాచేతనే చేయించేవాడు. నేను ఆగదిలో అటునుంచీ యిటు, యిటునుంచి అటు తిరుగుతూవుంటే, చూపులతోనే నన్ను వదిలిపెట్టకుండా అనుసరిస్తుండేవాడు. ఇల్లాగా యితరులు పనిచేస్తూవుండగా కళ్లు అప్పగించి చూస్తూవుంటే, తనకి జీవితంపై మమకారం ఎక్కువౌతుందనేవాడు. ఎవరో ఒకరు తన కళ్ల ఎదుట కష్టపడుతూ వున్నంతసేపూ, తనకి జీవితం అంటే, ఆవలిస్తూ కూర్చోవటంకాదనీ, శ్రమకోర్చి పనిచేయుటంలోనే జీవితంలో రంజు వుంటుందనీ అనిపిస్తుందట. అంతటి మహత్తర సత్యాన్ని తనచేత గుర్తింపచేసినందుకు నన్ను పొగుడుతూ వుండేవాడు.

కానీ నేనుమాత్రం బొత్తిగా ఆయనలాంటి సోమరిని కాననుకోండి. మరొకాడు వొళ్లువొంచి పనిచేస్తూవుంటే నేను చూస్తూ కూర్చోలేను. లేచి నిలబడి, లాగూ జేబుల్లో చేతులు పెట్టుకొని, అవతలవాళ్లు చేసే పనినంతటినీ పర్యవేక్షిస్తాను. ఏపని ఎల్లా చెయ్యాలో చెప్పి చేయిస్తాను.

అల్లాంటివాణ్ణి, నాచేతనే పిల్లిద్దరూ పనిఅంతా చేయిస్తూ, కాళ్లు బారజాపుకు కూర్చుంటే కూడా, వాళ్లని పైకి గట్టిగా ఏమీ అనలేక సామాను సర్దెయ్యటం ప్రారంభించాను. సామాను సర్దటమనేది ఎప్పుడూ ముందు కనిపించేటంత తేలిక కాదు. అయినా ఎలాగో కిక్కురుమనకుండా, ముందు బస్తా అంతా సామానుతో నింపేసి, దానిమీద ఎక్కికూర్చుని, తాడుతో దాని మూతి బిగించి కట్టేశాను.

సాంతం మూతి బిగించాక "అయితే నీబూట్సు అందులో పడెయ్యవా ఏం?" అన్నాడు హారిస్సు.

నాకు మతిపోయింది. గది అంతా కలయ చూశాను. ఒకమూలగా బూట్సు పడివున్నాయి. నిజంగానే వాటిని బస్తాలోపడెయ్యటం మరచిపోయాను! హారిస్సుమీద వళ్లు మండుకొచ్చింది. బస్తా సాంతం బిగించేదాక గుడ్లు మిటకరించి చూస్తున్నవాడు, ఆబూట్లసంగతి యింకొంచెం ముందుగా చెప్పి ఏడిస్తే వాడిదేం పోయిందీ? పైగా—నేనొక చెంప బిగించిన బస్తా మూతిని వూడదీస్తుంటే—కోతి వెధవలాగా, కొక్కిరాయి వెధవలాగా, పళ్లుఅన్నీ బయట పెట్టి వెకిలినవ్వు నవ్వటం ఆరంభించాడు. అల్లాంటి పరిస్థితుల్లో మీకైనా వొళ్లు మండుకువస్తుందా, రాదా, మీరే చెప్పండి!

అయినా సరే—వచ్చిన కోపాన్ని అంతటినీ దిగమింగుకొని బస్తామూతి విప్పి, బూట్లు అందులో పడేశాను. మళ్ళీ మూతి బిగించపోతూవుండగా నా టూత్ బ్రష్ సంచీలో పడేశానో లేదోనని అను

మానం వేసింది. ఎంత ఆలోచించినా దాన్ని సంచీలో పడేసినట్లు జ్ఞాపకంరాలేదు.

నిజానికి యీ టూత్ బ్రష్ వున్నదే—దీని దుంపతెగ-ప్రతిప్రయాణంలోనూ నాప్రాణాలని ఇలాగే తోడేస్తుంది. ప్రయాణం రేపుఅనగా, యీవేళరాత్రి పొడుగునా యీదిక్కుమాలిన టూత్ బ్రష్‌ని భద్రంగా పెట్టిలో పెట్టినట్లే కలవస్తుంది. తీరా నిద్రలేచేటప్పుడు మాత్రం, దాన్ని అసలు పెట్టిలో పెట్టనేలేదేమో నన్న అనుమానం ఒక్కసారిగా మనస్సులో మెదులు తుంది. కంగారుగా లేచి, పెట్టిలోని వస్తువులన్నీ పైకి తీసి చూస్తే, పెట్టె అట్ట అడుగున ఎక్కడో ఒకమూల కనిపిస్తుంది. 'అమ్మయ్యా' అనుకొని మళ్లా పెట్టిలో వస్తువులన్నీ పెట్టిలోపెట్టి, టూత్ బ్రష్‌కోసం వెతుకొ్కంటే అది యిందాక పెట్టినచోట ఎంత తన్నుకున్నా కనిపించదు. సద్దిన సామానంతా మళ్లా కెలికి కెలికి పైకి తీస్తేకాని అది అవుపించదు. ఈవిధంగా యీ వెధవ టూత్ బ్రష్ యింతమటుకు ఎన్నిసార్లు నాకు జీవితంమీద రోత పుట్టించిందో, లెక్కవేసి చెప్ప లేను.

ఈసారీ అంతే అయింది. బస్తాలో అమర్చిపెట్టిన సామానంతా పైకితీసినా టూత్ బ్రష్ మాత్రం కనిపించలేదు. సృష్టికి పూర్వం యీ అనంతవిశ్వం ఎంత చిందరవందరగా పడివుండేదో, అంత చిందరవందరగానూ మాగదీ తయారైంది. జార్జిదీ, హారిస్సుదీ టూత్ బ్రష్‌లు కనీసం పద్దెనిమిది సార్లేనా నాచేతికి తగిలాయి. నాబ్రష్ మాత్రం ఎంతకీ కనిపించలేదు. చివరికి యిల్లా కాదని, తీరిగ్గా కూర్చొని, ఒకొ్కక్క వస్తువునే పట్టుకొని చెవులదగ్గిర ఆడించి, సంచిలో పడెయ్యటం మొదలు పెట్టాను. ఇలా చెయ్యగా చెయ్యగా చివరికి ఆదిక్కుమాలిన బ్రష్ ఒక బూటులోపలగా దాక్కొని వున్నది. దాన్ని కసిగా బూటులోనుంచి బయటికిలాగి మిగిలిన సామాను అంతా బస్తాలోకి ఎక్కించేశాను.

అప్పటికిగానీ ఆ జార్జిగాడికి నోరు పెగలలేదల్లే వుంది—"సబ్బు పడేశావా?" అని అప్పుడు అడిగాడు.

"వెధవ సబ్బు! ఎక్కడుంటే ఎవడిక్కావాలి!" అని ఆబస్తాని పట్టుకు గట్టిగా కుదించేసి మూతి గట్టిగా బిగించి కట్టాను. ఇంత అలసిపోయి, పైపు కాల్చుకొందామని జేబులు తడుముకొంటే పొగాకుతిత్తి కనిపించలేదు. దానికోసం గదిఅంతా వెదికాను. ఎక్కడా కనపించలేదు. మళ్ళీ బస్తాలోవుండే సామానంతా కింద గుమ్మరించిచూస్తే అందులో దొరికింది. ఈవిధంగా ఆరోజురాత్రి పదిగంటలు దాటేవరకు బస్తా కట్టటం, విప్పటంతోనే సరిపోయింది.

ఇక మేము బయలుదేరటానికి పట్టుమని పన్నెండు గంటలైనా వ్యవధిలేదు కనుక మిగిలిన పని తానూ, జార్జీ కలిసి చేసేస్తామని హారిస్సు అన్నాడు. బ్రతుకుజీవుడా అని యివతలికి వచ్చేశాను.

వాళ్లిద్దరి సర్దుడూ ముందు సరదాగానే ఆరంభమైంది. సామాను సర్దటం ఎల్లాగో నాకు చేసి చూపెట్టాలని పట్టుదలగా వున్నట్లు అవుపించారు. నేను మాత్రం వాళ్లు చేస్తున్న పనినిగురించి ఒక్కమాటఅయినా అనకుండా గుడ్లు అప్పగించి చూస్తూ వూరుకొన్నాను. చూడగా, చూడగా నాకు ఒకటి అనిపించింది. ఈజార్జిగాడు ఏనాటికైనా చచ్చిపోతే, వాడితరువాత అంత చచ్చుగా సామాను సర్దేవాడు యీభూమిమీద హారిస్సు ఒక్కడే మిగులుతాడు కదా అని నాకు నిజంగా దిగులువేసింది. అప్పటి కప్పుడే వాళ్లచుట్టూ కప్పులూ, సాసర్లూ అంట గిన్నెలూ వంటగిన్నెలూ పెద్ద కొండల్లా పోగుపడి వున్నాయి. ఇక త్వరలోనే అసలు నాటకం ఆరంభమౌతుందని ఎదురుచూస్తూ కూర్చొన్నాను.

కప్పునొకదాన్ని బద్దలు గొట్టడంతో నాటకం ఆరంభమైంది. వాళ్లుచేసిన మొట్టమొదటి పని అదే. అదైనా కేవలమూ, తాము ఎంతటి ఘనకార్యాలు చెయ్యగలరో యితరులకి చూపించి వారి దృష్టిని ఆకర్షించటం కోసమే, చేశారు.

తదనంతరం హారిస్సు, సంచిలో అడుగున టొమేటో పళ్లుపోసి వాటిమీద పెద్ద డబ్బాఒకటి పడేశాడు. దాంతో టొమేటోపళ్ళన్నీ చితికి సంచి అంతా ఖరాబు అయింది.

వాడి తరువాత జార్జి, తన ప్రతాపం చూపెట్టబోయి, వెన్నమీద కాలువేశాడు. అదంతా చూస్తూ కూడా నేనేమీ మాట్లాడకుండా అవతలికి వెళ్లి టేబుల్ మీద కూర్చున్నాను. అవతలవాళ్లు అంత కంగారుపడుతున్నా, నేనేమీ మాట్లాడకుండా వుండటం వాళ్లని మరీ వుడికించి వుంటుంది. ఆవిషయం

ముచ్చటగా ముగ్గురు

గమనించాను. ఆ వుడుకుమోతుతనంలో వాళ్లు యిల్లంతా కోతిగంతులు వేసి, పిల్లైనన్ని వస్తువులు పగలగొట్టారు. ఏది చేతికందితే దాన్ని, వెనక వైపుకి నెట్టేసి, ఆతరువాత కాస్సేపటికి ఆవస్తువే కనిపించలేదని చిరాకుపడ్డారు. ఈ కంగారులో ఎప్పుడో వుప్పాపొట్లం చిరిగిపోయింది. వుప్పురాళ్ళ క్రింద సామాను అంతా కప్పడిపోయింది.

పది పలాల వెన్నతో వాళ్లు చేసినంత అల్లరి, ప్రపంచంలో మరెవ్వరూ చేసివుండరు. ముందుగా జార్జిగాడు వెన్నమీద అడుగేశాడు. జోడుకి అంటుకొన్న వెన్న నంతటినీ గీకి, కెటిల్‌లో పెట్టబోయాడు. ఆ కెటిల్ మూతి సన్నదైపోయి, లోపలి వెన్న బయటికి తీయటానికిగానీ, బయటి వెన్న లోపలికి పంపించటానికిగానీ, వీలులేకుండాపోయింది. చివరికి యిల్లాకాదని చేతికొచ్చిన వెన్న నంతటినీ తీసి అక్కడ ఒక కుర్చీ వుంటే దానిమీద పడేశాడు. ఆమాట మరచిపోయి హారిస్సుగాడు ఆకుర్చీమీదే కూలబడ్డాడు. వెన్న అంతా వాడి పాంట్ వెనుకభాగానికి అంటుకుపోయింది. ఆమాత్రం జ్ఞాపకం పెట్టుకోలేని ఆయిద్దరు చవటలూ, వెన్నకోసం యిల్లంతా గాలించడం మొదలుపెట్టారు.

ఖాళీగావున్న కుర్చీకేసి చూస్తూ, "ఇందాక నేనిమీద పెట్టినట్లే జ్ఞాపకంరా!" అన్నాడు జార్జి, బుర్ర గోక్కొంటూ.

"నువ్వు కుర్చీమీద వెన్నముద్దలు పడేస్తుండగా నేను చూసినట్టే వున్నానురా!" అన్నాడు హారిస్సు.

ఇటునుంచీ వాడు, అటునుంచీ వీడు, యిద్దరూ చెరొక వైపుగానూ బయలుదేరి గదిఅంతా మళ్ళీ గాలించటం మొదలుపెట్టారు. అల్లా అల్లీబిల్లీ తిరుగుతూ "ఇక్కడ పెట్టిన వెన్న యింతలో ఏమైపోయినట్లు? అంతా మాయగా వుందే!" అంటూ జార్జి విస్తుపోవటం మొదలు పెట్టాడు.

"అవునురా! ఇంత విడ్డూరం ఎక్కడా చూడలేదు!" అంటూ హారిస్సు వంత పాడాడు.

ఇంతలో ఎందుకో జార్జిగాడు హారిస్సు వెనక్కి వెళ్లాడు. వాడి పాంట్ వెనకభాగాన వెన్నముద్దలు వెక్కిరిస్తున్నట్లు వీడికంటికి కనిపించాయి.

"హారిసీ! ఇక్కడ వుందిరా వెన్న!" అని అరిచేశాడు జార్జి.



"ఏదీ? ఎక్కడ?" అంటూ హారిస్సు తనచుట్టూ తాను తిరగటం మొదలు పెట్టాడు.

"కదలకుండా నిల్చోరా గాడిదా!" అంటూ జార్జి వాడిమీద విరుచుకుపడ్డాడు.

మొత్తం మీద చివరికెప్పటికో హారిస్సుగాడి పాంట్‌కి అంటుకుపోయిన వెన్న నంతటినీ జార్జి చాకుతో గీకి టీపాట్‌లోకి ఎక్కించాడు.

వీళ్ల యీసందడికితోడు మా మాంట్ మొరన్సీ కూడా చేతనైనంత అల్లరిచేసిపెట్టింది. ఈభూమిమీద జన్మమెత్తినందుకు ఎన్ని వందలసార్లు యితరుల కాళ్లకి అడ్డంతగిలి తిట్టించుకొంటే, అంత మంచిదనేది యీ కుక్కకి పుట్టుకతోనే వచ్చిన విశ్వాసం. ఏ ఏ సందర్భాలలో ఏఏ ప్రదేశాలలో తాను వుండటం ఎవరికీ యిష్టం వుండదో, సరిగ్గా అల్లాంటి సమయాల్లోనే యీకుక్క అక్కడ ప్రత్యక్షమౌతుంది. ఇలాంటి వెధవ పనులన్నీ చేసి, చావుదెబ్బలు తిన్నరోజుని దానికి ఎంతో హాయిగా వుంటుందల్లేవుంది.

అలాంటి మనస్తత్వం గలది కనుకనే మా మాంట్ మొరెన్సీ, పెద్ద పనివున్నట్లు వచ్చి, మేము

సర్దుతున్న సామానుమీద చక్కగా పడుకోవటం మొదలు పెట్టింది. ఎప్పటి కప్పుడు మాకు ఏసామాను కావలసి వస్తుందో అదంతా ముందుగానే గ్రహించి సరిగ్గాఆవస్తువుమీదనే యిది పడుకొనేది. అవతల సామానుసర్దుకొనే వాళ్లపనికి అడ్డం రావటమేకాక, ఏదో ఒకసామానుకోసం ఆజార్జో,హారిస్సో చెయ్యిజాపి నప్పుడల్లా, వాళ్లకు కావలసింది తనముట్టేననే భ్రమతో తన తలను తీసుకొనిపోయి వాళ్ళ చేతుల్లో పెట్టేది. లేకపోతే అక్కడవున్న బెల్లపు పాకాన్ని కాలితో కలికేది. అదీ గాకపోతే—మేము తెచ్చుకొన్న నిమ్మకాయలు దానికంటికి ఎలుకపిల్లలా కనిపించాయో ఏమో, వాటిని వెంటబడి తరిమేది. ఇదిచేసే హంగామా చూసి నిజంగానే ఎలిక కాబోలు ననుకొని ఆహారిస్సు ఒక నిమ్మపండుని అట్లకాడతో చితకబాడిచాడు. తీరా చూసేసరికి తాను చంపింది ఎలిక కాదని తేలింది. నామీద విరుచుకుపడ్డాడు—ఆకుక్కని నేనే వుసికొల్పానని. నేనలాంటి పని ఏదీ చెయ్యలేదని ప్రమాణపూర్తిగా చెప్పుకున్నాను. ఎవ్వరూ వుసిగొల్ప నక్కరలేకుండానే యిలాంటి వెధవ బుద్ధులు బోలెడు పుట్టుకొస్తాయి, మా మాంట్ మొరన్సీకి. ఆమాదిరి వెకిలి లక్షణం దానికి పుట్టుకతోనే వచ్చిందని చెప్పానుగా!

సామాను సర్దటం రాత్రి 12 - 50 కి పూర్తి అయింది. హారిస్సుకి ఓపిక పొంతం చచ్చిపోయింది. బస్తామీద కూలబడిపోయి, అందులోవుండే సామాను ఏదీ బద్దలు కాకుండా వుండాలని కోరుకొన్నాడు. రెండో బస్తామీద అంతకుముందు ఎప్పటినుంచో కూలబడివున్న జార్జి, బస్తాలో సామాను బద్దలైనా ఫరవాలేదు లెమ్మన్నాడు.

అందరమూ అలసిపోయాము. హారిస్సునికూడా ఆరాత్రికి యిక్కడే పడుకోమన్నాం. ముగ్గురమూ కలిసి మేడమీద గదిలోకి వెళ్లాం.

హారిస్సూ, నేనూ ఒక మంచంమీద, జార్జి ఒక్కడూ ఒకమంచంమీద పడుకోవాలని నిశ్చయించుకొన్నాం.

"మీ యిద్దరికీ ఎన్నిగంటలకు లేప



భర్త: (భార్యను నిద్రలేపి) నువ్వేమీ అనుకోకుండావుంటానంటే ఒకమాట చెప్పతాను.

భార్య: అబ్బబ్బ! ఏమిటదీ?

భర్త: అహా! మరేమీ లేదు... మన యింటికి నిప్పంటుకొంది.

మంటారురా ?" అని జార్జి అడిగాడు.

ఏడింటికి లేపమని హారిస్సు అన్నాడు.

వీల్లేదు—ఆరింటికే లేపమని నేను అన్నాను. దానిమీద నేనూ, హారిస్సూ వీలైనంత సేపు వాదించుకొన్నాం. చివరికి ఆరున్నరకి లేపితే చాలునని యిద్దరమూ రాజీపడి, వాడికామాట చెప్పాదామని జార్జికేసి తిరిగాం. వాడప్పటికే నిద్రపోయాడు. వీడి తిక్క వదిలించటం యిల్లాకాదని, అక్కడ నీళ్లతొట్టి ఒకటి వుంటే, దాన్ని యిద్దరమూ కలిసి యీడ్చుకొచ్చి, వాడి మంచంకింద పెట్టాం. ప్రొద్దున నిద్రలేవగానే వాడు కాలు ఎక్కడ పెడతాడో సరిగ్గా అక్కడే ఆనీళ్ల తొట్టిని అమర్చిపెట్టి, మేమిద్దరమూ ముసుగులు తన్ని నిద్రకు పడ్డాం.

ఒక అపూర్వ చిత్రం


"బైసికిల్ తీవ్స్" సమీక్ష—రచన: ఎన్నార్

ఈ నెల 6 వ తేదీన మద్రాసు కాసినో థియేటర్లో ఒక అపూర్వ చిత్రం విడుదలైంది. ఈ చిత్రం ఇటాలియన్ దర్శకుడు విట్టోరియా డీసికా తయారుచేసిన "బైసికిల్ తీవ్స్." (సైకిలు దొంగలు) 1952 జనవరిలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవం సందర్భంలో ఈచిత్రంచూసే అవకాశం మద్రాసువాసులకు కలిగింది. ఈ ఏడాది ఇది ఆంధ్రదేశంలోకూడా కొన్ని చోట్ల ప్రదర్శింపబడింది. మద్రాసులో రెగ్యులర్ గా ప్రదర్శింపబడటానికిదే మొదటిసారి. మద్రాసులో ఇంత పెద్ద 'క్యూ'లు ఈమధ్య ఏచిత్రానికీ చూడలేదు. ప్రేక్షకులు చివరివరకూ ఎక్కడా విసుగు ప్రకటించలేదు సరిగదా, ఒక అపూర్వానుభూతి పొందుతున్నట్లు నిశ్శబ్దంగా చూసి ఆనందించారు.

"బైసికిల్ తీవ్స్" ఘనతను గూర్చి కొత్తగా ఉద్ఘాటించవలసిన అవసరంలేదు. ప్రపంచమంతటా ప్రదర్శించబడి అనేక లక్షలమంది ప్రజల ప్రశంసలను మారగొన్నది. అనేకులు విమర్శకులు దీనిపై పేజీలకొలది విమర్శలు ప్రకటించారు; అనేక చలన చిత్రోత్సవాల్లో బహుమతులు పొందింది. అయినా ఈ చిత్రంగూర్చి తెలుగుపాఠకులకు రెండుముక్కలు చెప్పవలసిన అవసరం ఉన్నది. ఎందుకంటే తెలుగు కేంద్రాల్లో పలువురు ప్రేక్షకులు ఈచిత్రంగూర్చి మూకీ భావం వహించటమో, నిరసన ప్రకటించటమో జరిగినట్లు తెలుస్తున్నది. కొన్ని మంచి చిత్రాలను ఎవరూ సమర్థించ నవసరంలేదు. వాటంతట అవే ప్రేక్షకులను లోబరచుకుంటాయి. కొన్ని మంచిచిత్రాలను పనిగట్టుకుని ఎవరన్నా సమర్థించవలసి వుంటుంది. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను ఆకర్షించలేకపోయిందంటే కారణంఎక్కడవున్నదో వెదకవలసివున్నది. ఇటువంటి చిత్రాలు

ఇటాలియన్ చిత్రం "బైసికిల్ తీవ్స్"లో కార్మికుని కొడుకు.





విదబ్రాహ్మడు బూరెలకు కావలసిన సామగ్రి అంతా తెచ్చి పెళ్లాం చేతులో పెడుతున్నాడు.

ప్రకాష్‌వారి బాలచిత్రం "బూరెలమూకుడు"లో శ్యామల, మోహన్.

మన ప్రేక్షకులకు అక్కర్లేదనీ, వారికి ఎంత తక్కువరకం చిత్రాలు చూపిస్తే అంత ఉత్సాహంగా వచ్చి చూస్తారనీ ఒక దురూహ ఇటీవల ప్రచారమవుతోంది.

అర్థంలేని నాలుగు డాన్సులూ, నాలుగు పాటలూ, మంచి సెట్టింగులూ ఉంటే ప్రేక్షకులు మూగుతారని ఒక వాదం ఉన్నది. ఒక బొంబాయి ఆంగ్ల సినిమా పత్రిక ఈమధ్య ఈ అపవాదాన్నే బలపరచింది. వాస్తవికత, లక్ష్యశుద్ధి, కళా విశిష్టత ఉన్న చిత్రాలు మన ప్రజలకక్కర్లేదనీ, దైనికకష్టాలు మరిచిపోయి కాసేపు ఏ గంధర్వలోకంలోకో లాక్కుపోయి వినోదింపజేస్తే వారికింకేమీ అక్కర్లేదనీ అభిప్రాయం వచ్చేట్లు ఆ పత్రిక ప్రచారం చేస్తోంది. ఈప్రచారంలో సత్యంఉన్నదా, లేక సినిమా పెట్టుబడిదారుల అభిరుచులను సమర్థించటానికే ఇలా వ్రాస్తోందా అని నిష్పాక్షికంగా పరిశీలించవలసివున్నది.


"బైసికిల్ థీవ్స్" కథలోఉన్న విశేషమేమంటే దానిలోని సారాంశాన్ని ఒక్క ముక్కలో చెప్పవచ్చు. మన చిత్రాల్లో కథకి సారాంశం అంటూ ఉండనేఉండదు; ఎవరన్నా అడిగితే కథ యావత్తూ అన్ని సంఘటనలతో సహా ఏకరువు పెట్టాలి. అంతా చెప్పినా ఆకథ అర్థంకాదు. ఇది మంచికథ లక్షణంకాదు. కథకు ఒకే ఒక పరమ ప్రయోజనం ఉండాలి. ఏదో ఒక జీవితసత్యాన్ని నిరూపించటంకోసమే కథ అల్లబడాలి. ఉట్టినే పది సంఘటనలతో, పదిపాత్రలతో అతుకుల బొంతలాగ కథ అల్లితే ఆ కథవిని మరిచిపోదగిన దవుతుంది గాని మనపై గాఢముద్ర వెయ్యజాలదు.

ఈ చిత్రంలో సారాంశం ఏమిటయ్యా అని అడిగితే, ఇటలీలో రెండో ప్రపంచ యుద్ధం తరవాత ప్రబలిన నిరుద్యోగ సమస్య; ప్రజా జీవితాల్లో అది కలిగిస్తున్న సంక్షోభం, అని చెప్పాలి. ఈవిధంగా మన చిత్రాలకు మాత్రం ఒక్క ముక్కలో సారాంశం చెప్పలేమా అని అడగవచ్చు. "కన్నతల్లి" చిత్రంలో తల్లి తన బిడ్డల కోసం ప్రాణాలనైనా బలియిస్తుందనేది సారాంశం. "పెళ్ళిచేసిచూడు"లో కట్నాల దురాచారంవల్ల నేటి యువతీ యువకులు పడే అగచాట్లు సారాంశం. "తీన్ బత్తీ చార్ రస్తా"లో వివిధ భాషల జనుల మధ్య ఐకమత్యం పెంపొందాలనేది సారాంశం. ఈవిధంగా చాల చిత్రాలకి సారాంశం ఫలానా అని ఊహించి చెప్పవచ్చు. అయితే మన చిత్రాలతో వచ్చిన చిక్కేమిటంటే వాటిలో ఒక సారాంశం కాదు, అనేక సారాంశా లుంటాయి. మన ప్రతి చిత్రమూ అనేక కథల సమ్మేళనం. ఒక సారాంశాన్ని కేంద్రంగా పెట్టుకుని దానిచుట్టూ కథ అల్లకుండా అనేక కేంద్రాలు పెట్టుకుని కథ తయారుచేస్తారు. ఇందువల్ల కథకుడు చెప్పదలచిన ప్రధాన సారాంశం బలహీనమై నిష్ప్రయోజనమవుతుంది.



బూరెల మూకుడు తిరిగి తీసుకురాలేదేమా అని పక్కింటావిడ అడగటానికి వస్తే మూగనోముపట్టి కూర్చుంది ఆ గృహిణి.

"బూరెలమూకుడు"లో శ్యామల, కల్పకం.



చిన్న కొడుకుకోసం గాలిస్తూ, చెట్టుదగ్గర సేదదీర్చుకుంటున్నది మంగమ్మ.

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్సువారి "పెంపుడు కొడుకు"లో మోహన్—పుష్పవల్లి.

* "బైసికిల్ థీవ్స్" సమీక్ష *

"బైసికల్ థీవ్స్"లో ఈ లోపం కనిపించదు. ఈ కథకు ఒకే ప్రధాన సమస్య—నిరుద్యోగ సమస్య—ఉన్నది. ఈ సమస్యకు సంబంధించని సంఘటన ఒక్కటి కూడా ఈ చిత్రంలో లేదు. ఒకటే ప్రధాన పాత్ర—నిరుద్యోగి కార్మికుడు. అతని సమస్యకు సంబంధించని పాత్ర గాని, అతని పాత్రపోషణకు సంబంధించని పాత్ర గాని వెతికిచూసినా ఈ చిత్రంలో కనిపించదు. దృఢంగా, గాఢంగా అత డొక్కడే మన ముందు కనిపిస్తాడు. ఏడుస్తాడు, నవ్వుతాడు, నేరం చేస్తాడు, అవమానింపబడతాడు. ఇన్ని విభిన్నావస్థలలోనూ వాటా పంచుకుని, మనం కూడా అతనితోపాటు ఏడుస్తాము, నవ్వుతాము, నేరం చేస్తాము, అవమానం పొందుతాము.

మన చిత్రాల్లో అలా కాదు. అనేక ప్రధాన పాత్ర లుంటాయి. అంజలీదేవి నటిస్తే ఆమె కొక అయిదు వేల అడుగులు, సావిత్రి నటిస్తే ఆమె కొక అయిదువేల అడుగులు, నాగేశ్వరరావుకోసం మరొక అయిదువేల అడుగులు, రేలంగిగారి హాస్యం కోసం మూడు వేల అడుగులు, ఇంకొ పాటలు వగైరాలకోసం మూడువేల అడుగులు—ఇలాగ 20 వేల అడుగుల చిత్రం తయారవుతుంది. ఇందరు నటీ నటులూ కలిసి ఏ జీవిత సత్యమూ నిరూపించరు, సెల్యులాయిడ్ దండగ చెయ్యటం తప్పితే. (ఈ తప్పు నటీనటులది కాదు, నిర్మాతదే.) ఈ ఏడాది ఆరంభంలో విడుదలైన "పరదేశి" చూడండి. అంజలీదేవి, నాగేశ్వరరావుల గాథ కొంత, రేలంగి హాస్యగాధ కొంత. దానికీ దీనికీ ఎంత రిసెర్చి చేసినా సంబంధం కనిపించదు. ఇంత అన్యాయంగా కాకపోయినా ప్రతి తెలుగు, తమిళ చిత్రంలోనూ ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుంది.

"బైసికిల్ థీవ్స్"లో ప్రధానపాత్ర ఒక నిరుద్యోగి కార్మికుడు. అతడు ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకోగా, అధికారులు అతనికి సైకిలున్నట్లయితే గోడలకి సినిమా పోస్టర్లు అతికించే ఉద్యోగం ఇస్తామంటారు. అతనికొక సైకిలున్నది. కాని అది తాకట్టులో ఉంది. అతని భార్య అవీ ఇవీ తెగనమ్మి తెచ్చిన డబ్బుతో తాకట్టు విడిపించి, సైకిలు తెచ్చుకుని ఉద్యోగం ప్రారంభిస్తాడు. ఆ రోజున అతడు పనిలో ఉండగా సైకిలు నెవరో దొంగిలిస్తారు. అతడు దొంగను వెంటాడుతాడు కాని దొంగ దొరకడు. కార్మికుని ఉద్యోగం పోతుంది. సైకిలు కోసం అన్వేషణ ప్రారంభిస్తాడు. దొంగని పట్టుకుంటాడు కూడాను. కాని అతడే దొంగ అని సాక్ష్యం లేకపోవటంవల్ల తన అభియోగం

నిరూపించుకోలేక పోతాడు. ఏం చెయ్యటానికీ తోచదు. సైకిలు లేకుండా ఇంటికి పోయి ఏం చేస్తాడు? చివరికి ఎదురుగా ఎవరిదో ఒక సైకిలు కనిపిస్తుంది. ఏదైతే అదవుతుందని, ఆ సైకిలు ఎక్కి ఉడాయిస్తాడు. కాని నలుగురూ అతన్ని పట్టుకుంటారు. ఎడాపెడా వాయించి, పోలీసు స్టేషనుకు పదమంటారు. కాని సైకిలు యజమాని కార్మికుడిపక్కన ఏడుస్తున్న కొడుకును చూసి, దయతలచి అతన్ని వదిలిపెట్టేస్తాడు. అందరూ కార్మికుణ్ణి బాగా చివాట్లు పెట్టి, ఇంకెప్పుడూ ఇలాంటిపని చెయ్యవద్దని నీతిబోధ చేసి పొమ్మంటారు. అతడు కథ ప్రారంభంలో ఏ స్థితిలో ఉన్నాడో చివరికి కూడా ఆ స్థితికే వస్తాడు. సినిమా పూర్తవటం అయితే అయింది కాని, అతని కథ అక్కడితో అంతం కాదు. సినిమాహాలు బయటికి వచ్చాకకూడా అతని కథ మన మనస్సుల్లో కొనసాగుతూనే వుంటుంది. రోడ్డుమీద నడుస్తుంటే పేవ్ మెంట్ మీద జీవించే అభాగ్యుల జీవితాల్లోనో, ఇంటికి వస్తే ఉద్యోగంకోసం తిరిగి తిరిగి వచ్చిన మన తమ్ముడి జీవితంలోనో, మనం ఎరిగిన అనేకమంది మిత్రుల జీవితాల్లోనో ఆ దురదృష్టవంతుడి కథ కొనసాగుతూనే వుంటుంది. జీవితానికి ఎలాగయితే ఆద్యంతాలు లేవో, నీలో కాకపోతే నాలో, నాలో కాకపోతే మరొకడిలో జీవితం ఎలాగయితే అవిచ్ఛిన్న స్రవంతిలాగ ప్రవహిస్తూ వుంటుందో అలాగే ఆ కార్మికుడి కథ కూడా మన నిత్య జీవితానుభవాలలోకి చొచ్చుకుని ప్రవహించి మళ్ళీ మళ్ళీ మన్ని కలవర పెడుతుంది.

ఈ చిత్రంలో కార్మికుడు కాక మరి రెండు పెద్దపాత్రలున్నాయి—కార్మికుడి భార్య, కొడుకూ. అయితే ఈ రెండు పాత్రలూ, ఇంకా మనకి కనిపించే అనేక చిల్లర పాత్రలూ కార్మికుడిపైన ఆధారపడి ఉన్నవే. కార్మికుడు లేకపోతే ఏ ఇతర పాత్రకూ స్థానం లేదు. "ఇన్స్పెక్టర్" చిత్రంలో అంజలీదేవి, బాలచందర్లు లేకపోయినా పి. కె. సరస్వతి, షణ్ముగాల కథ జరుగుతుంది. అలాగే ఈ రెండో జంట లేకపోయినా మొదటి జంట కథ జరగడానికి ఆటంకం లేదు. "బైసికిల్ థీవ్స్"లో కార్మికుడుంటేనే మిగతా పాత్రలకు అస్తిత్వం ఉంటుంది. ఆ కథ యథార్థ ప్రపంచంలో జరగదగిన కథ; యథార్థ ప్రపంచంలో ఆ ఒక్క కార్మికుడే కాక అతని జీవిత స్రవంతికి అడ్డుపడేవారో, తోడ్పడేవారో, లేక ఊరికే సాక్షీమాత్రంగా చూసేవారో అనేకమంది ఉంటారు కనుక, యథార్థ వాతావరణకు అవసరమైనంతవరకే ఇతరపాత్రలు ప్రవేశపెట్టబడ్డాయి. కార్మికుని జీవితంతో ఎక్కువసంబంధం కలిగినభార్య, కొడుకుల పాత్రలు కొంచెం పెద్దవిగా చూపబడ్డాయి. మిగతాపాత్రలన్నీ నామమాత్రాలే. ఒక్క కార్మికుని పాత్రే పైన చెప్పిన సారాంశాన్ని నిరూపించటానికి పనికివచ్చేది. అందుచేత అతనికే యావత్ ప్రాధాన్యమివ్వబడింది.

అతడైనా ఎవరు? దారిన పోయే అనేకమంది దానయ్యలలో అతనొక దానయ్య. ఆ దానయ్యని హఠాత్తుగా రోడ్డుమీద ఆపి అతని జీవితంలోని ఒక ఘట్టాన్ని క్లోజప్ తీసి, మనకు కావలసిన జీవిత సత్యంకోసం అతన్ని కాసేపు ఉపయోగించుకున్నట్లయింది. అతని మనస్తత్వం అంతటినీ, అతని గుణగణాలన్నింటినీ చూపించలేదు. కథకి కావలసినంతవరకే చూపించారు. మనచిత్రాల్లో అయితే మహారాజుగారికి లేకలేక కొడుకు పుట్టడం దగ్గిర్నుంచి, ఆ కొడుక్కి కొడుకులు, మనమళ్లు పుట్టడందాకా అన్నీ వివరంగా చూపిస్తారు. ఇంతా చూపిస్తే మనకి ఏ జీవిత సత్యమూ బోధపడదు- మన జీవితం సినిమాలో జీవితాల్లాగ అసత్యంతో కూడినదైతే ఎంతబావుంటుంది, అనే భ్రాంతితప్ప.

పాత్రలను పరిచయం చెయ్యడంలో డీసికా ఉపయోగించిన టెక్నిక్ అతని ప్రతిభకు నిదర్శనం. మన దర్శకులు కొన్ని వందల అడుగులు ఫిల్ము తీస్తేగాని ఒక్కొకపాత్రనూ ఎస్టాబ్లిష్ చెయ్యలేరు. ఒకపాత్ర స్వభావం తెలియజెయ్యటానికిఅతనిదైనందిన కార్యక్రమమంతా చూపిస్తారు. అతని చేతనే అతని స్వభావం చెప్పిస్తారు. ఇతరపాత్రలచేత కూడా చెప్పిస్తారు. ఇంత చేస్తేనేగాని అత డెటువంటివాడో ప్రేక్షకులకు చెప్పలేరు. ఈ ఇటాలియన్ చిత్రంలో పాత్రలు సునాయాసంగా పరిచయం చెయ్యబడ్డాయి. చిత్రం మొదట్లో ఉద్యోగంకోసం ఎంతోమంది పోటీపడటం, ఆ పోటీలో ఉద్యోగం తనకు దక్కకుండా పోతుందేమోనని కార్మికుడు అతి ఆత్రంగా ఉద్యోగాని కంగీకరించటం—వీటితోనే అతని నిరుద్యోగబాధ యావత్తూ మన కర్థమవుతుంది. "బ్రతుకు తెరువు"లో లాగ సమాజంమీద దీర్ఘోపన్యాసాలు చేయించలేదు. ఆఖరున కార్మికుడు సైకిలు దొంగిలించబోవటానికిముందు అతని అంతస్సంఘర్షణ ఎంత నిశితంగా చూపబడిందో గమనించండి. తండ్రి, కొడుకు పేవ్ మెంటుమీద తలలు పట్టుకొని కూర్చుంటారు. కార్మికుడికి ఎక్కడచూసినా సైకిళ్లే కనిపిస్తాయి. ప్రతివాడికీ సైకిలుంది; తనకే సైకిలులేదు. తనకిమాత్రం సైకిలెందుకు ఉండగూడదు? తను చేసిన తప్పేమిటి? ఈ ఆలోచనలన్నీ అతన్ని బాధిస్తున్నాయని చెప్పటంకోసం ఒక్క మాట



నేషనల్ ఆర్ట్ ప్రొడక్షన్సు వారి "పచ్చపుల్లయ్య"లో ఎస్టేటు మేనేజరు భూపాలరావుగా జి. వెంకటేశ్వరరావు

★ "బైసికిల్ తీవ్స్" సమీక్ష ★

యినా అనిపించలేదు. అంతా కెమేరాతోనే చెప్పించబడింది. కార్మికుడు తల వంచుకుని కూర్చుంటే సైకిళ్లు ఒకదాని తరవాత ఒకటి మెరుపుల్లాగ అతని కళ్ళముందు మెరిసి మాయమై పోతూంటాయి. సైకిళ్ళ మీద ఎవరు కూర్చున్నదీ అతడు గమనించడు; వాటి చక్రాలనే చూస్తూ వుంటాడు. తరవాత పక్క రోడ్డులో ఒక ఇంటి ముందుఉన్న ఒంటరి సైకిలు కనిపిస్తుంది. ఆ సైకిలు కేసి ఒకసారి, సైకిళ్లమీద పోయే జనంకేసి ఒకసారి, కొడుకు కేసి ఒకసారి చూస్తాడు. ఈ కొద్దిషాట్లతో, అతనికి సైకిలు దొంగిలించాలనే భావం ఎలా కలిగిందీ, ఎలా ప్రబలమైందీ మనకు అవగతమై పోతుంది, ఒక్కమాట కూడా సహాయం లేకుండా.


ఇటువంటి చోట్లనే సినిమటోగ్రఫీ విశిష్టత బయటపడుతుంది. మనవారు ఎక్కడనుంచి నేర్చుకున్నారో తెలియదు గాని ఫోటోగ్రఫీతో స్టంట్లు చెయ్యటం బాగా నేర్చుకున్నారు. వి. ఎన్. రెడ్డి, రహమాన్, రామనాగ్ మొదలైన పేరుపొందిన ఫోటోగ్రాఫర్లు కూడా ఏ పరమార్థమూ లేకుండా తమ గొప్పదనం చూపించుకుంటారు. చిత్రచిత్రమైన ఆంగిల్సులోంచి షాట్లు తీస్తార. గమత్తు గమత్తు లైటింగ్ ఇస్తారు. వీటివల్ల కథకు ఒనగూడే లాభం వీసమెత్తు ఉండదు - పోలెడు ధనవ్యయం, కాలవ్యయం తప్ప. ఆయా ఫోటోగ్రాఫర్లు తమ తమ నైపుణ్యం చూసి తాము సంతోషించవలసిందే తప్ప మరెవరూ సంతోషించరు. ప్రేక్షకులు సినిమాకు వచ్చేది ఫోటోగ్రఫీచూసి ఆనందించటానికి కాదు, కథను చూడటానికి మాత్రమే. ఫోటోగ్రఫీ కథను వివరించటానికి ఉపయోగపడాలే గాని కథనువిడిచి సాము చెయ్యగూడదు. "బైసికిల్ తీవ్స్"లో కెమేరా ఏ స్టంటులూ చెయ్యదు. ఒక్కొక్కసారి ఒక్కొక్క పాత్రస్థానంలో నుంచుని కెమేరా గమనిస్తుంది. మరొకసారి ప్రేక్షకుల స్థానంలో నుంచి చూస్తుంది. ఇంకొకసారి, ప్రపంచంలోని ప్రత్యల్పసంఘటననూ ఆర్ద్ర హృదయంతో, సానుభూతితో పరికించే కళాకారుడివలె ఆయా దృశ్యాలు రికార్డు చేస్తుంది. ముఖ్యంగా కార్మికుని కొడుకును చివరవరకూ ఎంత సానుభూతితో కెమేరా పరికించిందో చూడండి. ఒక్కొక్కచోట కథతో ప్రత్యక్ష సంబంధం లేకపోయినా అతడు తల దువ్వుకోవటం, మెడకి స్కార్ఫ్ చుట్టుకోవటం, భోజనశాలలో. మాంసం ముక్క సాగదీసుకుంటూ తినటం, ఒకచోట ఒంటేలు పోసుకోబోవటం, ఇట్లాంటి చిన్న చిన్న పనులన్నింటినీ ఎంత ప్రేమతో, ఉల్లాసంతో, క్లుప్తంగా కెమేరా చిత్రించిందో చూడండి. అలాగే వర్షం కురిసిన ఘట్టం ఒకటి. ఆ వర్షం కురవటం, ఆ మసక వెలుతురు, కుర్రవాడు కాలుజారి పడటం ఇవన్నీ కార్మికుడి దైన్యాన్ని వ్యక్తం చేయటానికి ఉద్దేశించబడినవి.

నటీనటుల్లో ప్రొఫెషనల్ తార లెవరూ లేరు. అందరూ అమెచూర్ పాత్రధారులే. ముఖ్యంగా బాల పాత్రధారి! ఆఖరున సైకిలు దొంగిలించిన కార్మికుణ్ణి నలుగురూ పట్టుకుని కొడుతూవుంటారు. అది చూసి బాలుడు గుంపుమధ్యనుంచి దూరివచ్చి తండ్రి కాళ్ళవద్ద చేరి "పపా పపా" (నాన్నా, నాన్నా) అని హృదయభేదకంగా ఏడుస్తాడు. ఆఒక్క ధ్వనీ ప్రేక్షకుల హృదయాలను కలకాలం దొలిచివేస్తుంది. జీవితయుద్ధంలో పరాజయంపొందిన అసంఖ్యాక మానవుల నిస్సహాయత అంతా ఆఒక్క ధ్వనిలో ప్రతిధ్వనిస్తుంది. ఆసన్నివేశం చూస్తున్న కాసేపూ బాలుడిలో మనం లీనమై పోతాము. తన తండ్రి ఎందుకు కొడుతున్నారో ఆబాలుడికి తెలియనట్టే, మనకి కూడా జీవితం ఇంత అర్థరహితంగా, క్రూరంగా, మానవుడికి శత్రువుగా ఎందుకుండాలో అర్థం కాదు.

ఇక ఈచిత్రంలో ఖరీదైన సెటింగులూ, ఇంపైనపాటలూ, డాన్సులూ, గ్లామరూ, మన నిర్మాతలు ఏవేవి అత్యావసరమని భావిస్తున్నారో అవేమీ లేవని వేరె చెప్పనక్కర్లేదు. ఎక్కువ భాగం లొకేషన్ షాట్లు చూపబడినవి. నీళ్లపంపులవద్దపోటీలు, బస్సులవద్ద క్యూలు, కొంచెం డబ్బున్న మనిషని తెలిస్తే చాలు వెంటబడే బిచ్చగాళ్ళు కుర్రాళ్లూ ఇవన్నీ ఎంతో సహజంగా తీయబడ్డాయి. ఇటాలియన్ పరిస్థితులపై వ్యాఖ్యానించే కొన్ని దృశ్యాలు చూడండి: కార్మికుడు తన సైకిలు పోయిందని పోలీసు అధికారికి రిపోర్టుచేస్తే, రిపోర్టు స్వీకరించడమే తమ బాధ్యత అనీ, సైకిలు వెతుక్కునే బాధ్యత అతనిదేనని అధికారి అంటాడు. జ్యోతిష్కురాలివద్దకు వెడితే "దొరికితే వెంటనే దొరుకుతుంది, లేకపోతే దొరకదు"అని జోస్యం చెబుతుంది.

జీవితంమీద ఇంత ఘాటుగా విమర్శ చేసే ఈచిత్రంలో విలన్ ఎవరూ లేకపోవటం గమనించదగ్గ విషయం. మన చిత్రాలన్నిటిలోనూ, సాంఘికమైనా, జానపదమైనా, మరేదైనా, రావణాసురుడూ, శూర్పణఖ ఉండి తీరుతారు. రావణాసురుడూ, శూర్పణఖా లేనిదే మన దర్శకులు 'డ్రామా' తీసుకురాలేరు. ఒక అతి సజ్జనుడూ, ఒక అతి దుర్జనుడూ ఉంటేగాని సంఘర్షణ కలిగించలేరు. ఆధునిక ప్రపంచంలో ఈ రెండు రకాల పాత్రలకూ స్థానంలేదని మనవారింతవరకూ గ్రహించకపోవటం ఆశ్చర్యం. "బైసికిల్ తీవ్స్"లో విలన్ లేడు. కార్మికుడు రిపోర్టుచేస్తే నిర్లక్ష్యంచేసే పోలీసు అధికారిమీదగాని, సైకిల్ లేకపోతే ఉద్యోగం లేదనే అధికార్లమీదగాని మనం ఆగ్రహపడలేము. ఆఖరికి కార్మికుని సైకిలు అపహరించిన దొంగమీదకూడా సానుభూతి కలుగుతుంది తప్ప కోపం కలగదు. మనకి ఆగ్రహం జనించేది వ్యక్తులమీద కాదు. నిరుద్యోగ సమస్య అనే రాచపుండును అభివృద్ధి చేస్తున్న పెట్టుబడిదారీ దోపిడీవిధానం మీదనే; మామూలు మనిషిని నేరజీవనానికి అలవడజేస్తున్న ఆర్థికవ్యవస్థమీదనే. ఈ విధాన నిర్మూలనమే సమస్యా పరిష్కారానికి మార్గమనే భావం ఊహాపథంలో ఎక్కడో లీలగా కదులుతుంది.

ఈ చిత్రాన్ని "యూకివారీసూ" "రషోమోన్" చిత్రాలతో కొందరు పోలుస్తున్నారు. ఈ రెండు జాపనీస్ చిత్రాలూ మనం మామూలుగా చూడటానికి అలవాటుపడిన హాలీవుడ్ చిత్రాలకంటె భిన్నమైన మార్గంలోనే నడిచాయి. నిర్వహణంలో అవి కొత్త టెక్నిక్ను అనుసరించాయి; నిజమే. కాని "బైసికిల్ తీవ్స్" మనను కదిలించినంతగా ఈ రెండుచిత్రాలూ కదిలించలేవు. "యూకివారీసూ"లో సమస్యకు విశ్వజనీనత లేదు. భర్త మరొక స్త్రీతో ఎప్పుడో సంగమించాడని బాధపడే భార్య ఆవేదనను మనం అర్థంచేసుకోగలిగినప్పటికీ సంపూర్ణ సానుభూతిని వెల్వరచుకోలేము. "రషోమోన్" చిత్రంలో కథ చెప్పటంలో నూత్నత్వం ఉన్నది. మిగతా విషయాల్లో ఈ చిత్రాన్ని మంచిరకం హాలీవుడ్ చిత్రాలతో పోల్చవచ్చు. అంతే. "బైసికిల్ తీవ్స్" అలా కాదు. దానికదే సాటి. పోలిస్తే ఒక్క చార్లి చాప్లిన్ చిత్రాలతోనే పోల్చవచ్చు. ఆశ్చర్యమేమంటే చాప్లిన్ చిత్రాలకూ ఈ చిత్రానికీ చాలా పోలికలున్నాయి. చాప్లిన్ వ్యంగ్యంగా చెప్పినదాన్నే డీసికా సూటిగా చెప్పాడు. చాప్లిన్ చిత్రాల్లోవలెనే ఈ చిత్రంలో కూడా సంఘర్షణ వ్యక్తికీ సమాజానికీ మధ్యనే. వికృతమూ, అర్థరహితమూ, బలి



హెచ్. ఎమ్. ఫిలిమ్స్ వారి "ఫాతిమా" చిత్రంలో మోలీనాదేవి, మీరామిశ్ర. డైరెక్టరు హేమచందర్; సంగీతం పంకజ్ మల్లిక్;

ష్టము అయిన సమాజానికీ, అల్పుడూ, నిస్సహాయుడూ, ఏకాకీ అయిన మామూలు మనిషికీ జరిగే సంఘర్షణ చాప్లిన్‌ను ఆకర్షించినట్లే డీసికానును కూడా ఆకర్షించింది. చాప్లిన్ చిత్రాల్లోవలెనే ఈ చిత్రంలో కూడా సమాజం వ్యక్తిని వేటాడి, వెంటాడి, తరిమి తరిమి కొడుతుంది.

అందుకే "బైసికిల్ తీవ్స్" చిత్రానికి విశ్వజనీనత ఉన్నది. నీకూ, నాకూ, ఎవరికైనా ఆసమస్య వర్తిస్తుంది. కార్మికుడు తను పోగొట్టుకున్న సైకిలుకోసం అపరిమితా వేదన అనుభవిస్తాడు; ఊరంతా అన్వేషిస్తాడు. ఆసైకిలు ఉంటేనే అతనికి జీవితం, కాంతి, శాంతి. అతను సైకిలు కోసంచేసే అన్వేషణ జీవితం కోసం చేసే అన్వేషణే. ఆసైకిలు ఒకసారి దొరికినట్టనిపించి మళ్ళీ మళ్ళీ అందకుండా పోతుంది. అదే అతని ట్రాజెడీ. అందుకే "బైసికిల్ తీవ్స్" విషాదాంత చిత్రం అయింది.

ఈ చిత్రం మనప్రాంతాల్లో ఎక్కువ విజయం పొందకపోవటానికి కేమిటి కారణం? ఈమాదిరి చిత్రం మనకు కొత్త కావటం ఒక కారణమై ఉండవచ్చు. ఇంతసాంఘిక వాస్తవికత గల చిత్రం మన వారెవరూ తీయలేదు. మన ప్రేక్షకులు పౌరాణిక చిత్రాలూ, జానపదచిత్రాలు, కొంచెం మించు మించుగా ఆ ధోరణిలోనే ఉండే "సాంఘిక" చిత్రాలూ చూడటానికి అలవాటు పడినవారు. మన సారస్వతం కూడా ఇటీవల కొలది ఏళ్ళుగా తప్ప కాలంతోపాటు పురోగమించటం మాని వేసింది. మన ప్రజలలో అధికసంఖ్యాకులు నిరక్షరులు. వారెరిగిన సారస్వతమల్లా రామాయణం, భారతం, భాగవతం మొదలైన గ్రంథాలే. ఈ ప్రాచీనగ్రంథాలవల్ల లభించే విజ్ఞానం, సంస్కారం ఆధునిక సమాజాన్ని అర్థం చేసుకోవటానికి ఉపకరించవు. ఈ పరిస్థితుల్లో సాంస్కృతికంగా మనకంటే ఎంతో ముందుకుపోయిన యూరపియన్ దేశాలనుంచి "బైసికిల్ తీవ్స్" లాంటి చిత్రం వచ్చిందంటే మన ప్రేక్షకులలో ఎక్కువమంది కది అయోమయంగా ఉండక ఏమవుతుంది? మన ప్రేక్షకులు పాత్రల్లో లీనం కావాలంటే పాత్రలకు ఊహించలేనంత కష్టాలు కలగాలి; నటీనటులు భోరుమని ఏడవాలి; ఏడుపు పాటలు పాడాలి. హరిశ్చంద్రుడు చంద్రమతిని నరకటం దాకా రావాలి. అప్పటికిగాని పాత్రల కష్టాల్లో మనం లీనంకాము. అయితే నేటి ప్రపంచంలో హరిశ్చంద్రుడూ, చంద్రమతీ ఎక్కడా కనిపించరు. కనిపించేదల్లా నాలాంటి, మీలాంటి సామాన్యమానవులు. ఈసామాన్య మానవులకష్టసుఖాలను తెలియజెప్పే సారస్వత సంప్రదాయం మనకు చాలా తక్కువ. మన సారస్వతం పురోగమించిన మాత్రమైనా మన చిత్రాలు పురోగమించలేదు. కేవలం ఒక సైకిలు పోగొట్టుకుని బాధపడే కార్మికుడిపై సానుభూతి కలగాలంటే ఆధునిక సంస్కృతితో కొంత పరిచయం ఉన్నవారికే సాధ్యమవుతుంది. మన చిత్రాలింకా పాత సంస్కృతినే ప్రతిబింబిస్తున్నాయి. ఆధునిక సమాజాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలు విరివిగా మనవారు తయారుచెయ్యటం మొదలుపెట్టిననాడు "బైసికిల్ తీవ్స్" వంటి చిత్రాలు మన ప్రేక్షకులకు 'కొత్త' చెయ్యవు. వాస్తవిక చిత్రాలు ఒకటీ ఆరా వస్తే చాలదు. విరివిగా రావాలి. వచ్చి ప్రేక్షకులకు ఒక కొత్త దృక్పథాన్ని అలవడజెయ్యాలి. ఈ బాధ్యత నిర్మాతలపైనే ఉన్నది. నిరక్షరులైన మన ప్రజలకు ఉత్తమ చిత్రాలు అక్కర్లేదనే వాదన సంఘద్రోహకరమైనవాదన. అవాస్తవిక చిత్రాల సంఖ్య తగ్గిపోయి వాస్తవిక చిత్రాలు అధికంగా రావడం ప్రారంభించిననాడు ప్రజలలో కూడా మార్పువచ్చి తీరుతుంది. ఏ రకం చిత్రాలు చూపిస్తే ఆరకం చిత్రాలనే ప్రేక్షకులు చూడటం అలవాటు చేసుకుంటారు.

ఈ వారపత్రికకు కొంతకాలం క్రితం "ప్రశ్నలు - సమాధానాలు" శీర్షిక నిమిత్తం

(56-వ పేజీ చూడండి)

[illegible]లో ఇంద్ర ధనుస్సు

సినిమా ఎల్లా తీస్తారు?—5

జెకొస్లోవాకియన్ రచయిత కారల్ చాపెక్ రచనకు అనుసరణ:
(నండూరి రామమోహనరావు)

క్రిందటివారం సంచికలో స్టూడియోలో చెలరేగిన చిన్న తుపానుమూలంగా ఈవ్యాసం ఆగిపోయింది. ఆ తుపానురేపిన మనిషి ఫిలిం డైరెక్టరని మీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. స్టూడియోలో ఎంత మందిలో ఉన్నా డైరెక్టరును ఇట్టే కని పెట్టెయ్యవచ్చు. మల్లెపువ్వులాగ తెల్లటి, ఉల్లిపొరలాగ పల్చటి బట్టలు వేసుకుని సిగ రెట్ మీద సిగరెట్ దమ్ములాగుతూ సెట్ మీద ఏకచ్ఛత్రాధిపత్యం చెలాయించే వ్యక్తి డైరెక్టరు కాక ఇంకెవరవుతాడు?

డైరెక్టరుకు దగ్గర్లో అటూ ఇటూ తూనీగలవలె సంభ్రమించే ఇద్దరుకుర్రాళ్లున్నారే-వారిలో ఒకడు అసోసియేట్ డైరెక్టరు, మరొకడు అసిస్టెంటు డైరెక్టరు. డైరెక్టరిచ్చే ఆదేశాలు సక్రమంగా నెరవేరేటట్లు చూడటం, నటీనటులు వారివారి స్థానాల నుండి తప్పిపోకుండా చూడటం, డైరెక్టరు పిలిచినప్పుడల్లా రెడీగా ఉండటం వీరి ముఖ్యవిధులు. సీగ డైరెకరుగారి సిబ్బందిలో సభ్యులు. వీరుకాక డైరెక్టరుగారికి సొంతపనులు చేసిపెట్టేమనిషి, టెలిఫోనులో ఎవరన్నా పిలిస్తే "డైరెక్టరు చాలాపనిలో వున్నారు. తరవాత పిలవండి" అని చెప్పేమనిషీ కూడా ఈ సిబ్బందిలోకే వస్తారు.

కెమేరావెనక వివిధభంగిమలలో నివసించే ఆసామీని కెమేరామాన్ అంటారు; కెమేరా ఆపరేటర్, ఫొటోగ్రాఫర్, ఛాయాగ్రహణ దర్శకుడు ఇవన్నీ ఆయనకు గల నామాంతరాలు కాని అన్నిటికంటే ఆపరేటర్ అనే మాట బాగా అతికినట్టనిపిస్తుంది. ఎందుకంటే ఆపరేషన్ చెయ్యటంలో సర్జన్‌కి ఎంత చాకచక్యం, నిశితదృష్టి ఉండాలో కెమేరా ఆపరేటర్‌కి కూడా అంత చాకచక్యమూ, నిశితదృష్టీ ఉండాలి. కొంచెం పొరపాటు వచ్చినా మొదటికే మోసం వస్తుంది. అంతే గాక కెమేరామాన్ భరతశాస్త్రంలో కూడా ప్రవేశం ఉన్నవాడై వుండాలి. ఏమంటే వివిధభంగిమలలో ఉండి దృశ్యాలు షూట్ చెయ్యవలసివస్తుంది: ఒకసారి సాష్టాంగంగా నేలపై పడుకోవాలి; ఒకసారి మోకరించాలి; ఒకసారి వెల్లకిలా పడుకోవాలి; ఒకసారి ట్రాలీమీద ఎక్కి కూర్చోవాలి; ఒకసారి క్రేన్ మీద ఉయ్యాల ఊగుతూ వుండాలి.



★

బెంగాలీ చిత్రాలకూ బెంగాలీ సాహిత్యానికి దగ్గర సబంంధం ఉన్నది. ఈసంబంధంవల్లనే మిగతా భారతీయ చిత్రాల్లో లేని ఒక విశిష్టత వాటిలో కనిపిస్తుంది. శరత్ బాబు నవలలన్నీ బెంగాలీ తెరపై చిత్రించబడినవి. హెచ్. ఎమ్. ఫిలిమ్స్‌వారి "ఛోటీమా" కు ఆధారం శరత్ నవల "బిందూర్ ఛేలే." ఆ చిత్రంలో నటించిన మీరామిశ్రా, అసిత్ బరన్ లను ఈ స్టిల్‌లో చూడవచ్చు.

★

సినిమాలో ఇన్నిరకాలుగా షూట్ చెయ్యవలసి వస్తుంది. ఇటువంటిభంగిమల్లో ఉన్నవాడై, కెమేరామన్ మిగతావారికి ఆదేశాలిస్తూ వుంటాడు: "వెంకయ్యగారిపై ఇంకొంచెం లైటుపడాలి. స్ప్లెండిడ్! వెంకయ్యగారూ, కొంచెంతిరగండి. ఫైన్! రామారావుగారు కొంచెం దగ్గిరికిరావాలి. ఓకే. ఆలైటు కొంచెం తగ్గించు. గ్రాండ్! దట్స్ రైట్!" ఈవిధంగా సేనానాయకుడు యుద్ధభూమిలో సైనికులకు ఆజ్ఞలిస్తున్నట్టు ఆజ్ఞలిస్తూ వందలకొలది సీన్లు షూట్ చెయ్యవలసి వుంటుంది. ఇన్నిసీన్లు షూట్ చేసినప్పటికీ ఎందుకు షూట్ చేశాడో, ఆ షాట్లన్నీ ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు, ఎల్లా ఉపయోగిస్తారో ఆ గొడవ అతనికేమీ తెలియదు. తెలుసుకోవటానికి ప్రయత్నించడు. తెలుసుకోవలసినఅగత్యం అతనికి లేదు. అతని పని శుభ్రంగా, శుచిగా ఫొటో తియ్యటమే. ఫ్రేము నిర్దుష్టంగా ఉందా లేదా, లైటింగ్ కరెక్టుగా ఉందా లేదా, అదే అతనికి కావలసింది. కథ, నటన, రసపుష్టి వగైరా మాటలు చెబితే విరక్తిగా నవ్వి ఊరుకుంటాడు - ప్రాపంచిక కష్టసుఖాలు చెప్పుకుంటే జీవన్ముక్తుడైన వేదాంతి చిరునవ్వు ఒలికించినట్టు. కథా మొదలైనవి పనీపాటూ లేని మూర్ఖుల వ్యాపకాలని ప్రతి కెమేరామాన్‌కు మనస్సులో గట్టినమ్మకం ఉంటుంది. వేదాంతికి బ్రహ్మపదార్థం ఒక్కటే సత్యమైనట్టు, కెమేరామేన్‌కు ఫొటోగ్రఫీ ఒక్కటే తిరుగులేని సత్యం.

కెమేరామన్‌కు పెద్దబలగం వుంటుంది. లైటింగ్ నుపుణులు అంతా అతనిసిబ్బందిలో వాళ్లే. ఈ లైట్లు సెట్ మీద యాక్షన్ జరిగే ప్రదేశానికి చుట్టూ అమర్చబడి వుంటాయి. కొన్ని పైన గాలరీమీద అమర్చబడతాయి. లైట్లలో చిన్నవీ, పెద్దవి, మరీ పెద్దవీ ఉంటాయి. చిన్నవాటిని ముద్దుగా 'బేబీస్' (పాపాయిలు) అంటారు. మరీ పెద్దవాటిని ఆర్క్స్ అంటారు. పట్టపగటి కాంతి, వెన్నెల, ఉదయకాంతి, మసక చీకటి, నడిరాత్రి ఏమాదిరి లైటింగ్ కావలసినా అందుకు తగిన వేర్వేరు లైట్లు సిద్ధంగా ఉంటాయి. దృశ్యమంతటినీ కాంతివంతం చెయ్యటానికి 'ఫ్లడ్' చేస్తారు. ఒక్కమనిషి మాత్రమే కనబడేట్టు చెయ్యాలంటే 'స్పాట్' చేస్తారు. ఈ లైటింగ్ ఏర్పా



"తు రాజావారి ఒక తల్లి పిల్లలు" అనే తెలుగు చిత్రంలో పద్మిని.
ఈ చిత్రంలో శ్రీరామ్, కౌశిక్, లలిత, శాంతకుమారి కూడా నటిస్తున్నారు.

సినిమా ఎలా తీస్తారు?

ట్లన్నీ ముగిసిన తరవాత సౌండ్ రిహార్సల్ వకొకటి మిగిలివుంటుంది. "కమాన్, సౌండ్ రిహార్సల్ మొదలెడదాం," అని డైరెక్టరు చప్పట్లు చరుస్తాడు.

సౌండ్ రిహార్సల్‌కు సంబంధించిన మనిషిని రికార్డిస్ట్ అంటారు. ఈయన ఫ్లోర్‌లో ఒకమూల తన యంత్రంముందు కూర్చుని వుంటాడు. మాట్లాడే నటుడికి దగ్గిరిగా 'మైక్ బూమ్' ఉంటుంది. దానికి చివర వేళ్ళాడుతూ మైక్ ఉంటుంది. 'బూమ్' దగ్గిర సౌండ్ అసిస్టెంటు లుంటారు. మైక్ ఎటు కావలిస్తే అటు తిప్పడం వారిపని. నటుడు మాట్లాడిన మాటలశబ్దం ముందు మైక్రొఫోనులో ప్రవేశించి, అక్కణ్ణించి రికార్డిస్టు దగ్గిరికిపోతుంది. అక్కణ్ణించి సౌండ్ రూమ్‌లోకి పోయి, అక్కడ ఆంప్లిఫై కాబడి, కాంతిగా మార్చబడి, సౌండు ట్రాక్ మీద ఫొటోగ్రాఫ్ కాబడి, ఇంకా ఏమేమిటో కాబడుతుంది. అదంతా ప్రత్యేక ప్రవీణుల నడిగి తెలుసుకోవలసిందే. ఒకవేళ వారు శ్రమతీసుకుని ఏమేమి కాబడుతుందో వివరించినా మనం తలకాయ ఆడించటం తప్ప మరేమీ చెయ్యలేము.

ఈ గొడవకంటే తేలిగ్గా తెలుసుకోదగింది ఒకటుంది. కెమేరా స్టార్ట్ అయి, యాక్షన్ ప్రారంభం కాబోయేముందు ఒక కుర్రాడు క్లాప్ బోర్డు పట్టుకుని కెమేరాకు అడ్డంగాపెట్టి క్లాప్ చేస్తాడని ఇదివరలో చెప్పాను. ఆ బోర్డుమీద సీను నంబర్, షాట్ నంబర్, టేక్ నంబర్ వగైరాలు రాసివుంటాయి. ఇది ఎందుకంటే అనేక వందల షాట్లు తయారై, ఈ షాట్లన్నిటినీ కథాక్రమంలో అతికించ వలసిన సమయం వస్తుంది. అప్పుడు ఏ నంబరు షాట్ ఏదో, సౌండ్ ట్రాక్‌ను సరిగ్గా ఎక్కణ్ణించి జాయిన్ చెయ్యాలో ఇదంతా ఆ క్లాప్ బోర్డువల్లనే తెలుస్తుంది.

ఇందాక అసిస్టెంటు డైరెక్టరును కొంత పరిచయం చేశాను. షూట్ కాబడుతున్న సీనుమీద ఒక కన్నూ, సినేరియోమీద ఒక కన్నూ వేసివుంచడంకూడా అతని పనుల్లో ఒకటి. షూట్ చెయ్యబడిన సీన్లు గుర్తుపెట్టుకుంటూ, వెంకయ్యగారు ఎటువంటి దుస్తులు వేసుకున్నాడో, రామారావు ఏమాదిరి చొక్కా, పంట్లాం తొడుక్కున్నాడో గుర్తుపెట్టుకుంటూ ఉండటం కూడా అతడిపనే. ఈ పనినే కంటిన్యూయిటీ పని అంటారు. ఇలా గుర్తుపెట్టుకోకపోతే పెద్దపప్పులు సంభవిస్తాయి. ఇవాళ తీసిన షాట్‌లో రామారావు నిక్కరు తొడుక్కుని, దానితరవాత వచ్చే షాట్ రేపు తీసినప్పుడు పంట్లాం తొడుక్కుని వస్తాడనుకోండి! కంటిన్యూయిటీ ఖూనీ అయిపోతుంది. అందుచేత కంటిన్యూయిటీని కంటిని రెప్పలాగ కాపాడుకునే బాధ్యత అసిస్టెంటు డైరెక్టరుది.

నటీనటులను గుర్తుపట్టడం మరీ తేలిక. వారు ధరించే దుస్తులు, మొహాలకు పూసుకున్న రంగులు, ఎర్రరంగు పట్టించిన పెదిములు, నల్లరంగుతో తీర్చిదిద్దిన కనుబొమలు, ఇవన్నీ వారు నటీనటులని చెప్పకనే చెబుతాయి. షూటింగ్‌లో అవసరంలేని నటీనటులు సాధారణంగా కొంచెం అవతలగా ముఠాలుగా నిలబడి ఎండల్ని గూర్చి, వంట్లో అస్వస్థతనుగూర్చి, దగ్గరలేని ఇతర నటీనటుల గుణగణాలను గూర్చి పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ వుంటారు. వారికి దగ్గర్లో మేకప్ ఎసిస్టెంట్లు మేకప్ సామగ్రితో సహా అప్పుడప్పుడు కనిపిస్తారు. వెంకయ్యగారి మీసాలు చెదిరినా, రంగు మాసినా గభాలునవచ్చి సరిదిద్ది వేస్తూంటారు. వీరుగాక ఎక్స్‌ట్రా నటీనటులుకూడా కొంత దూరంగా, మౌనంగా నిలబడి, కెమేరాముందు క్షణంసేపు మెరిసే అదృష్టంకోసం నిరీక్షిస్తూ వుంటారు.

షూటింగ్ సందర్భంలో వీరుగాక ఇంకా పలువురు వ్యక్తులు కనిపిస్తారు. వీరిలో కొంతమంది పక్కన ఫ్లోర్‌లో షూటింగ్ జరుగుతున్న మరొక ఫిల్మ్‌కు సంబంధించిన వారు. వీరుగాక అనాహూతులైన అతిథులు కొందరుంటారు. సాధారణంగా ఫిలింకంపెనీలవారు సెట్‌లోకి కొత్తవారి నెవ్వరినీ రానివ్వరు. ఈ నిషేధం ఉండటంవల్ల, దాన్ని ఉల్లంఘించాలని ఉబలాటపడేవారనేకులు కోటను భేదించిన శత్రుసైనికుల్లాగ లోపలికి జొరబడుతూంటారు. వీరిలో ఫిలిం కంపెనీ ఉద్యోగుల చుట్టాలు, చుట్టాల స్నేహితులు, స్నేహితుల చుట్టాలు ఉంటారు; తారల అభిమానులు (ఫాన్స్) కొందరుంటారు. వీరంతా ఎలక్ట్రిక్ వైర్లను దాటుకుంటూ, సెట్ ఏవిధంగా నిర్మించబడిందో పరీక్షిస్తూ, గుసగుసలాడుతూ, షూటింగ్‌కు అక్కర్లేని శబ్దాలుచేస్తూ, తమ ఆరాధ్యదేవతలైన తారలను భక్తినిమీలిత నేత్రాలతో చూస్తూ, తిరుగుతారు. ఆ దృశ్యం చూస్తుంటే ప్రపంచంలో పనీపాటా లేకుండా తిరిగే సోమరు లింతమంది ఉన్నారా అని ఆశ్చర్యం కలుగుతుంది.

(సశేషం)

[illegible]

ప్రతిభావారు బహుశా వచ్చేనెలలో నూతన చిత్రనిర్మాణం ప్రారంభిస్తారని తెలుస్తోంది. "చిన్నకోడలు" తరవాత సరిగా ఏడాదికి ప్రారంభం కానున్న ఈ చిత్రం కాస్ట్యూమ్స్ ప్రధానంగా గల జానపదచిత్రమనికూడా తెలుస్తోంది. దర్శకుడు శ్రీ ఘంటసాల బలరామయ్య; రచన శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి; సంగీతం అశ్వత్థామ. ఈ చిత్రం తెలుగులో మాత్రమే తయారవుతుంది.

* * *

సారథీవారు త్వరలో ఒకచిత్రం ప్రారంభించనున్నారని తెలుస్తోంది. దర్శకుడు చాణక్య; రచన శ్రీ తాపీ ధర్మారావు, శ్రీ క. లక్ష్మీనారాయణ; నటీనటులు రంగారావు, సి. ఎస్. ఆర్., జమున, రమణారెడ్డి, హేమలత; సంగీతం వేణు. స్టూడియో నర్సు. ఈ చిత్రానికి ఇంకా పేరు పెట్టలేదు.

* * *

రాజ్యం పిక్చర్సువారు "బాటసారి" అనే చిత్రం తీయనున్నారు. రచన శ్రీశ్రీ. దర్శకుడు గోగానంద. లక్ష్మీరాజ్యం, ఎన్. టి. రామారావు, రేలంగి మున్నగువారు నటిస్తారు.

* * *

పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్సువారు త్వరలో సాంఘిక చిత్రం ఒకటి ప్రారంభిస్తారట. తాతినేని ప్రకాశరావుగారే డైరెక్టు చేస్తారట. వీరేశలింగంగారి జీవిత చరిత్రకు వివరాలు సేకరించటానికి ఇంకా చాలకాలం పట్టుతుంది కనుక దాన్ని వచ్చే ఏటికి వాయిదావేసి ఈలోగా వృథాగా వుండకుండా మరొక చిత్రం తీద్దామని వారిఆశయం.

* * *

ఈ నెల 20, 21 తేదీల్లో ఆలిండియా సినీ టెక్నీషియన్ల సంఘంవారి ద్వితీయ సమావేశం కలకత్తాలో జరుగుతుందని ప్రధాన కార్యదర్శి ఎన్. కృష్ణస్వామి తెలియజేస్తున్నారు. కె. రామనాథ్ అధ్యక్షత వహిస్తారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి డా॥ బి. సి. రాయ్ సమావేశం ప్రారంభిస్తారు. బెంగాల్ సినీ టెక్నీషియన్ల ఆహ్వానంపై జరిగే ఈ సమావేశపు స్వాగతసంఘానికి ఛైర్మన్ దేవకీబోసు.

ప్రశ్నలు..సమాధానాలు

శ్రీ డి. సూర్యనాథ్—హిందూపురం.

ఆంధ్రవారపత్రిక 3-6-58 సంచికలో "ఇన్‌స్పెక్టర్" సమీక్ష అను శీర్షిక క్రింద తెలుగు తారల్లో ఉత్తమ అభినేత్రులుగా లెక్క పెట్టదగిన ముగ్గురు తారల్లో శ్రీమతి అంజలీదేవి ఒకరని వ్రాసినారు. మిగతా ఇద్దరు తారలెవ్వరండి?

—మిగతా ఇద్దరూ భానుమతి, జి. వరలక్ష్మి కావచ్చును. ఏం,ఒప్పుకోరా మీరు?


*   *   *

శ్రీ డి. వి. రంగరాజు—అమనాం.

శరత్ రచించిన "దేవదాసు" నవలలో "దేవదాసు" పాత్ర, నాగేశ్వరావు, యన్. టి. రామారావులలో ఎవరు బాగా పోషించగలరు?

—ఏ నటుడైనా పేరుపొందినవాడైనంతమాత్రాన ప్రతి చిత్రంలోనూ బాగా నటిస్తాడని చెప్పలేము. నాగేశ్వరరావుగాని, రామారావుగాని "దేవదాసు"ను నటిస్తుండగా మనం చూడలేదు. చూడకుండా ఊరికే మీరూ మేమూ ఊహాగానాలు చెయ్యటం దేనికి? ఒకరితో ఒకర్ని పోల్చటం దేనికి?

*   *   *



నవయుగవారి "జ్యోతి"లో మిక్కిలినేని.

శ్రీ పి. చెంచయ్య—బందరు.

ఆంధ్రపత్రికవీక్లీలో ప్రచురించే "దత్తత", ప్రసాద్ ఆర్టు పిక్చర్సువారి "పెంపుడు కొడుకు" ఒకటేనా? పత్రికలలో ప్రచురించే స్టిల్సునిపట్టి ఒకటే ననుకుంటున్నాను.

—మాకు తెలిసినంతవరకూ అవి వేర్వేరు కథలే. "పెంపుడు కొడుకు" కథకు మూలం ఒక తమిళ నవల.

*   *   *

శ్రీ ఎస్. కె. రాజ—సికింద్రాబాదు.

రవీంద్రుని శాంతినికేతనము తూర్పు పాకిస్తానులో యున్నట్లు కళ్ళారా చూచానని ఒక స్నేహితు డన్నాడు. నేను నమ్మలేకుండా యున్నాను. సందేహము తీర్చగలరా?

—కళ్ళారా మాసిన మాట నిజం కాకపోవచ్చు; ఒకవేళ కళ్ళారా చూస్తే అది తూర్పు పాకిస్తాన్‌లో అయివుండదు, పశ్చిమ బెంగాల్‌లో అయివుంటుంది; ఒకవేళ తూర్పు పాకిస్థాన్‌లోనే చూసివుంటే అది శాంతినికేతనం అయివుండదు, మరేదో అయివుంటుంది.

*   *   *

శ్రీ జేగా రాధాకృష్ణయ్యనాయుడు—నెల్లూరు.

పాలగుమ్మి పద్మరాజుగారు ఏ చిత్రానికైనా కథ వ్రాస్తున్నారా?

—బి. ఎన్. రెడ్డిగారు తీయబోయే ఒక చిత్రానికి కథ వ్రాసియిచ్చారు.

*   *   *

శ్రీమతి యన్. యస్. వి. పద్మావతి—గుంటూరు.

నేటి యువకులలో అధికభాగం విద్యావంతు లైనప్పటికీ వరకట్నా లింతగా వ్యాప్తిలోనికి రావడానికి కారణ మేమిటండీ?

—ఇది పెట్టుబడిదారీ వ్యాపారయుగం అన్నమాట మరిచిపోకండి. వివాహం ప్రేమ, స్నేహం, విద్య, విజ్ఞానం అన్నీ బజార్లో డబ్బిస్తే దొరికే వ్యాపారవస్తువుల జాబితాలో చేరిపోయాయి. ఇది ఈ యుగ లక్షణం.

*   *   *

శ్రీ మతుకుమల్లి సుబ్బారావు—నెల్లూరు.

కళ యథార్థముయొక్క ప్రతిబింబమా? లేక కళాకారునియొక్క ఊహా సృష్టియా?

—కళాకారుడు ప్రపంచంలో యథార్థంగా జరిగే విషయాలనే తన కళలో పునఃసృష్టి చేస్తాడు. పునఃసృష్టి చెయ్యటంలో, అక్కర్లేని విషయాలు అనేకం వదిలివేసి తను పెట్టుకున్న ప్రయోజనానికి పనికివచ్చే కొన్ని విషయాలను మాత్రమే స్వీకరిస్తాడు. ఇలా కొన్ని విషయాలు వదిలేసి, కొన్నిటినే స్వీకరించటంలో యథార్థ జగత్తుకు కొత్త రూపం వస్తుంది. ఈ కొత్త రూపమే కళ అవుతుంది. (*Art is the recreation of reality.*)

*   *   *

శ్రీ వి. జస్వంత్—కవుతరం.

ఆంధ్రపత్రిక 3-6-58 "ఇన్స్పెక్టర్" సమీక్షలో ఒకచోట "అతని ఉపన్యాసమే కాక వేషం కూడా కేంద్రమంత్రి డా॥ కేస్కార్‌ను జ్ఞాపకం చేస్తుంది" అనిఉంది. దీని అర్థం ఏమిటండీ?

—కేంద్రప్రభుత్వపు సమాచార,బ్రాడ్‌కాస్టింగ్ శాఖ మంత్రి డా॥ బి. వి. కేస్కార్ సినిమాల్ని విమర్శిస్తూ ఇచ్చిన ఉపన్యాసాలు మీరు పత్రికల్లో చదవలేదా? సినిమాలు కళ పేరుతో అవినీతిని ప్రచారం చేస్తున్నాయని ఆయన అనేకసార్లు అన్నారు. సినిమా సంగీతాన్ని కూడా రేడియోల్లో ఆయనే తగ్గించారు. "ఇన్స్పెక్టర్" చిత్రంలో సరిగ్గా కేస్కార్ ధోరణిలోనే బాలచందర్ చేత ఒక చిన్న ఉపన్యాసం ఇప్పించారు. అప్పటికీ ప్రేక్షకులకు కేస్కార్ జ్ఞాపకం రాకేమోనని ఇంచుమించుగా కేస్కార్‌లాటి వేషమే ధరింపజేశారు. లేకపోతే బాలచందర్ ధరించిన పాత్ర దక్షిణాదికి సంబంధించినదై వుండగా ఆ ఉత్తరహిందూస్థానీ వేషం దేనికి చెప్పండి. ★

*   *   *

శ్రీ బి. సత్యనారాయణ—బొబ్బిలి.

శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తిగారు వ్రాయుచున్న "దత్తత"లో ధర్మయ్య కూతురు లక్ష్మికి, రాముకు ప్రేమ, హిందూమత సాంప్రదాయాలకి విరుద్ధంగా వుందని నా అభిప్రాయము. దానితో మీరు ఏకీభవిస్తారా?

—ఎందుచేత సంప్రదాయవిరుద్ధంగా ఉందో మీరు చెప్పనిదే ఎలా ఏకీభవించగలం?

★ వెండి మరచెంబు ★

(39-వ పేజీ తరువాయి)

కాకపోతే పరుగెత్తాల్సిన అవసరమే మొచ్చిందీ అని ఒకడు జుట్టు పీకేడండి. అంతా సావకొట్టేశా రండి బాబయ్యా" అని కళ్లనీళ్లు తుడుచుకున్నాడు. బాగా దెబ్బలు తిన్నట్టే ఉన్నాడుమనిషిని చూస్తే.

వాడు చెపుతుంటే నాకేడుపాగింది కాదు. వాడు బాగా దెబ్బలు తినడంచేత గావును నుంచో లేనంత నీరసంగా ఉన్నాడు. నాన్నగారికి జాలివేసింది కాబోలు వాణ్ణిచూస్తే 'కూర్చుని చెప్పరా" అన్నారు. అయినా వాడు కూర్చోలేదు. "తరువాత ఏం జరిగిందిరా"అంది అమ్మ.

మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు. "ఎల్లా తెలిసిందోండి, ఇంతలో పోలీసోళ్లు అక్కడికి వచ్చారండి. ఆళ్లకి నన్ను, చెంబు, నోటు వప్పగించారండి. నన్ను మొదణ్ణించీ మాశా నవోళ్లణ్ణి సొచ్చుం తెచ్చారండి, ఆటేసన్‌లో మళ్లీ సావగొట్టారండి. నిజం చెప్పరా నిన్నిడిపిస్తాం అంటారండి" ఈసారి దుఃఖం ఆపుకోలేక పోయాడు. అమ్మకి, నాకూ కూడా కళ్లనీళ్లాగలేదు.

కొంచెం సేపాగి "మీ పేరు సెప్పానండి. అరినోకర్నని కూడా సెప్పానండి నామాట మొదలు పోలీసోళ్లా యినిపించుకో లేదండి. కుళ్లబొడిచేశారండి బాబయ్యా" అన్నాడు. పెద్ద నిట్టూర్పు విడిచి మళ్ళీ చెప్పాడు" అలా కొట్టాక ఆ ఇనస్పేటర్ గారొస్తారు రొచ్చేదాకా కూచోమన్నారండి. కొంచెం సేపటికి ఆరొచ్చి నన్నడిగారండి, 'ఎవరింట్లో దొంగిలించావో చెప్పరా! నిజం చెబితే విడిచేస్తాం నిన్ను, అన్నారండి.

'బాబూ మీపాదాలట్టుకు సెపుతున్నానండి. నేను లక్ష్మీనారాయణగారి నౌకర్నండి ఆరు కాఫీ తెమ్మని పదిరూపాయీల నోటు చెంబూ ఇచ్చారండి. రాజనాలారి వీధిలో పదో నెంబరిల్లండి. బేడీ లేసి తీసుగెల్లినా నరేబాబు నేను దొంగోణ్ణి కానని అక్కడ ఋజువు చేసుకుంటానండి బాబయ్యా అక్కడికెల్తే మీకే తెలుస్తుందండి అని చెన్నానండి, ఆయనేం చేస్తారని అడిగారండి. ఆరికి బాంకులో పనండి అని కూడా చెప్పానండి. ఎన్నాళ్లనుంచి వారింట్లో ఉన్నావు? అని అడిగారండి. రెండేళ్ల నుంచి ఉన్నానన్నానండి, తరవాత వారిలో వారు చాలా సేపు మాట్లాడుకొన్నారండి. ఇనస్పేటరుగారే నుంచారండి, వాడికా చెంబు నోటుఇచ్చి కూడా ఇద్దరు పోలీసులు వెళ్లి వాడు చెప్పింది నిజమానో కాదో కనుక్కొని నిజమైతే వాణ్ణి వప్పగించిరండి, కాకపోతే మళ్లీ స్టేషనుకు తీసుకురండి' అని చెప్పారండి. అప్పటికి నాప్రాణం కొంచెం తెరుకొందండి. మీపాదాలకాడ నెమ్మదిగా బతికేవోణ్ణి నాకీరోజీ పాట్లొచ్చాయండి" అని నిట్టూర్పు విడిచాడు.

"అసలు నిన్నెవరు చూశారు నీమీద అనుమానం ఎందుకొచ్చింది" అన్నాను నేను.

"పోలీస్ స్టేషనులో ఆవచ్చిన వాడు ఏమని సాక్ష్యం ఇచ్చాడురా" అన్నాడు అన్నయ్య.

"ఓనం డబ్బాయిగారు అసలు సంగతి చెప్పలేదండి. ఈధిలో కెళ్లాక నాలుగిళ్లుదాటానండి. ఎవడో అలాపోతూ ఈచెంబుకేసే చూశాడండి. నాగుండెల్లో అదుటుట్టిందండి. ఈసంద చీకట్లో ఈవెండి చెంబు మెరుస్తోందండి. ఎవడైనా నెత్తికొట్టి లాక్కుంటాడేమో నని తలగుడ్డ తీసి దానికి సుట్టానండి. అది సూశాట్టండి ఆయెదవెవడో. ఆడి మూలాన్నింత మూడిందండి. వెండి చెంబెత్తుగు పోతుంటే ఎవరైనా సూత్తారని గుడ్డ సుట్టానంటండి, అదండి ఆడి చాప్చికం."

అంతావిని అందరూ ఒక్క నిట్టూర్పు విడిచారు.

"వాడి సాక్ష్యం అయ్యాక నువ్వేం చెప్పావు, పోలీసువాళ్లతో" అన్నారు నాన్నగారు.

(11-వ పేజీ తరువాయి)

కాయితమిచ్చింది. తబిశీలుగా చెప్పాడు రాములికి. వాడు నిర్ఘాంతపోయాడు. డి. యం. వో. ఎవరినీ కనుక్కోలేదు. ఏమీ దర్యాప్తు చెయ్యలేదు. పోనీ తాగినందుకు తనకి శిక్ష వెయ్యాల్నా – అదీ లేదు. అబద్ధంమీద అబద్ధం పేర్చి పెడుతున్నారన్న మాట ఎందుకైనా ముందుకి మంచిదని! ఎంత అక్రమం? తను సిస్టరమ్మని కొట్టనున్నాడా తిట్టనున్నాడా ప్రతీకారం కింద? వో చిన్న మందలింపు వొస్తుంది సిస్టరమ్మకి అనుకున్నాడంటే. అదీ లేదు సరిగదా ఎదురు డి. యం. వో. ని తనమీదకి వుసిగొలుపుతున్నదన్నమాట ఆమె. ఈసారి సర్జన్ జనరల్‌కి పిటీషను పెట్టమన్నాడు హెడ్డు గుమాస్తా.

అదీ అయింది. సేరుగా సర్జన్ జనరల్‌కి పిటీషను పెట్టినందుకు శంజాయిషీ యిచ్చాడు డి. యం. వో. అదట్లా నొక్కిపెట్టి సర్జన్ జనరల్ పిటీషన్‌మీద ఏమి చర్య తీసుకుంటాడో చూదామనుకొన్నాడు తోటీ రాములు. సర్జన్ జనరల్ ఆఫీసు గుమాస్తా చేతిలో పడిందా కాయితం ముద్రపడి. మామూలు పంథాలో డి. యం. వో. ని వుచితమైన చర్య తీసుకోవాలిసిందని రాశిపెట్టాడుఆగుమాస్తా! సంతకమయింది. డిస్పాచీ అయింది. ఏ ఆఫీసరు కేసంతా తనమీదకే తిప్పి తనకన్యాయంచేశాడో ఆ ఆఫీసరు చేతిలోకే మళ్ళీ వచ్చింది కాయితం "అదేమిటో చూడవలసిందని!" ఇదివరకే తీసుకోవలసిన చర్య తీసుకోవడమయినది" అని రికార్డు చేసి కాయితం లాడ్జిచేశాడు డి. యం. వో; అంటే కాయిత మిహా బబ్బున్నదన్నమాట.

ఈలోగా వొకచోట గలీజా అట్టే పెట్టాడనీ ఒకరోగి బెడ్‌పాన్ అడిగితే యివ్వలేదనీ ఒక యూరినల్ శుభ్రం చెయ్యలేదనీ చిలిపిచిలిపిగా సంజాయిషీలు వొస్తూనే వున్నాయి. సర్జన్ జనరల్‌కి పెట్టిన పిటీషనులో సిస్టరమ్మ తనని కొట్టినప్పుడు స్వయంగా చూచిన నర్సులూ, ఆయాలూ, వార్డు బోయ్‌లూ అందరినీ సాక్షులుగా వుదహరించాడు కూడా. పోనీ లాంఛనప్రాయంగానైనా వొక్కరిని 'ఏమి జరిగింది' అని అరాలడిగిన పాపాన పోలేదు. పైగా వాళ్ళందరికీ కోపమొచ్చింది వాడిమీద "మాతో చెప్పకుండా మమ్మల్నెందుకిరికించావూ" అని. సరిపోయింది! నిజంగా ఆరావొస్తే వీళ్ళెవళ్ళు తనవేపు పలుకుతారనుకుందుకు ఆస్కారం లేదు.

ఇదంతా రాజారావు కుట్రా? తను పెట్టిన అర్జీలన్నీ వీడే నీళ్లుకారుస్తున్నాడా? అంతమాటా ఆయన మొహాన్నే అనేశాడు రాములు. రాజారావుకి భయమేసింది. కొంపతీసి ఈ అర్జీలన్నీ తనే పెట్టించానని పేలతాడేమో గోల – ఈ అలగా జాతి కేమున్నదీ.

కాయితాలింత గుడ్డిగా పైకీ కిందకీ నడిచినట్టే నడిచి ఆఖరికిట్లా చతికిలబడతయ్యేమిటీ అని! వాడి కర్థంకాలేదు. ఆరోజంతా అతి వుగ్రంగా వున్నాడు వాడు. రుసరుసలూ, అర్థంలేని పేలాపనలూ నోటీపోటీగా ప్రారంభించాడు.

రాత్రి పదయింది. నిజంగానే తాగాడు రాములు. తిన్నగా సిస్టరమ్మ క్వార్టర్సుకి వెళ్ళి తలుపుకొట్టి నెమ్మదిగా పిలిచాడు ఏదో పని వున్నట్టు. ఆమె బైటికి వచ్చి తెల్లబోయింది. చెళ్లున లెంపకాయి కొట్టి సైకిలుమీద తుర్రుమన్నాడు.

మర్నాడు ఆసుపత్రి తెరిచారు. ఎవరి డ్యూటీవాళ్ళు చేస్తున్నారు. అంతా ప్రశాంతంగానే గడిచిపోయింది. ఇంత గుంభనగా ప్రతీకారం సాధ్యమవుతుందని అనుకోలేదు రాములు. మళ్ళీ మూడోకంటికి వాడికి తెలీదు. ఈ మాత్రం బుర్ర మొదట్లో వుంటే ఇన్నాళ్లూ చుట్టుదారిన దేవులాడే వాడు కాడు. ఏ మొహం పెట్టుకొని తోటీ రాములు తనని లెంపకాయి కొట్టాడని చెప్పుకుంటుందీ సిస్టరమ్మ? అథవా చెప్పినా పైకనకపోయినా లోన హర్షించని వాడెవడూ?

ఆరాత్రి గాఢంగా నిద్రపోయాడు తోట రాములు. ★

"నువ్వు గుడ్డ ఎందుకు సుట్టావని ఇనస్పెక్టర్ గారడిగారండి. ఇది యెండిలా మెరుస్తోందని సందచీకట్లో ఎవడైనా సూత్తే సత్తికొట్టి లాక్కుంటారని సుట్టానన్నానండి. దానికి గుడ్డ సుట్టకపోతే ఈతిప్పలే రాకపోనేమో బాబూ అన్నానండి నిజమేరా అన్నారండాయన"

"ఇంక వెళ్లు భోంచెయ్యి" అన్నారు నాన్నగారు సుబ్బన్నని.

"రారా" అంది అమ్మ. ఆనాటి కయిపోయింది.

"మర్నాడు అత్తయ్యావాళ్లూ సుబ్బన్న సంగతి యేమైందో తెలుసుకుందామని వచ్చారు. జరిగిందంతా చెప్పాము. నవ్వారు, జరిగిన తమాషాకి సుబ్బన్న దెబ్బలు తిన్నాడని బాధపడ్డారు.

ఆనాడు సుబ్బన్నని మళ్లీ కాఫీ తెమ్మన్నాను.

"ఏమిస్తా రండి?" అన్నాడు.

"వెండి మరచెంబు" అన్నాను గమ్మత్తుకి.

"నాజన్మలో ఆ మరచెంబు ముట్టుగో" నన్నాడు. మేమంతా ఘొల్లున నవ్వాము. ★

కాలక్షేపం

(9-వ పేజీ తరువాయి)


కాలమూ, ఆత్మలతుగ జ్ఞానం లేకుండా ప్రవర్తించడమే అవుతుంది. రాయలసీమ ఆత్మవికాసం పొందవలెనంటే, ఆ ప్రత్యేక విశిష్టభావమును విసర్జించాలి. రాయలసీమ అనేది ప్రత్యేక విభక్తభావంతో ఉన్నంత కాలమూ దానికి ఆత్మవికాసం కలుగదు. కర్నూలువంటి పట్టణమును ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా కోరుకోనడంలో రాయలసీమవారికి సిద్ధించిన స్వార్థం ఏమిటో అర్థముగుటలేదు. కాని, మిగిలిన జిల్లాల వారికందరికీ కష్టనష్టములను కలుగజేస్తున్నారు. తమకై అన్యహితార్థ ఘాతుకములు చేసే జనులను "రాక్షసులు" అని సుభాషితకర్త వ్యక్తీకరించాడు. కాని, వృధాగా యితరులకు నష్టం కలుగచేసేటటువంటి వారిని ఏమని పిలువవలెనో తెలియడంలేదన్నాడు.

"వృధాస్వార్థ భంగము గావించెడువార లెవ్వరో యెరుంగన్ శక్యమే ఏరికిన్" అనే ప్రశ్నకు ప్రస్తుతం ఒక్కటే జవాబు. అటువంటివా రెవరనగా, "ఆంధ్ర కాంగ్రెసు పక్ష ప్రజాసోషలిస్టు పక్ష కృషికారులోక పక్ష అసెంబ్లీ సభ్యులు." వేంకటవరద సీతారామ "సూర్యప్రకాశ రావు" అన్నట్లుగా వారిపేరు పూసలపేరు వలె పెద్దదైనా కీర్తి గొప్పది కాదు. ★

'బైసికిల్ తీవ్స్ సమీక్ష'

(49-వ పేజీ తరువాయి)

వచ్చే ప్రశ్నలలో ఎక్కువభాగం అసభ్యంగా వుండేవి. తారల ఎడ్రెసులు అడుగుతూ కొన్ని, వారి వయస్సు, కులగోత్రాలు అడుగుతూ కొన్ని, వారి ప్రైవేటు జీవితాన్ని గూర్చి అడుగుతూ కొన్ని, ప్రశ్నలు వచ్చేవి. ఇవన్నీ బుట్ట దాఖలు కావటంతో వచ్చే ప్రశ్నల్లో కూడా మార్పు రాసాగింది. ఇప్పు డెక్కువగా సినిమా కళని గూర్చి, తయారులో ఉన్న చిత్రాలను గూర్చి ప్రశ్నలు వస్తున్నాయి. ఈ ఒక్క విషయాన్ని బట్టే గ్రహించవచ్చు: నిర్మాతలు ఏ ధోరణిని ప్రోత్సహిస్తే ప్రేక్షకులు కూడా ఆ ధోరణినే చాలవరకు అనుసరిస్తారు. ఈ సంగతి గమనించనట్టు నటిస్తూ "మేము కేవలం ప్రేక్షకుల అభిరుచుల ప్రకారమే చిత్రాలు తీస్తున్నా"మని నిర్మాతలు చేసే వాదన ఆత్మవంచన, పరవంచనా కూడాను. ★



సింప్సన్, మెయిల్, హిగిన్‌బాదమ్స్ సంస్థల అధిపతి శ్రీఅనంత రామకృష్ణన్‌గారి కుమార్తె వివాహ సందర్భంలో తీసిన ఫొటో. వధూవరులు సౌ. కళ్యాణి వి. సుందరం.


Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt, Madras



... కోటి విద్యలు

ఫోటో—శ్రీ ఎస్. ఎస్. శర్మ (తేలప్రోలు)

త్వరలో
వస్తూంది!



పక్షిరాజా వారి ...

ఒక తల్లి పిల్లలు

చమ్రియా రిలిజు

BHARAT
STUDIO